

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI



శ్రీవారికి రూ.2 కోట్ల వైజయంతి వజ్రహారాలు 14

శుక్రవారం | 15-11-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 210 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం; తిథి: పౌర్ణమి రా. 2.58 తదుపరి పాడ్యమి; నక్షత్రం: భరణి రా. 9.55 తదుపరి కృత్తిక; వర్జ్యం: ఉ.9.05 -10.31; దుర్ముహూర్తం: ఉ. 8.38-9.22, మ. 12.22-1.06; అమృతఘడియలు: రా. 5.38-7.04; రాహుకాలం: ఉ. 10.30-12.00; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శాసనసభ కొత్త డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజును సభాపతి స్థానంలో కూర్చోబెట్టిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, స్పీకర్ అయ్యన్నపాత్రుడు, బీజేపీ పక్ష నేత వి విష్ణుకుమార్‌రాజు, మంత్రులు సత్యకుమార్, అచ్చెన్నాయుడు

తల్లిని అవమానిస్తే సహించాలా?

శాసన మండలిలో విరుచుకుపడ్డ మంత్రి లోకేశ్



- అసెంబ్లీలో నా తల్లిని అవమానించారు.. ఆ తర్వాతే సభను బాబు బహిష్కరించారు
- గౌరవ సభగా మారాకే వస్తానన్నారు.. ఆయన పారిపోలేదు.. సింహంలా నిలబడ్డారు
- నాడు టీడీపీ ఎమ్మెల్యేలంతా సభకు హాజరయ్యారు.. నేడు వైసీపీ ఎమ్మెల్యేలు రారేం?
- మీలాగా మేం ఎన్నడూ మాట్లాడలేదు: లోకేశ్
- నాటి ఘటనలను సమర్థించడంలేదన్న విపక్ష నేత బొత్స
- టికెట్లు ఇవ్వడం సమర్థించడం కాదా అని లోకేశ్ ప్రశ్న

మండలిలో మంటలు

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో విపక్షంపై మంత్రి నారా లోకేశ్ నిప్పులు చెరిగారు. చంద్రబాబు తమ హయాంలో శాసనసభకు రాకుండా పారిపోయారంటూ వైసీపీ సభ్యులు చేసిన వ్యాఖ్యలపై విరుచుకుపడ్డారు. నాడు అసెంబ్లీలో చంద్రబాబు సింగిల్‌గా, సింహంలా నిలబడ్డారని తెలిపారు. తన తల్లిని

మిగతా 13వ పేజీలో...

ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్!

- ఆర్‌ఆర్‌ఆర్‌ను నాడు రాష్ట్రానికి రానివ్వలేదు
- లాఠీలు, రబ్బరు బెల్టులతో కొట్టారు
- చంపేస్తామని బెదిరింపు.. చంపడానికీ ప్లాన్
- నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది
- శాసనసభలో సీఎం చంద్రబాబు వ్యాఖ్యలు

సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లు తేవాలి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అలాంటి పోస్టులు పెడితే అరెస్ట్ చేయరా?

- వ్యాజ్యంపై అత్యవసరంగా విచారించలేం
- ముందస్తు బెయిల్‌కూ హైకోర్టు నిరాకరణ
- విచారణ వారం రోజులకు వాయిదా



అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో పోలీసులు అరెస్ట్ చేసే ప్రమాదం ఉందని, తాను దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలన్న ఓ వ్యక్తి అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. ఎదుటివాళ్లను బాధించే పోస్టులు పెడితే అరెస్టు చేయరా అని ప్రశ్నించింది. పిటిషన్‌పై సాధారణ పద్ధతిలోనే విచారణ జరుపుతామని స్పష్టం చేసింది. విచారణను వారం రోజులకు

మిగతా 2వ పేజీలో...





పోసానిపై ఫిర్యాదుల వెల్లువ 2

- 22 చోట్ల ఫిర్యాదులు.. 5 కేసులు
- అనంతపురంలో దిష్టిబొమ్మ దహనం
- శ్రీరెడ్డిపై 4 ఫిర్యాదులు.. 3 కేసులు నమోదు

కావాలనే..

కాల్చేశారు

మంటల్లో ‘మదనపల్లె ఫైల్స్’

నాడు పక్కా పథకం ప్రకారమే సబ్ కలెక్టర్ ఆఫీసుకు నిప్పు

- భూ అక్రమాలను సమాధి చేసేందుకే
- అడ్డగోలుగా పెద్దిరెడ్డి మనుషుల అసైన్డ్ భూముల దోపిడీ
- అవినీతిలో మునిగి తేలిన ‘రెవెన్యూ’
- మదనపల్లె ఆర్డీవో, మాజీ ఆర్డీవో అండ
- ఫైళ్లు తారుమారు.. కుట్రతో నిప్పు
- పెద్దిరెడ్డి పీఏ, అనుచరుడి పాత్ర
- రెవెన్యూ శాఖ అభియోగాలు నమోదు



మంటల్లో మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసు.. కాలిన ఫైళ్లు (ఫైల్)

మదనపల్లె మాజీ ఆర్డీవో మురళి, ఆర్డీవో హరిప్రసాద్ అవినీతిలో మునిగి పోయారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మనుషులకు అడ్డగోలుగా భూములను ఫ్రీ హోల్డ్ చేశారు. అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకు పక్కా పథకం ప్రకారమే సబ్ కలెక్టర్ ఆఫీసుకు నిప్పుపెట్టారు. పెద్దిరెడ్డి పీఏ తుకారామ్, ఆయన ప్రధాన అనుచరుడు మాధవరెడ్డి, మాజీ ఆర్డీవో మురళి ఆదేశాల మేరకు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ ఈ కుట్రను అమలు చేశారు.

\- రెవెన్యూ శాఖ



పెద్దిరెడ్డి



గౌతమ్ తేజ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసుకు పథకం ప్రకారమే నిప్పు పెట్టారని రెవెన్యూ శాఖ ప్రాథమికంగా నిర్ధారించింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మనుషులు భారీగా భూ అక్రమాలకు పాల్పడ్డారని, ఇందుకు రెవెన్యూ అధికారులు సహకరించారని తేల్చింది. ఈ అక్రమాలను సమాధి చేసేందుకే ఆఫీసుకు నిప్పు పెట్టారని విచారణలో గుర్తించింది. మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసు దహనం కేసులో రెవెన్యూ శాఖ పలు అభియోగాలు నమోదు చేసింది. మదనపల్లె మాజీ ఆర్డీవో ఎస్.మురళి, ఆర్డీవో సి.హరిప్రసాద్ (ఘటన జరిగినపుడు), సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌పై తీవ్ర అభియోగాలు మోపింది. వాటిపై పది రోజుల్లోగా లిఖిత పూర్వక సమాధానం (డిఫెన్స్ స్టేట్‌మెంట్) ఇవ్వాలని ఆదేశిస్తూ గురువారం రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి

మిగతా 14వ పేజీలో...

29న రాష్ట్రానికి ప్రధాని రాక 12



- ఎన్టీపీసీ ‘గ్రీన్’ ప్రాజెక్టులకు శంకుస్థాపన
- 80 వేల కోట్ల పెట్టుబడి.. 48 వేల మందికి ఉపాధి
- విశాఖలో ఇప్పటికే 1200 ఎకరాలు కేటాయింపు

‘కృష్ణపట్నం సిటీ’కి మహర్దశ



[ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ]

- సీబీఐసీకి త్వరలో ప్రధాని మోదీ శంకుస్థాపన
- 2026 నాటికి పారిశ్రామిక స్మార్ట్ సిటీ ఏర్పాటు
- మూడు దశల్లో 11,098 ఎకరాలు అభివృద్ధి
- తొలి దశలోనే దాదాపు లక్ష మందికి ఉపాధి
- జగన్ హయాంలో నత్తనడకన నోడ్‌ల పనులు
- శరవేగంగా భూసేకరణ పూర్తిచేసిన చంద్రబాబు
- ‘ఆంధ్రజ్యోతి’తో ఎన్ఐసీడీసీ ఎండీ రజత్ కుమార్

న్యూఢిల్లీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో తొలి గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్ సిటీగా ‘కృష్ణపట్నం సిటీ’ రూపుదిద్దుకోనుందని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్ఐసీడీసీ) సీఈవో, ఎండీ రజత్‌కుమార్ సైనీ పేర్కొన్నారు. ‘ఆంధ్రజ్యోతి’కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ సిటీ సమగ్ర వివరాలను వెల్లడించారు. కృష్ణపట్నం

మిగతా 14వ పేజీలో...



పూనూరు గౌతంరెడ్డి

పక్కాగా రెక్కీ

హత్య కుట్రకు సూత్రధారి గౌతంరెడ్డే

- వైసీపీ నేత అరాచకాలు వెలుగులోకి..
- బెజవాడ కబ్జా కేసులో కొత్త విషయాలు
- ఓ గ్యాంగ్‌కు సుపారీ.. రెండుసార్లు రెక్కీ
- ఈనెల 6న శాస్త్రి ఇంట్లోకి వెళ్లి విచక్షణారహితంగా దాడి
- వివరాలు వెల్లడించిన బెజవాడ సీపీ
- పరారీలో గౌతంరెడ్డి, మరో ఐదుగురు
- ఆయనపై ఇప్పటికే 42 కేసులు

విజయవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సత్యనారాయణపురంలో వైసీపీ ట్రేడ్ యూనియన్ నేత పూనూరు గౌతంరెడ్డి దారుణాలు బయటపడ్డాయి. కబ్జా కేసులో స్థల యజమాని గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై జరిగిన దాడిలో కొత్త విషయాలు వెలుగులోకి వచ్చాయి. హత్య కుట్ర వెనుక కర్త, కర్మ, క్రియ అంతా గౌతంరెడ్డేనని స్పష్టమైంది. ఉమామహేశ్వరశాస్త్రిపై దాడికి గౌతంరెడ్డి సుపారీ ఇచ్చినట్టు పోలీసులు నిర్ధారించారు. ఈ కేసులో ప్రస్తుతం నలుగురు

మిగతా 14వ పేజీలో...

227 ఎంవోయూలు.. పైసా రాలేదు

ఐదేళ్ల జగన్ పరిపాలన నిర్వాకం ఇదీ: చంద్రబాబు 13

- పన్నులు, కరెంటు చార్జీలు పెంచడంతో నాడు కుంటుబడ్డ పరిశ్రమల మనుగడ
- ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బందులు.. రాష్ట్రం నుంచి కంపెనీలు పారిపోయాయి
- గాడిలో పెట్టేందుకే సూపర్ 6 పాలసీలు.. పరిశ్రమలకు సత్వర అనుమతులే లక్ష్యం
- 30 లక్షల కోట్ల పెట్టుబడులు.. 20 లక్షల ఉద్యోగాలు.. రూ.83 వేల కోట్ల ఎఫ్‌డీఐలు
- ఎన్టీపీసీ, జెన్కోల రూ.84,700 కోట్ల భారీ పెట్టుబడి.. శాసనసభలో సీఎం వెల్లడి

11 గెలిచి మీరు ఏం ఘనత సాధించారు?

- సభలో ప్రభుత్వాన్ని ఎండగట్టినప్పుడు
- జగనైనా, నేనైనా ఒక్కటే: షర్మిల 12

డిగ్రీ రెండున్నరేళ్లలోనే!

- 4 ఏళ్ల డిగ్రీ మూడేళ్లలో చేసే అవకాశం 2
- నిదానంగా చదివేవారికి మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లలో చేసే చాన్స్.. యూజీసీ నిర్ణయం



బంగారు గనిలో బందీ

- మూసేసిన గనిలోకి 4 వేల మంది పిల్లలు
- ఆకలి దప్పులతో అల్లాడుతున్న వైనం 2
- బయట ద్వారాలు మూసేసిన సర్కారు
- నేరస్థులకు సహకరించేది లేదని స్పష్టం
- దక్షిణాఫ్రికా నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లో ఘటన



2

ఆ వ్యాఖ్యలు నీచం

- అవమానకరమైనవి కూడా..
- కస్తూరి వ్యాఖ్యలు హింసను ప్రేరేపించేవే
- తెలుగువారి మనోభావాల్ని దెబ్బతీశారు
- ఆమె విచారణను ఎదుర్కోవాల్సిందే
- మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం



అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తులసి

» 20 ఏళ్లు సైన్యంలో సేవలు

» 2022లో డెమొక్రటిక్‌ను వీడి రిపబ్లికన్ వైపు


వాషింగ్టన్, నవంబరు 14: అమెరికా ఇంటెలిజెన్స్ చీఫ్‌గా తులసి గబార్డ్ నియమితులయ్యారు. అమెరికాకు మొట్టమొదటి హిందూ ఇంటెలిజెన్స్ చీఫ్ తులసి కావడం గమనార్హం.! అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ గెలిచిన వెంటనే.. కీలక పదవుల్లో రిపబ్లికన్లను నియమిస్తున్నారు. అత్యంత కీలక పదవులను సాధించిన వారిలో ఈలాన్ మస్క్, వివేక్ రామస్వామితో పాటు.. తులసి ఉన్నారు. అమెరికా వ్యాప్తంగా ఉన్న 18 నిఘా సంస్థలకు ఆమె డైరెక్టర్‌గా వ్యవహరిస్తారు. తులసి గబార్డ్ హిందువే అయినా.. భారత్‌తో ఆమెకు గానీ, ఆమె పూర్వీకులకు గానీ ఎలాంటి సంబంధాలు లేవు. తులసి 1981 ఏప్రిల్ 12న అమెరికాలోని లియోనోలాలో జన్మించారు. ఆమె తల్లి కారోల్ ఇండియానాకు చెందిన వారు. తులసికి రెండేళ్ల వయసున్నప్పుడే వీరి కుటుంబం హవాయీ దీవుల్లో స్థిరపడింది. తులసి గబార్డ్‌ను అంతా భారతీయ మూలాలున్న వ్యక్తి అనుకుంటారు. అయితే.. తాను అమెరికన్‌నే అని 2012లోనే తులసి స్పష్టంచేశారు. 2013 నుంచి ఆమె హవాయీ పార్లమెంట్ సభ్యురాలిగా ఉన్నారు. తొలి హిందూ మహిళా పార్లమెంట్ సభ్యురాలు కూడా తులసి కావడం గమనార్హం.! పార్లమెంట్‌లో ప్రమాణ స్వీకారం సమయంలో ఆమె భగవద్గీతపై ప్రమాణం చేసి, అందరినీ ఆకట్టుకున్నారు. తులసి వివాహం సినిమాటోగ్రాఫర్ అబ్రహం విలియమ్స్‌తో జరిగింది. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌లో పట్టా పుచ్చుకున్న తులసి.. 20 ఏళ్లపాటు అమెరికా ఆర్మీ.. నేషనల్ గార్డ్స్‌లో సేవలందించారు. నిజానికి తులసి డెమొక్రటిక్ పార్టీలో చురుగ్గా ఉండేవారు. 2020 అధ్యక్ష ఎన్నికల రేసులోనూ నిలిచారు. పార్టీలో ప్రాధాన్యం లేకపోవడంతో 2022లో రిపబ్లికన్ పార్టీలో చేరారు. ఇటీవలి ఎన్నికల్లో ట్రంప్‌ను ముందుండి నడిపించిన వారిలో తులసి ఒకరు.



బోయింగ్‌లో 17 వేల మంది ఉద్యోగుల తొలగింపు!

న్యూయార్క్, నవంబరు 14: బోయింగ్ సంస్థ.. అంతర్జాతీయంగా ఉద్యోగుల సంఖ్యను తగ్గించుకునే ప్రణాళికలో భాగంగా దాదాపు 17వేల మందికి నోటీసులు జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. మొత్తం ఉద్యోగుల్లో ఇది 10శాతం. అమెరికాలోని ఉద్యోగులకు నోటీసులు ఇస్తున్నట్లు సంస్థ తెలిపింది. అయితే నోటీసులిచ్చిన ఉద్యోగులకు జనవరివరకు వేతనాలు చెల్లిస్తామని పేర్కొంది. "మా వాస్తవ ఆర్థిక పరిస్థితులకనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని నిర్ణయించాం. అలాగే ప్రాధమ్యాలపై మరింత దృష్టిపెట్టనున్నాం"అని బోయింగ్ ప్రకటించింది.

లోకం తీరు



పోసానిపై ఫిర్యాదుల వెల్లువ

» 22 చోట్ల ఫిర్యాదులు.. 5 కేసులు.. శ్రీరెడ్డిపై 4 ఫిర్యాదులు.. 3 కేసులు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడుపై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలు చేసిన సినీ నటుడు, వైసీపీ నేత పోసాని కృష్ణమురళిపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. గురువారం ఒక్కరోజే ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా 22 ప్రాంతాల్లోని పోలీసుస్టేషన్లలో టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదులు చేశారు. వీటిలో ఐదుచోట్ల పోలీసులు కేసులు నమోదు చేశారు. అనంతపురంలో పోసాని దిష్టి బొమ్మను తెలుగు యువత, ఎస్సీ సెల్ నాయకులు దహనం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను అసభ్యకరంగా దూషించారంటూ నమోదైన కేసులో విచారణకు హాజరు కావాలని పోసానికి రెండు, మూడు రోజుల్లో నోటీసులు జారీ చేస్తామని విజయవాడ భవానీపురం పోలీసులు తెలిపారు. కాగా, సీఎం చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి వంగలపూడి అనిత పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తూ, ఆ వీడియోలను అప్‌లోడ్ చేసిన సినీ నటి శ్రీరెడ్డిపై నాలుగు పోలీసు స్టేషన్లలో ఫిర్యాదులు చేయగా, మూడు కేసులు నమోదయ్యాయి.

గుంటూరు మేయర్‌పై చర్యలు తీసుకోండి

సీఎం. డిప్యూటీ సీఎం, మంత్రి లోకేశ్‌ను అసభ్య పదజాలంతో దూషించిన గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడిపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు వెస్ట్ డీఎస్పీ జయరామ్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. కాగా, ఎమ్మెల్యే యనమల దివ్య, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడుపై అసభ్యకర పోస్టులు పెట్టడంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక పోస్టులు పెట్టారన్న ఆరోపణలపై తొండంగి గ్రామానికి చెందిన నాగం గంగబాబు, శృంగవృక్షం గ్రామానికి చెందిన అడపా సురేష్‌ను తుని రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. అలాగే గొల్లప్రోలు మండలం చినజగ్గంపేట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్త సారిపల్లి వెంకటరమణను గొల్లప్రోలు పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

కెనడా మా సొంతం
మీరు ఇంగ్లాండ్ వెళ్లిపోండి

» స్థానికులకు ఖలిస్థాన్‌వాదుల హెచ్చరిక

అట్టావా, నవంబరు 14: కెనడాలో ఖలిస్థాన్ సానుభూతిపరులు మరో వివాదానికి తెరతీశారు. ఇంతవరకు హిందువులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేసిన వారు తాజాగా స్థానికులైన కెనడా వాసులనే హెచ్చరించడం ప్రారంభించారు. తమ కష్టాలకు భారతదేశమే కారణమంటూ నిందిస్తూ వచ్చిన ఖలిస్థాన్ వాదులు ఇప్పుడు స్థానికులపై విమర్శలు గుప్పిస్తున్నారు "మీరంతా దురాక్రమణదారులు. తిరిగి ఇంగ్లండ్, యూరోప్‌లకు వెళ్లిపోండి" అని హెచ్చరించారు. ఇటీవల జరిగిన నగర సంకీర్తనలో పాల్గొన్న కొందరు వ్యక్తులు ఇలాంటి హెచ్చరిక చేస్తూ రెండు నిమిషాల నిడివిగల వీడియోను విడుదల చేశారు. "ఇది కెనడా. మా సొంత దేశం. మీరు సొంత దేశాలకు తిరిగి వెళ్లిపొండి" అని హెచ్చరించడం అందులో కనిపించింది. దీనిపై భారత నిఘా వర్గాలు స్పందిస్తూ కెనడాలో ఇలాంటి సంఘటనలు ఇటీవల కాలంలో సర్వసాధారణమయ్యాయని అభిప్రాయపడ్డాయి. అక్కడ తగిన నిఘా లేకపోవడంతో వారు అన్ని వ్యవస్థలను అదుపు చేస్తున్నారని తెలిపాయి. భద్రంగా ఉండాలం టే డబ్బులు చెల్లించాలని డిమాండు చేస్తూ వచ్చిన వారు ఇప్పుడు స్థానికులను కూడా అదే విధంగా హెచ్చరిస్తున్నారని పేర్కొన్నాయి. ఖలిస్థాన్ సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకొని ఇండియా ఏజెంట్లు పనిచేస్తున్నారంటూ సాక్షాత్తూ కెనడా ప్రధాని జస్టిస్ ట్రూడో ప్రకటించిన దగ్గర నుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఇరుదేశాల దౌత్యవేత్తలను పరస్పరం బహిష్కరించుకునే వరకు పరి స్థితి వెళ్లింది. ట్రూడో ఆరోపణలను ఖండించిన భారత్.. ఖలిస్థాన్ ఉగ్రవాదులకు ఆయనే ఆశ్రయం కల్పిస్తున్నారని ప్రత్యారోపణ చేసింది. ఖలిస్థాన్‌వాదులు భారత్‌లో అల్లర్లు సృష్టించడానికి కుట్ర పన్నుతుండడంతో పాటు, కెనడాలోని హిందువులపైనా దాడులు చేస్తున్నారని తెలిపింది. ప్రజాదరణ కోల్పోయిన తన పార్టీ ఎంపీ జగ్మీత్ సింగ్‌ను వచ్చే ఏడాదిలో జరిగే ఎన్నికల్లో గెలిపించడానికే ట్రూడో ఖలిస్థాన్‌వాదులకు మద్దతు ఇస్తున్నారని భారత నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. అందుకే ఎలాంటి ఆధారాలు లేకుండానే భారత్‌పై ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నాయి. 'ప్రతిదానికీ భారత్‌ను నిందిస్తూ ట్రూడో చిన్నపిల్లాడిలా వ్యవహరిస్తున్నారు. ఐఎస్ఐ, ఖలిస్థాన్‌వాదుల చేతిలో చిక్కుకొని ఎంత ప్రమాకరమైన ఆట ఆడుతున్నారో గుర్తించడం లేదు. రెండు దేశాల మధ్య ఉన్న సంబంధాలను దెబ్బ తీస్తున్నారు" అని వ్యాఖ్యానించాయి. కొందరు ఇచ్చిన సమాచారం ఆధారంగా ఖలిస్థాన్ సానుభూతిపరుల హత్యలో భారత్ హస్తం ఉందంటూ ఆరోపణలు చేశానని ట్రూడో గతంలో చెప్పారు. అయితే ఆ నాయకుల పేర్లు చెబి తే వారి గుణగణాలతో పాటు అన్ని వివరాలు చెబుతామని నిఘా వర్గాలు అంటున్నాయి. కెనడా పార్లమెంటు మొత్తం ఖలిస్థాన్ సానుభూతిపరులతో నిండిపోయింది. వారు ట్రూడోపై కూర్చొని స్వారీ చేస్తున్నారు. కొందరు వ్యక్తులు చెప్పిన మాట లు నమ్మి ఆయన భారత్‌పై ఎలా ఆరోపణలు చేయగలుగుతారు?" అని నిఘా వర్గాలు వ్యాఖ్యానించాయి.

కెనడాలో మారుతున్న పరిస్థితుల్లో త్రిశంకు స్వర్గంలో తెలుగు యువత

» మనోవ్యధతో మానసిక రుగ్మత

» శ్రమ దోపిడీ చేస్తున్న వ్యాపారస్థులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

ఉత్తర అమెరికాలో తేలిగ్గా శాశ్వత నివాస వసతి పొందే అవకాశాలున్న కెనడాలో బంగారు భవిష్యత్తు కోసం వచ్చిన తెలుగువారు సహా వేల మంది భారతీయ యువకులు దేశంలో మారుతున్న నివాస వీసా నిబంధనలు, సన్నగిల్లుతున్న ఉపాధి అవకాశాల కారణంగా అయోమయంలో కొట్టామిట్టాడుతున్నారు. దీనికితోడు ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణిస్తుండటంతో వీరు అగమ్యగోచర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. పార్ట్‌టైం ఉద్యోగాలపై ఆశతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అప్పులు చేసి కెనడాకు రాగా మరోవైపు ఆశించిన విధంగా ఉపాధి అవకాశాలు లేక వీసా గడువు సమీపిస్తుండటంతో నిరాశ నిస్పృహలో కొట్టుమిట్టాడుతున్నారు. ప్రతికూల పరిస్థితుల కారణంగా అనేక మంది మానసిక రుగ్మతలకు గురై మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారుతుండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సునాయసంగా లభించే శాశ్వతనివాస వీసా, పుష్కల ఉపాధి అవకాశాల కారణంగా కొద్దికాలం క్రితం వరకు భారతీయ విద్యార్థులకు కెనడా ఒక భూతల స్వర్గంగా మారింది. కెనడాలోని విదేశీ విద్యార్థుల్లో దాదాపు సగం కంటే ఎక్కువమంది భారతీయులే ఉండటం గమనార్హం. టొరంటో, వాంకోవర్, మోంట్రియల్, ఒట్టవాతో సహా దేశవ్యాప్తంగా ఇంటి అద్దెలు, జీవన వ్యయం పెరుగుతుండటం, ఉపాధి అవకాశాలు లేకపోవడం జీవన్మరణ సమస్యగా మారుతోంది. ఒక వైపు ఉద్యోగాలు లేక మరోవైపు తినడానికి సరిగ్గా తిండి కూడా లేక అవస్థలు పడుతున్నామని తమ దీనస్థితి గురించి స్వదేశంలోని తల్లిదండ్రులకు చెప్పుకోలేకపోతున్నట్లుగా కొందరు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల్లో అత్యధికులు ఇక్కడ క్లీనర్లు, వెయిటర్లుగా పని చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేయడమే గొప్ప అని మురిసిపోయే పరిస్థితి దాపురించింది. నిబంధనలకు విరుద్ధంగా 20 గంటలకు మించి అడ్డదారిలో నగదు విధానం కింద పనిచేస్తే సాధారణంగా ఈ అడ్డదారిన పని ఇచ్చే పంజాబీ, గుజరాతీ, తెలుగువాళ్లు కొందరు సగానికి సగం వేతనం తగ్గించి ఇవ్వడం.. అనేక సందర్భాలలో దాన్ని కూడా ఎగ్గొడుతూ శ్రమదోపిడీ చేస్తున్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి.

కెనడాకు నో.. ఆస్ట్రేలియాకు సై!

» మారుతున్న భారత విద్యార్థుల ప్రాధాన్యతలు

న్యూఢిల్లీ, నవంబరు 14: కెనడా వీసా విధానంలో మార్పుల నేపథ్యంలో భారతీయ విద్యార్థుల ప్రాధాన్యతలు మారుతున్నాయి. ఉన్నత చదువుల కోసం ఆస్ట్రేలియా, యూరప్ దేశాలకు వెళ్లడానికి ఆసక్తి చూపుతున్న వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. భారత్ సహా 16 దేశాలకు చెందిన విద్యార్థులు త్వరగా వీసాలు పొందడానికి సహాయపడే ఫాస్ట్‌ట్రాక్ స్టూడెంట్ డైరెక్ట్ స్ట్రీమ్ ప్రోగ్రామ్‌తోపాటు నైజీరియా స్టూడెంట్ ఎక్స్‌ప్రెస్ పథకాన్ని కెనడా రద్దు చేసింది. కెనడాలో ఉద్యోగం రావడం వల్ల శాశ్వత నివాసం పొందడానికి అవకాశం కల్పించే పోస్టు గ్రాడ్యుయేషన్ వర్క్ పర్మిట్ల అర్హతల్లోనూ ట్రూడో ప్రభుత్వం గతేడాది మార్పులు చేసింది. ఈ ఏడాది జనవరిలో అంతర్జాతీయ విద్యార్థి అనుమతులపై రెండేళ్ల పరిమితిని విధించింది. ఈ కొత్త నిబంధనలతో కెనడా వెళ్లాలనుకున్న భారత విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు.

అలాంటి పోస్టులుపెడితే అరెస్ట్ చేయరా?

(మొదటి పేజీ తరువాయి)

వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లిఖార్జునరావు గురువారం ఉత్తర్వులు ఇచ్చారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆయన కుటుంబం ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అసభ్యకర పోస్టులు పెట్టాననే ఆరోపణతో తిరుపతి తూర్పు థానా పోలీసులు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విశాఖకు చెందిన గొర్లి సత్య నీరజ్‌కుమార్ నాయుడు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం గురువారం విచారణకు రాగా, పిటిషనర్ తరపు న్యాయవాది టీఎంకే చైతన్య స్పందించారు. పోలీసులు అరెస్టు చేస్తారనే ఆందోళనలో పిటిషనర్ ఉన్నారని, పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. అరెస్టు నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని అభ్యర్థించారు. అయితే, ఈ వాదనలను న్యాయమూర్తి తోసిపుచ్చారు.

వర్రా కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెన్షన్

కడప, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ సోషల్ మీడియా కన్వీనర్ వర్రా రవీంద్రారెడ్డిని తప్పించిన కేసులో ఇద్దరు కానిస్టేబుళ్లు సస్పెండ్ అయ్యారు. వారిని డీఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిసింది. ఈనెల 6వ తేదీన వర్రాను కడప పోలీసులు అరెస్టు చేసి కడపకు తీసుకెళ్లి 41ఏ నోటీసు ఇచ్చి వదిలేశారు. అనంతరం ప్రభుత్వ పెద్దల నుంచి తీవ్ర హెచ్చరికలు రావడంతో వెంటనే వర్రా రవీంద్రారెడ్డిని అరెస్టు చేసేందుకు పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ సమయంలో పులివెందుల నియోజకవర్గానికి చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు వర్రాకు ఇక్కడ జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు చేరవేసినట్లు తెలిసింది. ఈ ఘటనలో ఇప్పటికే కడప జిల్లా ఎస్పీ బదిలీ, సీఐ సస్పెండ్ అయ్యారు.

సౌతాఫ్రికాలో బంగారు గనిలో 4వేల మంది బందీ

న్యూఢిల్లీ, నవంబరు 14: సౌతాఫ్రికాలో మూసివేసిన ఓ బంగారు గనిలో తవ్వకాలు జరిపేందుకు 4వేల మంది అక్రమంగా ప్రవేశించారు. నార్త్‌వెస్ట్ ప్రావిన్స్‌లోని స్టిఫోంటిన్ ప్రాంతంలోని గనిలో బంగారం దొరుకుతుందనే ఆశతో వారు గనిలోకి వెళ్లినట్లు తెలుస్తోంది. ఇలా వెళ్లినవారంతా లోపలే ఉండిపోయారు. అక్రమ మైనింగ్‌పై ప్రత్యేక విధానం అమల్లో ఉండటంతో వీరిని కాపాడేందుకు దక్షిణాఫ్రికా ప్రభుత్వం ససేమిరా అంటోంది. నేరస్తులకు సాయం చేసేది లేదని ప్రకటించింది. వారు బయటకురాకుండా ద్వారాలను మూసివేసి.. నిత్యావసరాలు అందించకుండా చర్యలు చేపట్టింది.

రోత వ్యాఖ్యలతో బాధించా

» క్షమించండి.. కేసుల నుంచి తప్పించండి

» మంత్రి లోకేశ్‌కు నటి శ్రీరెడ్డి లేఖ

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : సామాజిక మాధ్యమాల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోమ్ మంత్రి అనితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో కేసులు ఎదుర్కొంటున్న సినీ నటి శ్రీరెడ్డి గురువారం మంత్రి లోకేశ్‌కు లేఖ రాశారు. తనను మన్నించాలంటూ ఇప్పటికే ఒకసారి వీడియోద్వారా లోకేశ్‌ను శ్రీరెడ్డి అభ్యర్థించారు. ఆ వీడియోలోని అంశాలనే లోకేశ్‌కు రాసిన లేఖ లో ఆమె ప్రస్తావించారు. "నా రోత భాషతో ఎంతమందిని బాధ పెట్టానో గత పదిరోజుల్లో జరిగిన పరిణామాలతో తెలుసుకున్నాను. టీడీపీ, జనసేన, వాటి అనుబంధ విభాగాల నేతలు, వారి కుటుంబాలు, కొన్ని పత్రికలు, చానల్స్‌పై జుగుప్సాకర వ్యాఖ్యలు చేశాను. అందుకు క్షమాపణలు కోరుతున్నాను. నన్ను కేసుల నుంచి బయటపడేయండి." అని ఆ లేఖలో శ్రీరెడ్డి కోరారు.

మీకూ,పార్టీకీ దూరమవుతున్నా..
జగన్,భారతికి శ్రీరెడ్డి లేఖ

మాజీ సీఎం జగన్,ఆయన సతీమణి భారతిరెడ్డికి తన తీరుతో బాధ కలిగించానని, అందువల్ల అందరికీ దూరంగా ఉండాలనుకుంటున్నానని నటి శ్రీరెడ్డి తెలిపారు. ఈ మేరకు జగన్,భారతిని ఉద్దేశించి ఆమె లేఖ రాశారు. వైసీపీ ప్రత్యర్థులను సోషల్‌మీడియాలో ఎదుర్కొంటున్నానని అనుకున్నానేగానీ, తనవల్ల పార్టీకి ఇంతనష్టం జరుగుతుందని తెలుసుకోలేకపోయానని ఆ లేఖలో పేర్కొన్నారు.

బోరుగడ్డకు మర్యాదలు.. నలుగురు పోలీసులపై వేటు

గుంటూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలో ఉండగా కూటమి నేతలపై రెచ్చిపోయిన రౌడీషీటర్ బోరుగడ్డ అనిల్‌కు కస్టడీలో రాచ మర్యాదలు చేసిన నలుగురు కానిస్టేబుళ్లపై సస్పెన్షన్ వేటు పడింది. ఇప్పటికే.. ఆయనను రాజమండ్రి కారాగారానికి తరలిస్తున్న సమయంలో.. మటన్ బిర్యానీ పెట్టించిన ఏడుగురు ఏఆర్ పోలీసులను సస్పెండ్ చేశారు. ఇప్పుడు... గుంటూరులోని అరండల్‌పేట పోలీసుల వంతు వచ్చింది. హెడ్ కానిస్టేబుళ్లు టి.శ్రీనివాసరావు (రైటర్), షేక్ సర్దార్, షేక్ గౌస్ మొహిద్దిన్, కానిస్టేబుల్ పరమేశ్వరరావులను సస్పెండ్ చేస్తూ గురువారం రాత్రి ఎస్పీ సతీశ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. వెరసి... బోరుగడ్డ కేసులో బలైపోయిన పోలీసుల సంఖ్య 11కు చేరింది. గత నెల 26న కోర్టు అనుమతితో ఆయనను పోలీసులు మూడు రోజులు తమ కస్టడీకి తీసుకున్నారు. పగలు పోలీసు అధికారులు విచారణ జరపగా... రాత్రివేళ మాత్రం ఆయనకు సిబ్బంది రాచ మర్యాదలు చేశారు. అర్ధరాత్రి వేళ బోరుగడ్డ మేనల్లుడు నేరుగా పోలీస్ స్టేషన్‌లోకి వచ్చాడు. మామ పక్కనే కుర్చీలో కూర్చొని అర గంటకుపైగా ముచ్చట్లు పెట్టాడు. వీటికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌లు బయటికి వచ్చాయి. మరోవైపు... పోలీస్ స్టేషన్ సీసీ కెమెరా ఫుటేజీ లీకేజీ ఘటనకు సంబంధించి ఇప్పటికే టెక్నీషియన్ శేషును అరెస్టు చేశారు. అరుణ్‌కుమార్ అనే విలేకరిపై కేసు నమోదు చేశారు. ఒక చానల్‌కు చెందిన కెమెరామన్‌కు గురువారం నోటీసులు ఇచ్చారు.

సీనియర్ కథారచయిత వుప్పల నరసింహం కన్నుమూత



హైదరాబాద్ సిటీ, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ కథారచయిత, కవి, మావోయిస్టు సిద్ధాంతంపై విమర్శనాత్మక రచనలు చేసిన వుప్పల నరసింహం(70) కన్నుమూశారు. గురువారం మధ్యాహ్నం గోల్నాకలోని స్వగృహంలో ఆయన ఒక్కసారిగా కుప్పకూలడంతో సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నరసింహం స్వస్థలం రంగారెడ్డి జిల్లా దేవరయాంజల గ్రామం. ఆంధ్రప్రభలో సుదీర్ఘకాలం పాత్రికేయుడిగా సేవలందించారు. మావోయిస్టు సిద్ధాంతాన్ని విమర్శిస్తూ 'రక్తచరిత్ర', 'జంగల్‌నామాపై జనం ప్రజా ప్రశ్న', 'విధ్వంసమే విప్లవమా?' తదితర రచనలు చేశారు. ఆయన రాసిన కథలు 'మట్టి మనిషి' సంపుటిగా వెలువడ్డాయి.

ఆధ్యాత్మిక విశిష్టత ప్రాచుర్యానికి రవిశంకర్ కృషి

» ఆ మార్గంలో ముందుకెళ్తాం: డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతి, భారతదేశ ఆధ్యాత్మిక విశిష్టత ప్రాచుర్యానికి ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు గురూజీ రవిశంకర్ గొప్ప మార్గం చూపించారని, ఆ మార్గంలో మనస్ఫూర్తిగా ముందుకెళ్తామని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. గురువారం మంగళగిరిలో రవిశంకర్.. పవన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ ఆధునిక యోగాలో సుదర్శన యోగా ప్రక్రియ ఎంతో విశిష్టమైనదని, దాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన గొప్ప వ్యక్తి గురూజీ రవిశంకర్ అని కొనియాడారు.



పండిట్ రవిశంకర్‌ను సత్కరిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

అవి నీచమైన, అవమానకరమైన వ్యాఖ్యలు

» కస్తూరి వ్యాఖ్యలు ముమ్మాటికీ హింసను ప్రేరేపించేలా ఉన్నాయి

» మద్రాస్ హైకోర్టు మదురై ధర్మాసనం

» ముందస్తు బెయిల్ పిటిషన్ కొట్టివేత



చెన్నై, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాజుల కాలంలో అంతఃపుర మహిళలకు సేవ చేయడానికి వచ్చిన వారే తెలుగువారంటూ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సినీనటి కస్తూరి పట్ల మద్రాస్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు ముమ్మాటికీ విద్వేష ప్రేరేపితమేనని తేల్చిచెప్పింది. ఇటీవల చెన్నైలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో కస్తూరి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. దీనిపై తమిళనాడులో పలు చోట్ల కేసులు నమోదవ్వగా, ముందస్తు బెయిల్ కోసం కస్తూరి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించారు. ఆమె పిటిషన్‌పై గురువారం న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేష్ నేతృత్వంలోని మదురై ధర్మాసనం విచారణ జరిపింది. ఇప్పటికే కస్తూరి క్షమాపణ చెప్పినందున కేసుల్ని కొట్టివేయాలని ఆమె తరఫు న్యాయవాది అభ్యర్థించగా, జాతివిద్వేష వ్యాఖ్యలు చేసిన కస్తూరికి ముందస్తు బెయిల్ ఇవ్వరాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది తేల్చిచెప్పారు. ఈ సందర్భంగా ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. 'వాక్ స్వాతంత్ర్యం అనేది వ్యక్తులు తమ ఆలోచనలు, నమ్మకాలు, అభిప్రాయాలను వ్యక్తపరచడానికి ఉన్న ప్రాథమిక హక్కు. అయితే ఆ మాటలు విద్వేషాన్ని వ్యాప్తి చేయడానికో, లేదా మత సామరస్యాన్ని దెబ్బ తీయడానికో దుర్వినియోగం చేయకూడదు. కస్తూరి వ్యాఖ్యలు ముమ్మాటికీ హింసను ప్రేరేపించేవిలా ఉన్నాయి. బహిరంగ వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సింది. ఆమె మాట్లాడినప్పుడు ప్రేక్షకుల నుంచి చప్పట్లు ఉండవచ్చు. కానీ, ఆ మాటలు తెలుగు ప్రజల మనోభావాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఇది మొత్తం తెలుగు ప్రజలను కించపరచినట్లయింది. మనలాంటి వైవిధ్యభరితమైన దేశంలో ఇలాంటి వ్యాఖ్యలు ఎలాంటి ప్రభావం చూపిస్తాయోనని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలి. ఇలాంటి నీచమైన, అవమానకరమైన వ్యాఖ్యలు చేసినవారెవరైనా చట్టప్రకారం విచారణను ఎదుర్కోవాల్సిందే' అని ధర్మాసనం తేల్చిచెప్పింది. కస్తూరి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను తోసిపుచ్చింది.

డిగ్రీ రెండున్నరేళ్లలోనే!

» 4 ఏళ్ల డిగ్రీ మూడేళ్లలో చేసే అవకాశం కల్పించనున్నట్టు ప్రకటించిన యూజీసీ

చెన్నై, నవంబరు 14: మూడేళ్ల డిగ్రీని రెండున్నరేళ్లలో, నాలుగేళ్ల డిగ్రీని మూడేళ్లలో పూర్తిచేసే అవకాశాన్ని కల్పించేందుకు యూజీసీ సిద్ధమైంది. కొద్దిగా నెమ్మదిగా చదివే విద్యార్థులకు మూడేళ్ల డిగ్రీని నాలుగేళ్లలో పూర్తిచేసే చాన్స్‌తోపాటు కోర్సు మధ్యలో విరామం ఇచ్చి మళ్లీ చేరే అవకాశాన్ని కల్పించనున్నట్టు యూజీసీ ఛైర్మన్ ఎం.జగదీశ్ కుమార్ ప్రకటించారు. గురువారం ఆయన చెన్నైలో మాట్లాడారు. ఈ ప్రతిపాదనలకు సంబంధించి ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి నేతృత్వంలోని కమిటీ సమర్పించిన నివేదికను బుధవారం ఆమోదించినట్టు తెలిపారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామన్నారు.

చింతమనేనిపై అట్రాసిటీ కేసులు కొట్టివేత

ఏలూరు క్రైం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌పై గతంలో నమోదైన కేసులపై ఏలూరులోని 8వ అదనపు జిల్లా కోర్టు (ఎస్సీ, ఎస్టీ కోర్టు)లో విచారణ సాగింది. ఆయనపై నేరం రుజువు కాకపోవడంతో రెండు కేసులను కొట్టివేస్తూ జడ్జి సునీల్‌కుమార్ గురువారం తీర్పు చెప్పారు. 2019లో పెదవేగి మండలం జగన్నాథపురంలో, 2016లో పెదపాడు మండలం కడిమిగుంటలో జరిగిన ఘటనల్లో ఎమ్మెల్యేపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసుల్లో చింతమనేనిపై నేరం రుజువు కాకపోవడంతో కేసులను కొట్టి వేశారు.



శ్రీవారి ఆలయం ముందు అరవింద్ కేజ్రీవాల్

శ్రీవారిని దర్శించుకున్న ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్

తిరుమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవం సందర్భంగా దేశంలోని పిల్లలు ప్రగతి పథంలో నడవాలని, అందరు బాగా చదువుకోవాలని శ్రీవారిని కోరుకున్నట్టు ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తిరుమల శ్రీవారిని గురువారం ఉదయం దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించడంతో పాటు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం కేజ్రీవాల్ ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. దేశ ప్రజలందరికీ మంచి జరగాలని, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామిని ప్రార్థించినట్టు తెలిపారు. ప్రతి ఒక్కరి కోరికలు నెరవేరి సంతోషంగా ఉండాలని, ప్రత్యేకించి ఢిల్లీ ప్రజలందరూ బాగుండాలని కోరుకున్నట్టు చెప్పారు. అలాగే ఢిల్లీ మంత్రి సత్యేంద్రకుమార్ జైన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు.

శ్రీవారి సేవలో శృంగేరి శారదా పీఠం ఉత్తరాధికారి



ఆలయం ముందు విధుశేఖర భారతీ తీర్థస్వామి

తిరుమల, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శారదాపీఠం ఉత్తరాధికారి విధుశేఖర భారతీ తీర్థస్వామి గురువారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. కాగా.. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. సనాతన ధర్మవ్యాప్తికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు.

పిల్లల్ని ప్రేమగా, జాగ్రత్తగా పెంచాలి



మాజీ ప్రధాని నెహ్రూకు నివాళులర్పిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

» గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పిల్లలు తోటలోని పూలమొగ్గల్లాంటి వారని, రెండింటినీ జాగ్రత్తగా, ప్రేమగా పెంచాలని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చెబుతుండేవారని గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ పేర్కొన్నారు. భారత తొలి ప్రధాని, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 135వ జయంతి సందర్భంగా రాజ్‌భవన్‌లో గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ జవహర్‌లాల్ నెహ్రూకు గులాబీలు, పిల్లలంటే చాలా ఇష్టమని చెప్పారు. దేశ భవిష్యత్తు రేపటి పౌరులని అన్నారు. దేశంలో విద్యారంగాన్ని రూపొందించడంలో నెహ్రూ సహకారాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. మొదటి ప్రధాన మంత్రిగా దేశం శాస్త్రీయ, పారిశ్రామిక పురోగతికి పునాది వేశారని కొనియాడారు.

బాలలకు మంచి భవిష్యత్ అందిద్దాం: సీఎం



అమరావతి, నవంబరు14 (ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక బలహీనతలు బాలల దరికి చేరకుండా వారికి మంచి భవిష్యత్‌ను అందిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. గురువారం బాలల దినోత్సవం సందర్భంగా 'ఎక్స్' వేదికగా పిల్లలకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. 'నేటి బాలలే రేపటి పౌరులు. అలాంటి వారి హక్కులను కాపాడటం, బాధ్యత గల పౌరులుగా వారిని తీర్చిదిద్దడం మన బాధ్యత. బాలల్ని సక్రమ మార్గంలో నడిచేలా చేస్తే దేశం కూడా అదే బాటలో పయనిస్తుందనడంలో సందేహం లేదు. దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున ఘనంగా బాలల దినోత్సవం జరుపుకొంటూ.. ఆయనకు నివాళులు అర్పిస్తూ.. బాలల హక్కులను కాపాడేందుకు సంకల్పం చేద్దాం' అని చంద్రబాబు పేర్కొన్నారు.

బాలల హక్కులు కాపాడటమే చిల్డ్రన్స్ డే కానుక: లోకేశ్



బాలల దినోత్సవం సందర్భంగా విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేశ్ పిల్లలకు శుభాకాంక్షలు తెలిపారు. 'చిరునవ్వుల చిన్నారులు.. భావి భారత చిరు దివ్వెలు.. బాలికల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసే విద్యాశాఖ మంత్రిగా బాధ్యత దక్కడం నా అదృష్టం' అని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. పిల్లల శారీరక, మానసిక వికాసానికి దోహదపడుతూ, వారి హక్కులు కాపాడటానికి శక్తి వంచన లేకుండా పని చేయడమే నేను ఇచ్చే చిల్డ్రన్స్ డే కానుక అని లోకేశ్ తెలిపారు.

ప్రేమించలేదని ఉన్మాదం

» యువతిపై ఇనుపరాడ్డుతో దాడి
» బాధితురాలికి తీవ్రగాయాలు, పరారీలో నిందితుడు





ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న డొంకాన మేఘన, దాడి చేసిన నీరజ్‌శర్మ

గాజువాక, నవంబరు 14: ప్రేమను నిరాకరించిందనే అక్కసుతో యువతిపై ఓ యువకుడు ఉన్మాదిలా మారి ఇనుపరాడ్డుతో దాడి చేశాడు. విశాఖ న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలోని పెదగంట్యాడ మండలం బాలచెరువు ప్రాంతంలో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలా ఉన్నాయి. బాలచెరువు ప్రాంతంలో డొంకాన పాపారావు కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఆయన కుమార్తె మేఘన (20) డిగ్రీ పూర్తిచేసింది. గతేడాది పాపారావు కుటుంబం మౌంట్ అబు వెళ్లింది. అక్కడ జమ్ము కశ్మీర్ ప్రాంతంలోని ఉధంపూర్‌కు చెందిన నీరజ్‌శర్మ (28)తో పరిచయం ఏర్పడింది. ఆ తర్వాత అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెడుతుండడంతో అతన్ని మేఘన దూరం పెట్టింది. అయినప్పటికీ తనను ప్రేమించాలంటూ కొంతకాలంగా ఆమెను వేధిస్తున్నాడు. దీంతో ఆమె గతంలో విశాఖ సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, అతన్ని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు బయటకు వెళ్లడంతో ఇంట్లో మేఘన ఒక్కతే ఉండగా నీరజ్‌శర్మ ఇనుప రాడ్డుతో దాడి చేశాడు. ఆమె అరుపులు విని పక్క ఇంట్లో ఉంటున్న వ్యక్తి వెళ్లగా, అతనిపై కూడా నీరజ్‌శర్మ దాడి చేశాడు. అనంతరం అక్కడ నుంచి పరారయ్యాడు. రక్తపు మడుగులో పడి ఉన్న మేఘనను చుట్టుపక్కలవారు షీలానగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమెకు ప్రాణాపాయం లేదని, తలపై దాదాపు 30 కుట్లు పడ్డాయని పోలీసులు తెలిపారు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రేమించలేదని కక్షతో హత్య చేసేందుకు యత్నించాడని మేఘన తండ్రి పాపారావు పేర్కొన్నారు. మార్ఫింగ్ చేసిన ఫొటోలను పంపేవాడని, అందుకే గతంలో సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. నిందితుడి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్టు హార్బర్ ఏసీపీ ఎన్.కాళీదాసు తెలిపారు.

నాటి మంత్రి ఉషశ్రీ తప్పుడు కేసులు పెట్టించారు

» టీడీపీ గ్రీవెన్స్ సెల్‌లో బాధితుడి మొర

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తేయాలని బాధితులు కోరారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్ సెల్ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అర్జీదారుల నుంచి వినతులు స్వీకరించారు. టీడీపీలో చురుగ్గా పనిచేస్తున్న తనపై కక్ష కట్టిన నాటి మంత్రి ఉషశ్రీ చరణ్ తప్పుడు కేసులు పెట్టించారని అనంతపురం జిల్లా కల్యాణదుర్గానికి చెందిన శివశంకర్ వాపోయారు. తనపై బనాయించిన ఎనిమిది కేసులను కొట్టేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని మున్సిపల్, జడ్పీ హైస్కూళ్లలో కంప్యూటర్ టీచర్లుగా పనిచేస్తున్న 283 మందిని అన్యాయంగా తొలగించారని, తిరిగి తమను ఉద్యోగాల్లోకి తీసుకోవాలని పురుషోత్తపల్లికి చెందిన పలువురు కోరారు. ఇంకా పలువురు వివిధ సమస్యలపై అర్జీలు ఇవ్వగా.. అధికారులతో మాట్లాడి, పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని టీడీపీ నేతలు చెప్పారు.

విద్యాసాగర్ బెయిల్‌పై ముగిసిన వాదనలు

» తీర్పు రేపటికి వాయిదా

విజయవాడ, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ముంబై నటి కాదంబరి జెత్వాని కేసులో నిందితుడు కుక్కల విద్యాసాగర్ దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విజయవాడలోని మహిళా సెషన్స్ కోర్టులో గురువారం వాదనలు ముగిశాయి. ఈ పిటిషన్‌లో జెత్వాని ఇంప్లీడ్ కావడంతో ఆమె తరఫున న్యాయవాది నర్రా శ్రీనివాసరావు వాదనలను రాతపూర్వకంగా కోర్టుకు అందజేశారు. వాటిని పరిశీలించిన న్యాయస్థానం తీర్పును ఈనెల 16వ తేదీకి వాయిదా వేసింది.

60 మంది గురుకుల విద్యార్థులకు జ్వరాలు

సత్యవేడు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లా సత్యవేడులోని జ్యోతీ బా పూలే బాలుర గురుకుల పాఠశాలలో 60 మందికి పైగా విద్యార్థులు జ్వరాల బారినపడ్డారు. గురువారం ఉదయం ఇద్దరు విద్యార్థులు కళ్లు తిరిగి పడిపోయారు. వెంటనే పాఠశాల స్టాఫ్ నర్స్ పరీక్షించి తీవ్ర జ్వరంతో ఉన్నట్టు గుర్తించారు. మిగిలిన విద్యార్థులకు కూడా పరీక్షలు చేయగా 60 మందికి పైగా జ్వరంతో బాధపడుతున్నట్టు గుర్తించి సత్యవేడు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రక్త పరీక్షలు నిర్వహించగా, అందరికీ నెగటివ్ రిపోర్టులు వచ్చాయని, తల్లితండ్రులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డాక్టర్ గుణశేఖర్ తెలిపారు. నాణ్యత పరిశీలన కోసం పాఠశాలలోని నీటి నమూనాలను సేకరించి తిరుపతి పబ్లిక్ హెల్త్ ల్యాబ్‌కు పంపించినట్టు వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

బుల్డోజర్‌కు బ్రేక్

సామాన్యుడి సొంతింటి కలమీద హిందీకవి ప్రదీప్ రాసిన ఓ కవితను ఉటంకిస్తూ, బుల్డోజర్ కూల్చివేతలను ఇకపై సహించేది లేదంటూ సుప్రీంకోర్టు బుధవారం ప్రశంసనీయమైన తీర్పు వెలువరించింది. అధికారులే న్యాయమూర్తుల్లా వ్యవహరిస్తూ, తక్షణతీర్పులతో ఇళ్ళకూల్చివేత శిక్షను అమలు చేస్తే ఊరుకొనేది లేదని సుప్రీంకోర్టు గట్టిగా హెచ్చరించింది. ఏదో ఒక నేరంలో నిందితుడో, దోషో అయినంతమాత్రాన నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా నేరుగా బుల్డోజర్లతో పోయి వారి నివాసాలను నేలమట్టం చేయడం అన్యాయం, అంతకుమించి రాజ్యాంగ విరుద్ధం అని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. ఆస్తుల కూల్చివేతకు సంబంధించి దేశవ్యాప్తంగా అమలయ్యే మార్గదర్శకాలను కూడా విడుదలచేసి, వాటిని అతిక్రమించినా, గీతదాటి దూకుడుగా వ్యవహరించినా సదరు అధికారులను వదిలిపెట్టేది లేదని, ధిక్కరణ చర్యలు తీసుకుంటామని కోర్టు స్పష్టంచేసింది. కూల్చివేతల్లో నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు తేలితే, బాధితులకు ఇవ్వాల్సిన నష్టపరిహారాన్ని అధికారులనుంచి ముక్కుపిండి వసూలు చేస్తానన్న హెచ్చరిక అత్యంత ప్రభావవంతంగా ఉంది. ఒక వ్యక్తి నిందితుడైతే అతడి నివాసాన్ని కూల్చివేయడం ద్వారా మొత్తం కుటుంబాన్ని శిక్షించడం, రోడ్డుపాల్జేయడం సరికాదన్నది మంచిమాట. 95 పేజీల తీర్పులో న్యాయమూర్తులు పలుచోట్ల బాధ, ఆగ్రహం వ్యక్తంచేస్తూ నిర్దిష్టమైన మార్గదర్శకాలతో భవిష్యత్తులో బుల్డోజర్ జస్టిస్‌ను నిలువరించేందుకు యథాశక్తి ప్రయత్నం చేశారు.

ఈ తీర్పుతో సర్వోన్నతన్యాయస్థానం బుల్డోజర్‌ను గ్యారేజీలోకి నెట్టేసిందని అఖిలేష్‌యాదవ్ వ్యాఖ్యానించారు. ఆ మహాయంత్రాన్ని కూల్చివేతలకు వినియోగించి, ఈ తీరున తక్షణశిక్షలు వేయడం యూపీ యోగి కనుగొన్న ప్రక్రియ కనుక విపక్షనేతలంతా ఆయన దృష్టితోనే వ్యాఖ్యలు చేశారు. బుల్డోజర్ బాబాగా ప్రసిద్ధిచెందిన యోగి చేతికి ఏకంగా సంకెళ్ళుపడినంతగా సంతోషించారు. యూపీ ప్రభుత్వానికి ఈ తీర్పు ఎలా అర్థమైందో తెలియదుగానీ, దానిని చక్కగా స్వాగతిస్తూ తనకు అనుకూలంగా భాష్యం చెప్పుకుంది. షోకాజ్ నోటీసులు, అప్పీళ్ళు, గడువులు, బాధితుల వాదనలను వినడం, మినిట్స్ రికార్డుచేయడం, యజమానికే అక్రమకట్టడాన్ని కూల్చివేసే అవకాశం ఇవ్వడం.. ఇలా పలురకాల మార్గదర్శకాలతో అధికారుల ముందరికాళ్ళకు సర్వోన్నతన్యాయస్థానం బలమైన బంధనాలు వేసింది. పాలకుల పక్షాన వారు కట్టుదాటి ప్రవర్తించకుండా లక్ష్మణరేఖలు గీసింది. కానీ, ఇప్పటికే నష్టపోయిన వందలాదిమందికి మాత్రం ఈ తీర్పు న్యాయం చేయలేదు. ఉత్తర్‌ప్రదేశ్‌లో యోగి అత్యధికంగా దుర్వినియోగపరచిన ఈ విధానాన్ని ఆ తరువాత బీజేపీ పాలిత రాష్ట్రాలన్నీ అమలు చేసిన విషయం తెలిసిందే. ప్రధానంగా మతహింసలు రేగినప్పుడు నివాసాల కూల్చివేతతో ముఖ్యంగా ముస్లింలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. హర్యానాలోని నుహ్, మధ్యప్రదేశ్‌లో ఖర్గోన్ వంటి చోట్ల మైనారిటీలను హెచ్చరించడానికి, అదుపులో ఉంచడానికి బుల్డోజర్ ఆయుధమైంది. ముస్లింలను ఆ రీతిలో శిక్షించడాన్ని బీజేపీ నాయకులు బాహాటంగా సమర్థించేవారు. నేరస్థులని నిర్ధారించేందుకు విడియోలు సరిపోతాయని, న్యాయస్థానాల అవసరం లేదని వ్యాఖ్యానించేవారు.

నిందితులను గుర్తించడం నుంచి నేరం రుజువుచేయడంవరకూ ఉన్న సుదీర్ఘ ప్రక్రియలన్నీ పక్కకు నెట్టివేసి, ఇలా కొంపలు కూల్చడం ద్వారా తక్షణశిక్షలు వేయడాన్ని ప్రజలు కూడా మెచ్చడం, బుల్డోజర్లను బ్యాండ్‌బాజాతో ఘనంగా స్వాగతించడం చూశాం. ఏ నేరానికి ఈ శిక్షవేస్తున్నదీ రాజకీయనాయకులు బాహాటంగా చెబుతుంటే, అధికారులు మాత్రం అక్రమ నిర్మాణమనో, అనుమతులు లేవనో, ఆక్రమణదారులనో చెప్పి సదరు అనుమనితుల లేదా నిందితుల ఇంటినో, దుకాణాన్నో నేలమట్టం చేస్తూపోయేవారు. ఆ నేరానికీ, ఈ శిక్షకూ సంబంధం లేదని న్యాయస్థానాల్లోనూ వాదనలు సాగేవి. కానీ, అసలు నిజం అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇప్పుడు వెలువడిన తీర్పు పాలకుల, అధికారుల దూకుడును బాగా నియంత్రిస్తుందని ఆశించాలి. ఒక వర్గాన్ని నియంత్రించేందుకు కూల్చివేతలను ఆయుధంగా వాడేవిషయంలో పాలకుల ఆదేశాలను అధికారులు గుడ్డిగా అమలుచేయకపోవచ్చు. తీర్పు వర్తించని ప్రాంతాలంటూ న్యాయస్థానం ఇచ్చిన మినహాయింపులను పాలకులు దుర్వినియోగం చేయకుండా చూడటం ముఖ్యం. మార్గదర్శకాలు నూరుశాతం అమలయ్యేట్టుగా జిల్లాకోర్టు నుంచి హైకోర్టు వరకూ శ్రద్ధపె-

శాంతి సాధనకు సైన్స్!

శాంతియుత జీవనాన్ని, స్థిరమైన అభివృద్ధిని మానవ ప్రపంచం కోరుకుంటుంది. శాస్త్ర సాంకేతిక అభివృద్ధి, పారిశ్రామిక ప్రగతితో పుష్కలమైన ఉపాధి అవకాశాలతో -ఆకలిచావులు లేని ప్రపంచాన్ని సమాజం ఆకాంక్షిస్తున్నది. ఆ లక్ష్యసాధనకు ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఇతర దేశాలతో కలిసి అభివృద్ధి చేసుకోవడం అత్యవసరమని ప్రపంచదేశాలు గుర్తించాయి. సంయుక్తంగా పరిశోధనలు నిర్వహించడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని మార్పిడి చేసుకోవడం ప్రపంచదేశాలకు అనివార్యం, అవసరం.

పారిశ్రామిక విప్లవం అనూహ్య సంపద సృష్టించింది. దీంతో పారిశ్రామిక సంస్థలు పరిశోధనలపై దృష్టి సారించి -అవసరమైన నిధులు కేటాయించాయి. ఈ కారణంగా 19వ శతాబ్దం ప్రారంభం నాటికి శాస్త్ర పరిశోధనలు అన్ని దేశాలలో ఊపందుకున్నాయి. శాస్త్రవేత్తలు వారి వారి దేశాలలో జాతీయ అకాడమీలను ఏర్పాటుచేసి -ఇతర దేశాల అకాడమీ గ్రూపులతో అంతర్జాతీయ సంఘంగా ఏకీకృతమయ్యారు. పరస్పర సహకారం, సమన్వయంతో పరిశోధనలు నిర్వహించారు. ప్రపంచ యుద్ధాల కాలంలో చీలిపోయివున్న ప్రపంచ దేశాలు అభద్రతాభావంతో శాస్త్రవేత్తల సంఘాలను ప్రోత్సహించలేదు కానీ, రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అంతర్జాతీయ సంఘాలు తిరిగి పునరుద్ధరించబడి, క్రియాశీలకపాత్ర పోషిస్తున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఐరోపాఖండంలోని 12 దేశాల శాస్త్రవేత్తలు కలసి సంయుక్తంగా అంతర్జాతీయ అణు పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పాలని సంకల్పించారు. అణు పరిశోధనలను - మానవజాతి అభివృద్ధి లక్ష్యాల వైపు తరలించాలని యూరప్ శాస్త్రవేత్తలు భావించారు. ఐక్యరాజ్యసమితి, దాని అనుబంధ సంస్థల సహకారంతో స్విట్జర్లాండ్ లో CERN(Conseil Européen pour la Recherche Nucléair)ను స్థాపించారు. ప్రపంచ యుద్ధాలకు ప్రధాన కారణమై -యూరప్‌కు భారీ నష్టం కలిగించిన పశ్చిమ జర్మనీ, ఇటలీలు కూడా CERN స్థాపనకు మద్దతు తెలిపి, వ్యవస్థాపక సభ్యులుగా చేరాయి. నేడు CERN ప్రపంచంలోనే అతిపెద్ద పరిశోధనా సంస్థలలో ఒకటి. ప్రపంచ యుద్ధాల ఫలితంగా ఐరోపా దేశాలలో వేళ్లూనుకున్న రాజకీయ వైరాలను, వైషమ్యాలను తొలగించి -ఐరోపా ఐక్యతకు విజ్ఞాన శాస్త్రం ఇలా ప్రముఖ పాత్ర పోషించింది.



దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందటానికి సైన్స్ ఒక సాధనంగా మారింది. మానవజాతికి విజ్ఞానాన్ని ప్రసాదించేదిగా మిగిలిపోకుండా, శత్రు దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి ఆధునిక కాలంలో సైన్స్ విఫలం కాని దౌత్య వ్యూహంగా రూపుదిద్దుకుంది. ఈ కారణంగానే, శాంతియుత ప్రపంచాన్ని సాధించడంలో సైన్స్ పాత్రను నొక్కిచెబుతూ ఏటా నవంబరు 9 నుంచి 15 వరకూ ఐక్యరాజ్యసమితి 'సైన్స్–ప్రపంచశాంతి' వారోత్సవాలు నిర్వహిస్తున్నది.

సైన్సు సంఘాల అంతర్జాతీయ కౌన్సిల్ 1957ను అంతర్జాతీయ జియో ఫిజిక్స్ సంవత్సరంగా ప్రకటించి ప్రపంచంలోని 67 దేశాల భాగస్వామ్యంతో భూగోళ వ్యవస్థపై పరిశోధనలు నిర్వహించడానికి ప్రణాళికలు సిద్ధం చేసింది. ప్రచ్ఛన్న యుద్ధకాలంలో పరస్పరం విరోధించుకునే అమెరికా, రష్యాలు ఇతర దేశాలతో కలిసి అంటార్కిటికా ట్రీటికి అంగీకారం తెలిపాయి. అగ్రదేశాల మధ్య కుదిరిన ఈ సంచలనాత్మక ఒప్పందం ప్రచ్ఛన్న యుద్ధకాలంలో అమెరికా రష్యాల తొలి ఆయుధ నియంత్రణ ఒడంబడికగా గుర్తింపు పొందింది. ఈ ఒప్పందం శాస్త్ర సాంకేతిక అభివృద్ధితో పాటుగా -ప్రపంచంలో శాంతి నెలకొంటుందనే ఆశావాదాన్ని మానవ సమాజంలో చిగురింప చేసింది. కౌన్సిల్ శాస్త్రవేత్తల క్రియాశీలక పాత్ర అగ్రరాజ్యాల సానుకూల వైఖరికి ప్రధాన కారణం.

అమెరికా అధ్యక్షుడు జాన్ కెనెడి నేతృత్వంలో 1961లో ప్రారంభించిన అమెరికా జపాన్ సైన్సు సహకార కమిటీ కార్యకలాపాల్లో మొదట కొంత జాప్యం జరిగినా, ఆ తరువాత-రెండు దేశాల శాస్త్రజ్ఞులు, పరిశోధకుల క్రియాశీలక భాగస్వామ్యంతో జోరందుకున్నాయి. వాతావరణం, సాంకేతిక శాస్త్రం, వైద్య రంగాలలో సమస్యలకు పరిష్కారాలను కనుగొనాలని, పరిశోధనా రంగంలో పరస్పరం సహకరించుకుంటూ ముందుకు సాగాలని ప్రాథమికంగా ప్రతిపాదించారు. భూకంపాలను ముందుగానే గుర్తించే విధానాలపై పరిశోధనలు, ప్రాణాంతకమైన క్యాన్సర్ వ్యాధికి చికిత్స, నివారణకు పరిశోధనలు అమెరికా, జపాన్ శాస్త్రవేత్తలు ప్రారంభించారు. 1988లో ప్రారంభమైన అమెరికా జపాన్ సంయుక్త కార్యాచరణ కమిటీ (Japan Joint Working-Level Committee (JWLC)) పరిశోధనా భాగస్వామ్యాన్ని వేగవంతం చేసి -అద్భుతమైన విజయాలను సాధించి పెట్టింది. రెండు దేశాల ప్రజల మధ్య వైషమ్యాలు తొలగిపోయి స్నేహ సంబంధాలు పటిష్ఠమయ్యాయి. అమెరికా జపాన్‌ల సాంకేతిక శాస్త్ర సహకారం అంతరిక్షనౌకల నిర్మాణం నుండి అంతరిక్ష పరిశోధనల వరకు విస్తరించింది. దశాబ్దాలుగా సాగుతున్న పరిశోధనా భాగస్వామ్యం 2024లో అత్యంత క్లిష్టమైన కృత్రిమ మేధపై పరిశోధనలకు శ్రీకారం చుట్టింది. రెండవ ప్రపంచ యుద్ధంలో అణుబాంబు ప్రయోగాలతో విధ్వంసమైన అమెరికా, జపాన్ సంబంధాలు సైన్స్, శాస్త్రవేత్తల పరిణతి చెందిన దౌత్యంతో మిత్ర దేశాలయ్యాయి.

కోవిడ్ మహమ్మారి మానవజాతిపై చేసిన దాడిని ఎదుర్కోవడంలో ప్రపంచమంతా ఒక్కటై విజయం సాధించింది. పరిశోధకులు పరస్పరం సహాయ సహకారాలను ఇచ్చిపుచ్చుకొని వ్యాక్సిన్ సకాలంలో ప్రతి పౌరుడికి అందించారు. పెను ఆపదలో ఉన్న మానవ సమాజాన్ని కాపాడటం కోసం శాస్త్ర విజ్ఞానం ప్రపంచ దేశాలను ఐక్యం చేసింది. సూక్ష్మజీవశాస్త్రంలో విశేష కృషి చేస్తున్న భారతదేశం 101 దేశాలకు వ్యాక్సిన్ అందించింది. శాస్త్ర పరిశోధనా రంగాలలో భారతదేశం ప్రపంచంలోని అన్ని ప్రముఖ దేశాలతో దె□క్షిక ఒప్పందాలను పటిష్ఠం చేసుకుంది. భారతదేశం, యూరోపియన్ దేశాల మధ్య శాస్త్రసాంకేతిక రంగాలతో పాటు సంస్కృతిక ఒప్పందాలు కూడా ఉన్నాయి.

రెండు శత్రుదేశాల మధ్య స్నేహ, సౌభ్రాతృత్వాలు ఏర్పడటం కష్టం. చాలా దేశాల దె□క్షిక ఒడంబడికలు వాటి రాజకీయ ప్రయోజనాలతో ముడిపడి -అమలుకావటం లేదు. ఈ నేపథ్యంలో సైన్స్ ఒప్పందాలు, శాస్త్రవేత్తల క్రియాశీలక పాత్ర ఆ దేశాల మధ్య స్నేహ సంబంధాలను పటిష్ఠం చేస్తున్నాయి. సైన్స్ రెండు దేశాల ప్రయోజనాలను కాపాడుతూ -శాస్త్ర సాంకేతిక సమస్యలను పరిష్కరిస్తూ -అభివృద్ధిలో ప్రధాన భూమిక పోషిస్తోంది. ప్రజలు తమ దైనందిన జీవితంలో కనిపిస్తున్న అభివృద్ధిని ఆస్వాదిస్తూ -శాస్త్ర, సాంకేతిక, పరిశోధనా ఒప్పందాలను అంగీకరిస్తూ -దేశాల మధ్య స్నేహాన్ని ఆహ్వానిస్తున్నారు. దేశాల మధ్య స్నేహ సంబంధాలు పెంపొందటానికి సైన్స్ ఒక సాధనంగా మారింది. మానవజాతికి విజ్ఞానాన్ని ప్రసాదించే ఒక శాస్త్రంగానే మిగిలిపోకుండా -శత్రు దేశాల మధ్య స్నేహ సంబంధాలను పెంపొందించడానికి ఆధునిక కాలంలో సైన్స్ విఫలంకాని దౌత్య వ్యూహంగా రూపుదిద్దుకుంది. ఈ కారణంగానే, శాంతియుత ప్రపంచాన్ని సాధించడంలో సైన్స్ పాత్రను నొక్కిచెబుతూ ఏటా నవంబరు 9 నుంచి 15 వరకూ ఐక్యరాజ్యసమితి 'సైన్స్–ప్రపంచశాంతి' వారోత్సవాలు నిర్వహిస్తున్నది.

○ భరత్ వేదాంతం

ట్రంప్ అనంతర ప్రజాస్వామ్యం!

డోనాల్డ్ ట్రంప్ మరోసారి అమెరికా అధ్యక్షుడు! అనేక కఠిన ప్రశ్నలను ఎదుర్కోవలసిన కాల మిది. పాలనా పద్ధతులలో ప్రజాస్వామ్యం సర్వోత్తమమైనదా? సమాజానికి కీడు, ప్రజలకు హాని చేస్తున్న ప్రజాస్వామ్యంతో మన మెలాంటి బాంధవ్యం కలిగి ఉండాలి? ఒక పాలనా పద్ధతిగా ప్రజాస్వామ్యం మెరుగుపడగలదనే ఆశాభావానికి నీళ్ళొదులుకోవాలా?

ప్రజాస్వామ్యంపై ఈ సంశయాలకు, డోనాల్డ్ ట్రంప్ అధికార పునరాగమనం దాకా మనం వేచి ఉండవల్సిన అవసరం లేదు. 2016లో ఆ మహాశయుడు అమెరికా అధ్యక్షుడుగా తొలిసారి ఎన్నికయినప్పుడే ప్రజాస్వామ్యం సర్వోత్తమమైనదేనా అనే ప్రశ్నను మనం వేసుకుని ఉండవల్సింది. లేదూ, నరేంద్రమోదీ 2019లో రెండో సారి విజయం సాధించినప్పుడైనా ఆ ప్రశ్నను మనకు మనమే సంధించుకుని ఉండవల్సింది. బహుశా, 2002లో గుజరాత్ మారణకాండ తక్షణ అనంతరమే ఆయన తిరుగులేని ప్రజామోదాన్ని పొందినప్పుడే ఆ ప్రశ్న మనలో బలంగా ఉదయించి ఉండవల్సింది.

నిజానికి ఉనికిలో ఉన్న 'ప్రజాస్వామ్యాలు' శ్రేష్ఠమైనవి కావు. ప్రజాస్వామ్య పాలన ఫలితాలు పర్యవసానాలు ప్రశంసనీయంగా ఉండడం లేదన్నది అందరికీ తేట తెల్లంగా తెలిసిన సత్యం. ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికయిన నాయకులు, మళ్లీ మళ్లీ ఎన్నికవుతున్న నేతలు రాజకీయ కల్లోలాలకు కారణమవుతున్నారు. నిరర్థక నిర్ణయాలతో సమాజాన్ని అస్తవ్యస్తం చేస్తున్నారు. అవినీతిని పెంపొందిస్తున్నారు. నేరాలు ప్రబలిపోతున్నా ఉపేక్షిస్తున్నారు. జాతుల మధ్య వైరాలను ప్రోత్సహిస్తున్నారు. తెగల మధ్య చిచ్చు పెడుతూ అంతులేని మారణ కాండను సృష్టిస్తున్నారు. పర్యావరణ సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తున్నారు అయినప్పటికీ ఎంతో మంది 'ప్రజాస్వామిక' పాలకులు తమ ప్రజాదరణను, అధికారాన్ని నిలబెట్టుకోగలుగుతున్నారు! ఇదేమీ ఎవరికీ కొత్త విషయమేమీ కాదు. సంపన్న యూరోపియన్ సమాజాలకు వెలుపల ఏమి జరుగుతుందో నిష్పాక్షికంగా చూడండి: సాధారణ, క్రియాత్మక ప్రజాస్వామ్యాలు తమ ప్రజలకు సమకూరుస్తున్న ప్రయోజనాలు అనేవి చాలా వరకు కట్టుకథలే కాదూ? ఇటువంటి నిర్ణయానికి మనం రాలేకుండా ఉండడం అసాధ్యం. ప్రజాస్వామ్య వ్యవస్థల విజయ గాథలు సాధారణంగా యాదృచ్ఛిక పరిణామాలు మాత్రమే. పైగా అవి నిస్సందేహంగా స్వల్పకాలిక అద్భుతాలే, అంతకుమించి అవేమీ సార్థకమైనవి కావు.

ప్రజాస్వామిక పాలన ఫలితాలను అంచనా వేయడంలో కేవలం మూడు వాదనలు మాత్రమే ప్రజాస్వామ్యాన్ని సమర్థించగలిగేవిగా ఉన్నాయి. ఒకటి— ప్రజలకు శ్రేయస్సును సమకూర్చడంలో నియంతృత్వ ప్రభుత్వాల కంటే ప్రజాస్వామిక ప్రభుత్వాలు అసమర్థంగా వ్యవహరించడం లేదు. రెండు— పాలన దుష్ఫలితాలను కనుగొని, సరిదిద్దేందుకు అవకాశాలను ప్రజాస్వామ్యం సమృద్ధిగా కల్పిస్తుంది. మూడు— ప్రజాస్వామ్య పాలన తాను ఆశిస్తున్నది ఇచ్చినా ఇవ్వకపోయినా ఒక పౌరుని ఆత్మ గౌరవాన్ని ప్రజాస్వామ్యం పెంపొందిస్తుంది, కాపాడుతుంది. నియంతృత్వ పాలనా వ్యవస్థలను నిర్ద్వంద్వంగా తిరస్కరించేందుకు ఈ వాదనలు చాలు. అయితే ఈ వాదనలే ఆధునిక ప్రపంచ ప్రజాస్వామ్యాన్ని తిరుగులేని-రీతిలో ఆమోదించేందుకు సరిపోవు.

'జనసమ్మతమైన' నాయకులు ప్రజాస్వామ్యం కారణంగా కాకుండా ప్రజాస్వామ్య ప్రతిబంధకాలు ఎన్నో ఉన్నప్పటికీ అధికారాన్ని గెలుచుకుని నిలబెట్టుకోగలుగుతున్నారనే కట్టుకథను విశ్వసించడానికి ప్రజాస్వామ్య సమ్మోహన శక్తే కారణమవుతోంది. సమస్యేమిటంటే మార్కెట్ వైఫల్యాల మాదిరిగానే ప్రజాస్వామిక వైఫల్యాలు వైపరీత్యాలే గానీ, ప్రజాస్వామిక సంస్థలు సక్రమంగా పనిచేయక పోవడం వల్ల సంభవిస్తున్నవి కానేకావు. మరింత స్పష్టంగా చెప్పాలంటే మనం ప్రజాస్వామ్యంగా పరిగణించే రాజకీయ వ్యవస్థలో వాటి సంభవనీయతకు అవకాశాలు మనమే కల్పించాం. ప్రజాస్వామ్యమనేది అధిక సంఖ్యాకుల పాలన అయితే, అటువంటి పరిణామాల సంభవనీయతను అది స్పష్టంగా అనుమతిస్తుంది.



ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య వ్యవస్థ గానీ, సమగ్ర ప్రజాస్వామ్యానికి ప్రామాణిక నమూనా గానీ ఎక్కడా లేదు. ఇది మనం అంగీకరించి తీరవలసిన వాస్తవం. మహా అయితే సంభావ్య ప్రజాస్వామ్యాలు మాత్రమే ఉన్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యమనేది ఇంకా పరిణతమవుతున్న దశలో ఉన్న ఆదర్శంగా మాత్రమే ఉన్నది. అదొక అసంపూర్ణ లక్ష్యంగా మిగిలిపోయింది. ఈ వాస్తవాన్ని మనకు బాగా ఎరుక పరిచినందుకు డోనాల్డ్ ట్రంప్‌కు మనం కృతజ్ఞత చెప్పాలి.

ఈ వాస్తవాన్ని అంగీకరించడాన్ని ప్రజాస్వామ్య వ్యతిరేక వైఖరిగా పొరపడవచ్చు. అది ఎంత మాత్రం పొరపాటు భావన కాదని నిశ్చితంగా చెప్పవచ్చు. ప్రజాస్వామ్య భావనను సంరక్షించుకోవాలంటే వాస్తవ ప్రజాస్వామ్యాల పనితీరు, సాధించిన విజయాల చరిత్రను నిశితంగా, నిష్పాక్షికంగా తనిఖీ చేయవలసి ఉంది.

ప్రజాస్వామ్య వ్యవస్థల్లో వైపరీత్యాలు సంభవించడం, అపసవ్య ధోరణులు పెచ్చరిల్లడం సహజసిద్ధ పరిణామాలు. ఇందుకు విరుద్ధమైన వైఖరులను సరిదిద్దవలసిన అవసరమున్నది. లేనిపక్షంలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ప్రజల పేరుతో ప్రజల పక్షాన ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశమున్నది. రాజ్యాంగాన్ని ఆమోదించిన రోజు (26, నవంబర్ 1949) రాజ్యాంగ సభలో డాక్టర్ అంబేద్కర్ వెలువరించిన చరిత్రాత్మక ప్రసంగం ఆ ప్రమాదం గురించే మనలను అప్రమత్తం చేసింది. మానవేంద్రనాథ్ రాయ్ 'పార్టీ రహిత రాజకీయాలు', పార్లమెంటరీ ప్రజాస్వామ్యంపై లోక్ నాయక్ జేపీ విమర్శలు నూతన ప్రజాస్వామ్య నమూనా కోసం మేధో చిత్తశుద్ధితో, నైతిక నిబద్ధతతో చేసిన అన్వేషణల ఫలితాలే.

ఇటీవలి కాలంలో రాజకీయాల వాస్తవ జగత్తును సరైన రీతిలో అర్థం చేసుకునేందుకు మనకు తోడ్పడిన రాజకీయ సైద్ధాంతికులలో ప్రముఖుడు జాన్ డన్. ప్రజాస్వామ్యం ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితికి మూలంగా ఉన్న ఒక ఏకీకరణ గురించి ఆయన మనలను అప్రమత్తం చేశారు. మనం నేడు ప్రజాస్వామ్యంగా పరిగణిస్తున్నది మూడు అంశాలు ఒకటిగా కలగలుపు అయిన భావన అని ఆయన పేర్కొన్నారు. మన కాలంలో ప్రజాస్వామ్యం అనేది విస్తృతంగా వినియోగమవుతున్న, అదే విధంగా దుర్వినియోగమవుతున్న మాటలలో ప్రముఖమైనది. ఆశ్చర్యకరంగా అది సార్వజనీనమైనది. ప్రపంచ వ్యాప్తంగా రాజకీయ సంభాషణల్లో రాజకీయ అధికారాన్ని కోరుకునేందుకు వాడబడుతున్న ప్రభావశీలమైన పదమది. ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్యం చాలా ప్రభావశీలమైనది, స్ఫూర్తిదాయకమైనది. వర్తమానంలోనే కాకుండా భవిష్యత్తులో కూడా ప్రత్యర్థి లేని ఆదర్శమది. సమాజాన్ని మొత్తంగా ప్రభావితం చేసే సమష్టి నిర్ణయాలపై పౌరులు అందరికీ సమాన, సమర్థమైన నియంత్రణ ఉండాలనేది ప్రజాస్వామ్య దార్శనికత. అంతిమంగా ప్రజాస్వామ్యం అనేది ఒక రాజకీయ యంత్రాంగం లేదా క్రియా విధానానికి ప్రతీక.

నేడు మనం ఒక బ్రహ్మాండమైన మాయ, ఒక భావనాసంబంధమైన యుక్తిని ఎదుర్కొంటున్నాం. పదం, ఆదర్శం, క్రియా విధానం (ది వర్డ్, ది ఐడియల్, ది మెకానిజం)గా ప్రజాస్వామ్యం మూడు అర్థాలకు ఒక తుల్యతను సృష్టించడమే ఆ యుక్తి. ఇదొక మేధో చాతుర్యం. ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్య సమ్మోహన శక్తిని, ప్రజల వైయక్తిక, సమష్టి వ్యవహారాలలో నిత్యం వాడుకలో ఉండే మాట— ప్రజాస్వామ్యం —ను మరింతగా సుదృఢపరిచేందుకు ఉపయోగిస్తున్నారు. అలా ఆదర్శం, పదం సంయుక్త ప్రభావాన్ని, ప్రాబల్యాన్ని ప్రజాస్వామిక పాలకులుగా చలామణీ అవుతున్న వారిని సమర్థించేందుకు వినియోగిస్తున్నారు. ఈ మూడు ఎంతగా కలగలుపు అయిపోయాయంటే ఒక ప్రభుత్వ నమూనాగా ప్రజాస్వామ్యాన్ని ప్రశ్నించడమనేది అసలు ప్రజాస్వామ్య ఆదర్శంపై దాడిగా భావించడం జరుగుతోంది. మరి ప్రజలను విశేషంగా ఆకట్టుకునేది, మంత్రముగ్ధులను చేసే వాటిలో ప్రజాస్వామ్య ఆదర్శం ముఖ్యమైనది. ప్రజాస్వామ్యం పట్ల ప్రజల్లో అటువంటి 'ఆకర్షణీయత' అవిశ్వసనీయమైన ప్రమాదకరమైన ప్రభుత్వాలను సమర్థించేందుకు ఒక సాకు అవుతోంది!



■ యోగేంద్ర యాదవ్

రాజ్య పాలనా వ్యవహారాలలో ప్రజాస్వామ్య స్ఫూర్తిని మరింత సమున్నతం చేసే ఏ కార్యనిమగ్నత అయినా ఒక భావనగా, ఒక ఆదర్శంగా ప్రజాస్వామ్యాన్ని వాస్తవంగా ఉనికిలో ఉన్న ప్రభుత్వ రూపాల నుంచి వేరు చేసి చూడాలి. ప్రజాస్వామ్యంగా పరిగణన అవుతున్న దేనినైనా సరే నిరాలోచనగా ప్రస్తుతించడమనేది మేధో పరంగా నష్టం చేసేది మాత్రమే కాకుండా రాజకీయంగా విపత్కర పరిస్థితులను సృష్టిస్తుంది. వర్తమాన ప్రపంచంలో పాలకులు అందరూ తమను తాము ప్రజాస్వామ్యవాదులుగా చెప్పుకుంటున్నారు. నిరంకుశ పాలనా పద్ధతులకు సైతం ప్రజాస్వామ్య ముద్ర వేయించుకోవడానికి ఆరాటపడుతున్న నియంతృత్వ పాలకుల సంఖ్య తక్కువేమీ కాదు. ఈ దృష్ట్యా ప్రజాస్వామ్యాన్ని ఒక భావనగా, ఒక విశేషణంగా ఏకీకరణ చేయడం నైతిక భ్రష్టత, రాజకీయ వైకల్యానికి దారి తీస్తుంది.

ఇప్పుడు మనముందు రెండు సంభావ్య మార్గాలు ఉన్నాయని ప్రజాస్వామ్య సైద్ధాంతికుడు జాన్ డన్ బలంగా వాదించారు. ఆయన సూచించిన మొదటి ప్రత్యామ్నాయం ప్రజాస్వామ్య సమ్మోహనశక్తిని అధిగమించి, ప్రజాస్వామ్య ఉత్కృష్ట ఆదర్శాల నుంచి 'ప్రజాస్వామిక మైనవి'గా చలామణి అవుతున్న ప్రభుత్వాలను వేరు చేయాలి. నైతిక యోగ్యత విషయమై ప్రజాస్వామిక ప్రభుత్వాలకు ప్రత్యేక హక్కులు ఏవీ లేని, అవి కేవలం మరొక ప్రభుత్వ రూపంగా మాత్రమే పరిగణించాలని జాన్ డన్ పేర్కొన్నారు. ఇది చాలా యుక్తియుక్తమైన వాదన. ఎందుకని? ప్రజాస్వామ్య ప్రభుత్వాలు మంచి చేయడం లేదనే వాస్తవాన్ని తిరస్కరించే పరిస్థితులలో ఇంకెంత మాత్రం లేము. ఇక రెండో మార్గం మౌలికంగా భిన్నమైనది. ప్రజాస్వామ్యాన్ని పునర్ జాగృతం చేసి, శక్తిమంతం చేయడమే అది. ఇందుకు ప్రజాస్వామ్య సమున్నత ఆదర్శాలను మనం మనసా వాచా కర్మణా పాటించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలుగా పేరు పొందిన వ్యవస్థలు, సమాజాలలో ఆ ఆదర్శాలు వాస్తవంగా ఎలా ఆచరణలో ఉన్నాయో నిశితంగా పరీక్షించాలి. సదరు సమాజాల ప్రజాస్వామిక స్వభావాన్ని నిగ్గు తేల్చాలి. ప్రజాస్వామికమైనవిగా పిలవబడుతున్న పాలనా వ్యవస్థలు వాస్తవంగా తమ ప్రజల శ్రేయస్సుకు దోహదం చేసే పాలనను ఎంత మాత్రం అందించడం లేదనే కఠోర వాస్తవాన్ని ఆమోదించేందుకు సంసిద్ధత చూపాలి. ఒక పరిపూర్ణ ప్రజాస్వామ్య వ్యవస్థ, సమగ్ర ప్రజాస్వామ్యానికి ప్రామాణిక నమూనా అనేది ఎక్కడా లేదు. ఇది మనం అంగీకరించి తీరవలసిన వాస్తవం. మహా అయితే సంభావ్య ప్రజాస్వామ్యాలు మాత్రమే ఉన్నాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యమనేది ఇంకా పరిపూర్ణ పరిణతి పొందని దశలో ఉన్న ఆదర్శంగా మాత్రమే ఉన్నది. అదొక అసంపూర్ణ లక్ష్యంగా మిగిలిపోయింది. ఈ వాస్తవాన్ని మనకు బాగా ఎరుక పరిచినందుకు డోనాల్డ్ ట్రంప్‌కు మనం కృతజ్ఞత చెప్పాలి.

సభకు వెళ్లని వారికి పదవులెందుకు?

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన రాజకీయ నాయకుడు. ఇప్పుడు ఆయన ఆరవ పర్యాయం అసెంబ్లీకి ఎన్నికయ్యారు. 1996లో ఓ దఫా లోక్‌సభకు కూడా ఎన్నికయ్యారు. రాజకీయంగా విశేష అనుభవం గడించిన చింతకాయల అయ్యన్న పాత్రుడికి అసెంబ్లీ వ్యవహారాలను ఎలా నిర్వహించాలో బాగా తెలుసు. సభా సంప్రదాయాలను, అసెంబ్లీ ఔన్నత్యాన్ని తిరిగి ఇనుమడింప జేయాలన్న దృఢ సంకల్పం స్పీకర్ అయ్యన్న పాత్రుడి మాటల్లో వ్యక్తమవుతోంది. అందుకు తగిన అవకాశం ఆయనకు ఇదే. సభా నాయకుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పార్లమెంటరీ ప్రజాస్వామ్యం పట్ల సంపూర్ణ విశ్వాసం ఉంది కనుక స్పీకర్ అయ్యన్న పాత్రుడికి సభానాయకుడైన ముఖ్యమంత్రి నుంచి తగిన సహకారం లభిస్తుంది. ఈ క్రమం లోనే రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనసభలో వార్షిక బడ్జెట్ ప్రవేశపెట్టిన మరుసటి రోజు సభకు సెలవు ప్రకటించి, ఆ రోజున కొత్తగా ఎన్నికైన శాసన సభ్యులకు, ఆసక్తి ఉన్న మిగతా సభ్యులకు బడ్జెట్ అంశాలపై అవగాహన సదస్సులను నిర్వహించారు.

పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో చట్టసభలకు ఎనలేని ప్రాధాన్యం ఉంది. కోట్లాదిమంది ప్రజలు నేరుగా చట్టసభలకు వెళ్లలేరు కనుక వారు తమ ప్రతినిధులను ఎన్నుకొని చట్టసభలకు పంపిస్తారు. చట్టసభలలో జరిగే చర్చలలో పాల్గొని ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలకు మేలు చేసేవిగా ప్రభావితం చేయడం ఎన్నికైన ప్రజాప్రతినిధుల రాజ్యాంగ బాధ్యత. ఫలితంగానే ప్రజాస్వామ్య దేశాలలో చట్టసభలకు, అక్కడ జరిగే చర్చలకు ఎనలేని ప్రాధాన్యం ఏర్పడింది. ప్రజాస్వామ్య సౌధాలుగా చట్టసభలను పేర్కొనడానికి గల కారణం కూడా అదే. చట్టసభల అస్తిత్వాన్ని, ఔన్నత్యాన్ని వాటికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, సభా నాయకుడు, ప్రతిపక్షనేత, స్పీకర్... ఇలా అందరూ ఉమ్మడిగా పెంపొందించడానికి కృషి చేయాలి. "చర్చల ద్వారా ప్రభుత్వ పాలన సాగించడమే ప్రజాస్వామ్యం" అని అన్నారు ప్రఖ్యాత రాజనీతి శాస్త్రజ్ఞుడు స్టూవర్ట్ మిల్. వాడిగా వేడిగా చర్చలు జరిగినపుడు సభలో వాయిదాలు, వాకౌట్లు వంటివి జరగడం సహజమే. ప్రతిపక్ష సభ్యులు కొన్ని సందర్భాలలో నిరసన తెలపడం కూడా ప్రజాస్వామ్యంలో ఓ భాగమే. నిరసనను అధికారికంగా తెలియజేయడం కూడా శాసనసభ కార్యకలాపాల ప్రక్రియలో ఓ భాగం. కానీ, ఆ నిరసన హుందాగా ఉండాలి, తగిన కారణాల వల్ల నిరసన తెలియజేశారనే వాస్తవం ప్రజలు గ్రహించాలి. అది ప్రజలలో ఆలోచన రేకెత్తించేదిగా ఉండాలి.

దురదృష్టవశాత్తూ, దేశంలో కొన్ని రాజకీయ పార్టీల 'ఎకో సిస్టమ్' పూర్తిగా మారిపోయింది. కొన్ని రాజకీయ పార్టీలకు వార్ రూమ్‌లు, సోషల్ మీడియా వింగ్‌లు, రాజకీయ వ్యూహకర్తలు పని చేయడం కీలకంగా మారింది. గతంలో మాదిరిగా సిద్ధాంత భావజాలం, ప్రజాస్వామ్య పంథా, సానుకూల వైఖరి మొదలైన విధానాలు కొన్ని పార్టీలకు కాలం చెల్లినవిగా మారిపోయాయి. కులాలు, మతాలు, ప్రాంతీయ సెంటిమెంట్లను వాడుకోవడం, ప్రత్యర్థి రాజకీయ నాయకుల వ్యక్తిత్వహననానికి సోషల్ మీడియా హ్యాండిల్స్‌ను దుర్వినియోగం చేయడం ఎక్కువైంది. ఒకవిధంగా చెప్పాలంటే— కొన్ని రాజకీయ పార్టీలకు ఇవే పూర్తిస్థాయి రాజకీయ కార్యకలాపాలుగా మారిపోయాయి. ఆ పార్టీలకు ఈ హంగులన్నీ ఎందుకంటే— ఏదో ఒక విధంగా అధికారంలోకి రావడానికే. ఒకప్పుడు పాజిటివ్ ఓట్ ద్వారా అధికారంలో ఉన్న వారు తిరిగి అధికారంలోకి రావాలనుకొనేవారు. కానీ, ఇప్పుడు ప్రత్యర్థి పార్టీలను దెబ్బతీసి అధికారంలోకి రావాలని చూస్తున్నారు. అందుకోసం సోషల్ మీడియాను పూర్తిగా దుర్వినియోగపరుస్తున్నారు.

అధికారంలోకి వచ్చాక ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు చట్టసభల్ని రాజకీయ వేదికలుగా మార్చేస్తున్నారు. సభలో ఒకర్నొకరు విమర్శించుకునే స్థాయి దాటిపోయి బూతులు తిట్టుకునే దశకు చట్టసభల్ని దిగజార్చారు. ఘోరం ఏమిటంటే— నిష్పక్షపాతంగా ఉండాల్సిన స్పీకర్ సైతం అధికార పార్టీకి కీలుబొమ్మగా మారి— ప్రతిపక్షం గొంతు నొక్కడం; ప్రతిపక్ష నాయకుణ్ణి, ఇతర సభ్యులను అధికార పార్టీ నేతలు వ్యక్తిగతంగా దూషిస్తుంటే, ఏమాత్రం జోక్యం చేసుకోకపోగా, చిద్విలాసంగా నవ్వులు చిందించడం మొదలైన జుగుప్సాకర దృశ్యాలు, వికృత రాజకీయ క్రీడలు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో 2019–-2024 మధ్య యథేచ్ఛగా సాగిపోయాయి. ఆనాడు శాసనసభ ఔన్నత్యాన్ని పాతాళానికి తొక్కేశారు. సభా సంప్రదాయాలను కాలరాశారు. రాజకీయ విలువలకు పాతర వేశారు. స్పీకర్ చిద్విలాసంగా చూస్తుండగా, సభానాయకుడు ముసిముసిగా నవ్వుతుండగా నాటి ప్రధాన ప్రతిపక్షనేత నారా చంద్రబాబునాయుణ్ణి కొందరు మంత్రులు, అధికార పార్టీ శాసనసభ్యులు అత్యంత దారుణంగా అవమానించారు. నాటి కౌరవ సభలో ద్రౌపదిని కౌరవ మూకలు పరాభవించినట్లుగానే! అందుకే నాడు చంద్రబాబునాయుడు తనకు జరిగిన అవమానాన్ని దిగమింగుకుంటూ "ఈ కౌరవ సభలో ఉండలేను, మళ్లీ గౌరవసభ అయిన తర్వాతనే, తిరిగి నేను ముఖ్యమంత్రి అయిన తర్వాతనే ఈ సభలో కాలు పెడతాను" అని చెప్పి నిష్క్రమించారు.



ప్రజాతీర్పుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఓ సరికొత్త అధ్యాయానికి నాంది. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో అనేక అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా, ఐదేళ్లపాటు రాష్ట్రంలో రాజ్యమేలిన బూతు సంస్కృతికి చరమగీతం పాడాలని, చట్టసభల ఔన్నత్యం పెరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. కానీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సహకరించడానికి ఏమాత్రం సిద్ధంగా లేకపోవడం ఆశ్చర్యం. ఓటమి తర్వాత కూడా జగన్మోహన్ రెడ్డిలో కించిత్తు మార్పు రాలేదు.

అయితే, వైఎస్ జగన్మోహన్ రెడ్డి నమ్ముకున్న సోషల్ మీడియా దుష్ప్రచారం, ప్రతిపక్ష నేతలపై బనాయించిన అక్రమ కేసుల వల్ల ప్రతికూల ఫలితాలే లభించడం ప్రజాస్వామ్యవాదులెవ్వర్నీ ఆశ్చర్యపర్చలేదు. ప్రజాతీర్పుతో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడడం ఓ సరికొత్త అధ్యాయానికి నాంది పలికింది. కూటమి ప్రభుత్వం పట్ల ప్రజలలో అనేక అంచనాలు ఏర్పడ్డాయి. ముఖ్యంగా, ఐదేళ్లపాటు రాష్ట్రంలో రాజ్యమేలిన బూతు సంస్కృతికి చరమగీతం పాడాలని, చట్టసభల ఔన్నత్యం పెరగాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారు. కానీ, ప్రతిపక్షంగా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సహకరించడానికి ఏమాత్రం సిద్ధంగా లేకపోవడం ఆశ్చర్యం. ఓటమి తర్వాత కూడా వైఎస్ జగన్మోహన్ రెడ్డిలో కించిత్తు మార్పు రాలేదు. ప్రజలు తనను ఎందుకు ఓడించారో జగన్ ఆత్మవిమర్శ చేసుకున్నట్లు కనపడదు. తన పాలనలో తప్పులు జరిగాయని, ప్రజలు ఇబ్బందులు పడ్డారని ఒప్పుకొనే ఔదార్యం జగన్‌లో ఏ కోశానా లేదు.

పైగా, శాసనసభలో తనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలంటూ న్యాయస్థానాన్ని ఆశ్రయించడం జగన్ దురహంకారానికి పరాకాష్ఠ. శాసనసభలో తనకు మైకు ఇవ్వరని తనే ఊహించుకొని అందువల్ల తాను శాసనసభకు వెళ్లడం లేదని చెప్పుకోవడం జగన్‌కే చెల్లింది. పులివెందుల ప్రజలు ఆయనను గెలిపించి శాసనసభకు పంపారు. అంటే, ఐదేళ్ల పాటు జగన్ పులివెందుల నియోజకవర్గ ప్రజలకు శాసనసభలో ప్రతినిధి. జగన్ శాసనసభకు వెళ్లకపోవడం అంటే తనకున్న రాజ్యాంగ బాధ్యతను విస్మరించడమేకాక, తనను ఎన్నుకొన్న పులివెందుల ప్రజలకు అన్యాయం చేసినట్లే అవుతుంది. సభకు వెళ్లనప్పుడు పదవిని అంటిపెట్టుకోవాల్సిన అగత్యం ఏముంది?

కొన్ని ప్రజాస్వామ్య దేశాల్లో సభకు హాజరుకాని ప్రజాప్రతినిధులను దండించే విశిష్టాధికారాలు ఉభయ సభలకు ఉన్నాయి. అమెరికాలోనైతే చట్ట సభ్యులకంటే చట్టసభ ఉన్నతమని అక్కడి రాజ్యాంగం స్పష్టం చేస్తుంది. గైర్హాజరు అయిన సెనేటర్లను అరెస్ట్ చేసి సభలో ప్రవేశపెట్టడానికి అవసరమైన అధికారాన్ని 'హౌస్' అధికారులకు అప్పగించిన సంఘటనలు గతంలో జరిగాయి. అయితే, బాధ్యత గలిగిన ప్రజాప్రతినిధులు సభాసమావేశాలకు హాజరు కారని మన దేశ రాజ్యాంగకర్తలు ముందుగా ఊహించలేకపోయారు. చట్టసభలకు హాజరు కాకపోయినా తమకొచ్చే నష్టమేదీ లేదనే భరోసాతో అనేక మంది ప్రజాప్రతినిధులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పిఆర్‌ఎస్ అనే సంస్థ వెల్లడించిన వివరాలను చూస్తే— దేశంలో అనేక రాష్ట్రాల అసెంబ్లీల పనిదినాలు క్రమంగా తగ్గిపోతున్నాయి. మెజారిటీ రాష్ట్రాల శాసనసభలు ఏడాదికి సగటున 19 పని దినాలు మాత్రమే పని చేస్తున్నాయి. పని గంటల విషయం నానాటికీ తీసికట్టుగా ఉంది. అనేక కీలక బిల్లులు ఎటువంటి చర్చ లేకుండానే చట్టాలుగా మారిపోతున్నాయి. పద్దులన్నీ చర్చకు నోచుకోకుండానే, వివిధ పార్టీల అభిప్రాయాలు నమోదు కాకుండానే గిలెటెన్ అవుతున్నాయి. దీనివల్ల చర్చల్లో పాల్గొనాలని ఆరాటపడే ఉత్సాహవంతులైన సభ్యులు నిరాశకు గురవుతున్నారు. శాసనసభా సమావేశాలు మొక్కుబడిగా సాగడంతో సభ్యులు సభలో కాకుండా క్యాంటీన్లలో, లాబీల్లో కాలక్షేపం చేయడం ఎక్కువైంది.

దేశంలోని వివిధ రాష్ట్రాల శాసనసభల పనితీరు ఏవిధంగా ఉన్నప్పటికీ— ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం శాసనసభ, శాసనమండళ్ల పనితీరు మెరుగుపడాలి, మరింత క్రియాశీలంగా మారాలి. రాజ్యాంగం ప్రకారం, సంప్రదాయాల ప్రకారం — ఉభయ సభలు సజావుగా జరగాలి. అవసరమైతే 'నో వర్క్.. నో పే' అనే విధానాన్ని ఇక్కడ కూడా అమలు చేయాలి. కారణాలు లేకుండా సభాకార్యకలాపాలకు దూరంగా ఉంటున్న సభ్యులకు అందించే రాయితీలను ఉపసంహరించాలి. ఇటువంటి చర్యలు తీసుకోవడానికి ప్రస్తుత స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడుకు తగిన సమర్థత, నిబద్ధత ఉన్నాయి. కొన్ని రోజుల వ్యవధి లోనే తన వ్యవహార శైలిని ఆయన చెప్పకనే చెబుతున్నారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంచాలన్న సదుద్దేశం ఆయన మాటల్లో వ్యక్తమవుతోంది. అయితే, ముందుగా చట్టసభల అస్తిత్వాన్ని సవాలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని పలుచన చేస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ముకుతాడు వేయాల్సిన గురుతర బాధ్యత స్పీకర్‌పైన, సభానాయకుడిపైన ఉంది. అప్పుడే ఆంధ్రప్రదేశ్ శాసనసభకు పూర్వవైభవం లభిస్తుంది.

■ సి. రామచంద్రయ్య


ఈ ఏడాది మేలో విద్యాధరపురంలోని భవనాన్ని అక్రమ నిర్మాణం అంటూ కూల్చేస్తున్న వీఎంసీ సిబ్బంది

విద్యాధరపురం కరెంటు ఆఫీసు రోడ్డులో 300 గజాల్లో ఓ భవనం ఉంది. రెండు 150 గజాల ప్లాట్లకు విడివిడిగా జీ ప్లస్ 3 భవన నిర్మాణాలకు అనుమతి తీసుకున్నారు. రెండు ప్లాట్లను కలిపి 300 గజాల్లో ఒకే భవన నిర్మాణం చేపట్టి పైన మరో అంతస్తును నిర్మించుకున్నారు. దీనిపై ఈ ఏడాది మేలో ఫిర్యాదులు రావడంతో వీఎంసీ అధికారులు అనుమతులు లేకుండా వేసిన స్లాబును ధ్వంసం చేశారు. ఈ అక్రమ నిర్మాణానికి బాధ్యుడిని చేస్తూ అప్పటి బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్‌ను నాటి వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సరెండర్ చేశారు. కట్ చేస్తే సరిగ్గా మూడు నెలలు తిరక్కముందే ఏదైతే అక్రమ నిర్మాణమని ధ్వంసం చేశారో అక్కడ భవన నిర్మాణదారులు మళ్లీ స్లాబు వేసి మరో అంతస్తును వేసేసుకున్నారు.

ఈ ఏడాది మేలో అక్రమమని నిర్ధారించిన దాన్నే మూడు నెలలు తిరక్కముందే సక్రమంగా మార్చేసిన ఘనత వీఎంసీ అధికారులకు దక్కుతుంది. ఈ మొత్తం వ్యవహారంలో విజయవాడ పశ్చిమ నియోజకవర్గానికి చెందిన వైసీపీ నేత, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రధాన పాత్ర పోషించారు. ఆయనకు అందాల్సిన మొత్తం అందగానే అక్రమ నిర్మాణం సక్రమం అయిపోయింది. తన మాట వినని బిల్డింగ్ ఇన్స్పెక్టర్‌పై వేటు పడింది.

నాడు అక్రమం.. నేడు సక్రమం!

వీఎంసీలో టౌన్‌ప్లానింగ్ సిత్రాలు

మేలో అక్రమమని కూల్చేశారు

- బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌ను సరెండర్ చేశారు
- ఆగస్టులో అదే భవనానికి ఓకే చెప్పారు
- వైసీపీ నేతల కనుసన్నల్లో వీఎంసీ టౌన్‌ప్లానింగ్
- ప్లాన్ల అనుమతి నుంచి మార్ట్‌గేజ్ రిలీజ్ వరకు వారిదే హవా
- మల్లాది విష్ణు అనుచరుడే బేరాలు కుదిర్చే మధ్యవర్తి

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలకుపైగా గడుస్తున్నా ఇప్పటికీ విజయవాడ నగరపాలక సంస్థ ప్రణాళిక విభాగం అధికారులు వైసీపీ నేతల కనుసన్నల్లోనే పనిచేస్తున్నారు. సిటీ ప్లానర్ మొదలు డిప్యూటీ సిటీ ప్లానర్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లలో అధికశాతం మంది మేయర్ భాగ్యలక్ష్మి, ఆమె భర్త నరేంద్ర, మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు చెప్పినట్లు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యేగా ఉన్న సుజనా చౌదరి వీఎంసీకి సంబంధించి అనధికార కార్యకలాపాల్లో జోక్యం చేసుకోకపోవడం వైసీపీ నేతలకు కలిసి వచ్చింది. పశ్చిమ నియోజకవర్గంలో నూతన భవన నిర్మాణాలకు ప్లాన్ అనుమతి నుంచి కొత్త నిర్మాణాలకు పన్ను వేయడం.. మార్ట్‌గేజ్ రిలీజ్ చేయడం వరకు అన్నిటా వైసీపీ నేతల జోక్యం కొనసాగుతోంది.

- కొద్ది రోజుల క్రితం భవానీపురం 40వ డివిజన్ పరిధిలో ఏకంగా బస్సు షెల్టర్‌ను తొలగించేసి సుమారు రూ.40 లక్షలు విలువ చేసే 20 గజాల స్థలాన్ని ఓ వ్యాపారి ఆక్రమించేశారు. తన 500 గజాలకుపైగా స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి దారి కోసం ఈ దందాకు తెగబడ్డారు. వీఎంసీ అధికారులు అటు వైపు కూడా చూడకుండా వైసీపీ నేతలు హుకుం జారీ చేశారు.

- మార్ట్‌గేజ్‌లను విడుదల చేసే విషయంలోనూ లక్షలాది రూపాయలు చేతులు మారుతున్నాయి. పశ్చిమ నియోజకవర్గం టీచర్స్ కాలనీలో 450 గజాల్లో నాలుగు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ఎలాంటి సెట్ బ్యాక్‌లు లేకుండా పూర్తి డీవియేషన్‌తో దీన్ని నిర్మించారు. సాధారణంగా ఏదైనా భవన నిర్మాణంలో 10 శాతం వరకు డీవియేషన్‌ను అనుమతించి దానికి పెనాల్టీ వేసి మార్ట్‌గేజ్ విడుదల చేస్తారు. కానీ ఈ భవనం 30 శాతం పైగా డీవియేషన్‌ను ఉన్నా 10 శాతం డీవియేషన్‌కు కూడా పెనాల్టీ వేయకుండా మార్ట్‌గేజ్ రిలీజ్ చేయడం గమనార్హం. దీంతో వీఎంసీ సుమారు రూ.8 లక్షల ఆదాయం కోల్పోయింది. వైసీపీ నేతలు.. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది జేబుల్లోకి మాత్రం రూ.5 లక్షలు చేరినట్లు సమాచారం.

పర్యవేక్షణ కొరవడిన ఫలితం!

విజయవాడ నగర పాలక సంస్థ ప్రణాళికా విభాగంపై ప్రస్తుత కమిషనర్ ధ్యానచంద్ర పర్యవేక్షణ కొరవడింది. దాని ఫలితంగా ప్రణాళికా విభాగం అస్తవ్యస్తంగా మారిపోయింది. గతంలో ప్రసన్న వెంకటేశ్ కమిషనర్‌గా ఉన్న సమయంలో ప్రణాళిక విభాగాన్ని గాడిలో పెట్టారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న డిప్యూటీ సిటీ ప్లానర్లను, అసిస్టెంట్ సిటీ ప్లానర్లను ప్రభుత్వానికి సరెండ్ చేశారు. ఏళ్ల తరబడి పాతుకుపోయిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లను డివిజన్లు మార్చేయడం ఇతర ప్రాంతాలకు బదిలీ చేయడం చేశారు. టౌన్‌ప్లానింగ్ విభాగం వారు ఎవరైనా లంచాలు అడిగితే తనకు ఫిర్యాదు చేయాలంటూ వాట్సాప్ నంబరు, ల్యాండ్ లైన్ నంబరు ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. దీంతో చాలా వరకు పట్టణ ప్రణాళిక విభాగం గాడినపడింది. ఆ తర్వాత వచ్చిన కమిషనర్లు దీనిపై పెద్దగా దృష్టి పెట్టకపోవడంతో మళ్లీ గాడితప్పుతోంది.

మల్లాది అనుచరుడే మధ్యవర్తి

విజయవాడ నగరంలో ఎక్కడ ఏ నిర్మాణం జరిగినా దానికి సంబంధించిన వివరాలు.. అందులో ఉన్న లోపాలు వెంటనే టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారికి చేరిపోతాయి. దీని కోసం ప్రత్యేకంగా ఓ వ్యక్తిని నియవింంచుకున్నారు. ఆయన మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేతల మల్లాది విష్ణుకు ముఖ్య అనుచరుడు. డీఎంఆర్ అని షార్ట్‌కట్‌లో పిలుచుకునే ఈ వ్యక్తి టౌన్‌ప్లానింగ్ ఉన్నతాధికారికి బినామీ అని కూడా ఆరోపణలు ఉన్నాయి. నగరంలో ఏ భవన నిర్మాణదారుడికి ఇబ్బంది ఎదురైనా వెంటనే ఈ డీఎంఆర్ అక్కడ ప్రత్యక్షమైపోతారు. అన్నీ తాను చూసుకుంటానని బేరం మాట్లాడుకుని బేరం సెట్ అవ్వగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తారు.


డప్పుకొడుతున్న గోరా

మానవత్వం గోరా అభిమతం

నాస్తికత్వ ఉద్యమ నేతగా ముద్ర

- కృష్ణాజిల్లా నుంచి నాస్తికత్వ ఉద్యమానికి శ్రీకారం
- ప్రపంచవ్యాప్తంగా నాస్తిక ఉద్యమ సభలు

*** నేడు గోరా జయంతి**

సమాజంలో అసమానతలు, కుల, మత భేదాలు చెరిగిపోవాలని యవ్వనంలోనే కంకణం కట్టుకున్నారు. ప్రజలకు విశ్వాసం మూఢనమ్మకాలపై కాదు శాస్త్ర, సాంకేతిక పరిజ్ఞానంపై ఉండాలని నమ్మారు. ఇందుకోసం ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నారు. పనిచేసే చోట వ్యతిరేకతను మూటగట్టుకున్నారు. చివరికి ఉద్యోగాన్ని సైతం వదిలేసి సమాజంలో ఉన్న మార్పు కోసం ముందడుగు వేశారు. ఆయనే హేతువాద ఉద్యమ నిర్మాత గోరా. ఆయన జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం.

8లో


ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సినీ నటుడు సాయిధరమ్ తేజ్ గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో రామారావు సాదర స్వాగతం పలికారు. దర్శనానంతరం అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

నేడు దుర్గగుడిలో కోటి దీపోత్సవం

6లో

సోషల్ మీడియా అంశం రాష్ట్రంలో కాక పుట్టిస్తున్న తరుణంలో ఈ పోస్టింగ్‌లపై నిరంతర నిఘా పెట్టాలని భావించారు ఎన్టీఆర్ జిల్లా పోలీసులు. దీనికోసం విజయవాడలో కమిషనరేట్‌కు చెంతనే ఉన్న సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో సోషల్ మీడియా మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేశారు. దీనికి ఒక ఇన్‌స్పెక్టర్‌ను నియమించారు.



కమిషనరేట్‌లో సోషల్ మానిటరింగ్ సెల్

ప్రత్యేకంగా ఒక ఇన్‌స్పెక్టర్ నియామకం

- సోషల్ మీడియా పోస్టింగ్‌లపై ప్రత్యేక నిఘా
- వివాదాస్పద పోస్టింగ్‌లు చేస్తున్న 169 హ్యాండిలర్స్
- 75 హ్యాండిలర్స్ ఖాతాల్లో అసభ్యకర పోస్టింగ్‌లు
- ఫాలోయర్స్‌కు చిక్కుల చుక్కలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిఠాపురంలో కొద్దిరోజుల క్రితం చేసిన వ్యాఖ్యలతో సోషల్ మీడియా అకౌంట్ల లెక్కలను పోలీసులు తేల్చుతున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, కూటమిలోని మంత్రులను వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేసుకుని అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెడుతున్న వారిపై కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. పోలీసు కమిషనరేట్‌లో మొత్తం 76 కేసులు నమోదు చేశారు. ఇన్‌స్టా, ఎక్స్ మాధ్యమాల్లో అకౌంట్లను నిర్వహిస్తున్న వారికి 41ఏ నోటీసులు ఇచ్చారు. వారిని విజయవాడకు రప్పించారు. కొద్దిరోజులుగా అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెడుతున్న హ్యాండిలర్స్‌ను సైబర్ క్రైం పోలీసులు గుర్తించారు. మొత్తం 169 అకౌంట్లలో హ్యాండిలర్స్ ఈ తరహా పోస్టింగ్‌లు చేస్తున్నట్టు గుర్తించారు. వాటిలో 75 మంది మాత్రం అత్యంత జుగుప్సాకరమైన పదాలతో, మార్ఫింగ్ ఫొటోలతో పోస్టింగ్‌లు చేస్తున్నారు. ఈ అకౌంట్లన్నింటిని సైబర్ పోలీసులు ట్యాగ్ చేశారు. 24/7 ఈ హ్యాండిలర్స్ పోస్టింగ్‌లపై నిఘా కొనసాగుతోంది. మరోపక్క కమిషనర్ రాజశేఖరబాబు నిత్యం నిర్వహించే కాన్ఫరెన్స్ కాకుండా సోషల్ మీడియా పోస్టింగ్స్, కేసులపై ప్రత్యేకంగా సిబ్బందితో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హ్యాండిలర్స్ వరకు గుర్తించిన పోలీసులు త్వరలో వారి ఫాలోయర్స్ పని పట్టాలని భావిస్తున్నారు. ఇప్పటికే వారికి అన్‌ఫాలో అవ్వాలని సందేశాలు పంపారు. హ్యాండిలర్స్ తీరు మార్చుకోకుండా ఈవిధంగా అసభ్యకరంగా పోస్టింగ్‌లు పెడితే వారితోపాటు ఫాలోయర్స్ పైనా కేసులు నమోదు చేయాలని పోలీసులు భావిస్తున్నారు.

హ్యాండిలర్స్‌కు కౌన్సెలింగ్

పేరు ఒకరిది. అకౌంట్ మరొకరిది. నచ్చిన పార్టీ, నాయకుడిపై అసభ్యకరంగా పోస్టింగ్. లేకపోతే మార్ఫింగ్ చేసిన ఫొటో అప్‌లోడ్. ఈ వ్యవహారాలన్నీ చేస్తున్న హ్యాండిలర్స్‌లో ఎక్కువ మంది యువకులు ఉంటున్నారు. కొంతమంది ఉన్నత విద్యాభ్యాసం చేస్తుంటే, మరికొంతమంది దాన్ని పూర్తి చేశారు. రాజకీయ పార్టీల నేతలు ఏర్పాటు చేసిన గ్రూపుల్లో కొనసాగుతూ, ప్రత్యేకంగా గ్రూపులు ఏర్పాటు చేసుకుంటూ బూతు దూషణలతో పోస్టింగ్‌లు చేస్తున్న వారిని ఒకదారికి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకోసం సైబర్ క్రైం పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ సెల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అసభ్యకరంగా పోస్టింగ్‌లు చేస్తున్న వారిని గుర్తించి ఇక్కడికి లాక్కొస్తారు. వారికి కౌన్సెలింగ్ ఇస్తారు. ఆ తర్వాత తల్లిదండ్రులను పిలిపించి వారికి క్లాస్ తీసుకుంటారు. ఈ రెండు పూర్తయిన తర్వాత హ్యాండిలర్స్ తీరు మారితే ఓకే. లేకపోతే కేసులు నమోదు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇలా పోస్టింగ్‌లు చేస్తున్న వారిలో కొంతమంది నెల జీతానికి పని చేస్తున్నట్టు పోలీసులు సమాచారం సేకరించారు.

ఇది చాలా ప్రమాదకరం



ప్రస్తుతం సోషల్ మీడియాలో చదవలేని భాషలో రాతలు ఉంటున్నాయి. దర్యాప్తులో వాటిని చదవాలంటే చాలా చిరాకు పుడుతోంది. ఈ పరిస్థితి చాలా ప్రమాదకరం. సమాజం, పిల్లల భవిష్యత్తు చెడిపోతుంది. చాలా మంది అత్యంత జుగుప్సాకరంగా పోస్టింగ్‌లు పెడుతున్నారు. ఇలాంటి వారిని పార్టీ కార్యకర్తలుగా పరిగణించడం అంతమంచిది కాదు. సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి అసభ్యకర పోస్టింగ్‌లు చేసినా, వారు ఏ పార్టీకి చెందిన వారైనా వదిలిపెట్టే ప్రసక్తి లేదు. చట్టానికి లోబడే వారిపై చర్యలు ఉంటాయి. ఇలాంటి హ్యాండిలర్స్‌ను ఫాలో అవుతున్న వారు వెంటనే అన్‌ఫాలో అవ్వాలి. లేకపోతే వారికి చిక్కులు వస్తాయి. రాజ్యాంగం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ ఇచ్చింది. దాన్ని వ్యక్తీకరించడానికి ఒక భాష ఉంది. హుందాతనం కోల్పోయి పోస్టింగ్‌లు పెట్టిన వారిపై చర్యలు కఠినంగా ఉంటాయి. మంచిగా ఉపయోగించుకోవాల్సిన సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్నారు.

- రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్


రొయ్యూరు క్వారీలో ట్రాక్టర్లలోకి ఇసుక ఎత్తుతున్న కార్మికులు

రొయ్యూరు క్వారీలో దోచుకుంటున్నారు

ట్రాక్టర్ ఇసుక రూ.1,200 నుంచి 1,600 వరకు వసూలు

- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కార్మికులు
- పట్టా భూముల్లో తవ్వడంపై రైతుల ఆగ్రహం
- ట్రాక్టర్లు రాకుండా నాలుగు చోట్ల గండ్లు

రొయ్యూరు ఇసుక క్వారీలో కార్మికులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారంగా ధరలు నిర్ణయించి ట్రాక్టర్ డ్రైవర్ల నుంచి దోచుకుంటున్నారు. ఒక ట్రాక్టర్‌కు రూ.500 మాత్రమే వసూలు చేయాలని అధికారులు స్పష్టంగా చెబుతున్నా కార్మికులు మాత్రం రూ.1200 నుంచి రూ.1600 వరకు వసూళ్లకు పాల్పడుతున్నారు. బాట లేకపోవడంతో ట్రాక్టర్లు దిగబడిపోతున్నాయి. వీటిని బయటకు లాగడానికి మరో రూ.300 వసూలు చేస్తున్నారు. దీంతో ఒక ట్రాక్టర్ బయటకు వెళ్లడానికి భారీగా నగదు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వ ఉచిత ఇసుక కాస్త వినియోగదారుడికి భారంగా మారుతోంది.

తోట్లవల్లూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : తోట్లవల్లూరు మండలం రొయ్యూరు ఉచిత ఇసుక క్వారీలో గురువారం ఒక ట్రాక్టర్‌లో ఇసుక నింపేందుకు కార్మికులు రూ.1,500 వసూలు చేశారు. కొందరు రూ.1,200, మరి కొందరు రూ.1,400, ఇంకొందరు రూ.1,600 ఇలా ఎవరి ఇష్టం వచ్చినట్టు వారు చెప్పిన రేటును పెంచేసి డ్రైవర్ల నుంచి వసూలు చేశారు. ఇంత భారీగా డబ్బులు వసూలు చేసినప్పటికి ట్రాక్టర్లు ఇసు కలో దిగబడకుండా బాటను మాత్రం ఎవ్వరు నిర్మించటం లేదు. దీంతో ఇసుక లోడింగ్ చేసిన ప్రతి ట్రాక్టరు దిగబడిపోతోంది. దిగబడిన ట్రాక్టర్ నుంచి రూ.300 వసూలు చేసి మరో ఇంజన్ కట్టి ఒడ్డుకు చేర్చటం మొదలు పెట్టారు. క్వారీ వద్ద ఏం జరుగుతోంది అని పట్టించుకునే నాథుడు లేకపోవటంతో కార్మికుల బరితెగింపునకు కారణమవుతోందని విమర్శలు వస్తున్నాయి. ఈ అధిక రేటు వసూలు వల్ల ఇసుక వినియోగదారునిపై విపరీతమైన భారం పడి ప్రభుత్వం ఆశించిన లక్ష్యం దెబ్బతింటోంది. ఒక ట్రాక్టర్‌కి రూ.500 మాత్రమే వసూలు చేయమని క్వారీలు ఉన్న గ్రామాల్లో కార్మికులకు స్పష్టంగా తెలియజేశామని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి చెబుతున్నప్పటికీ మరోవైపు రెండింతలు ఎక్కువ రేటుని వసూలు చేయటం కార్మికుల వెనుక బలమైన వ్యక్తులు ఉన్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. భద్రిరాజుపాలెం, చాగంటిపాడు క్వారీల్లో కూడా రూ.1,000 నుంచి రూ.1,200 వరకు వసూలు చేస్తున్నారు.

రూ.1,500 చెల్లించాను



కైకలూరు నుంచి తెల్లవారుజామున 3.30 గంటలకు రొయ్యూరు క్వారీకి వచ్చా. మధ్యాహ్నం మూడు గంటలకు ఇసుక పోశారు. తన వద్ద కార్మికులు రూ.1,500 వసూలు చేశారు. కనీసం భోజనానికి కూడా జేబులో డబ్బుల్లేవు. క్వారీలో రకరాకల రేట్లు వసూలు చేస్తున్నారు. చాలా ఇబ్బంది పడాల్సి వచ్చింది.

- షేక్ మస్తాన్, ట్రాక్టర్ డ్రైవర్, కైకలూరు

పట్టా భూముల్లో తవ్వొద్దని చెప్పాం

పట్టా భూముల్లో ఇసుక వివాదం రెండు రోజుల క్రితమే నా వద్దకు వచ్చింది. రైతులకు చెందిన పట్టా భూముల్లో ఇసుక తీయవద్దని కార్మికులకు సూచించాం. రెవెన్యూ సిబ్బందికి కూడా ఆదేశాలిచ్చాం. ట్రాక్టర్ నుంచి ఎక్కువ వసూలు చేస్తుంటే క్వారీని నిలిపివేస్తాం.

- ఎం.కుసుమకుమారి, తహసీల్దార్


పట్టాభూముల్లోకి ట్రాక్టర్లు రాకుండా తవ్విన గాడి

గండ్లు తవ్విన రైతులు

రొయ్యూరు క్వారీలో గురువారం ఉదయం ఇసుక తవ్వకాలపై కార్మికులకు, వల్లూరుపాలెం రైతులకు మధ్య వివాదం చోటు చేసుకుని ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. తమ పట్టా భూముల్లోని ఇసుకను ఎందుకు తీసున్నారని రైతులు ప్రశ్నించగా మేము ప్రభుత్వ భూముల్లోనే తీస్తున్నామని వాదించారు. దాంతో రైతులు ఎక్సకవేటర్‌తో మూడు చోట్ల క్వారీలోకి ప్రవేశించే దారులపై గండ్లు తవ్వించారు. వల్లూరుపాలెంకు చెందిన రైతు చెన్నపాటి పూర్ణచంద్రరావు 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ కార్మికుల హక్కుని తాము కాదనటం లేదని, తమ పొలాలు విరిగిపోయి ఏర్పడిన ఇసుకను కూడా తీస్తామంటే తాము నష్టపోతామన్నారు. అధికారులు పట్టా భూములు, ప్రభుత్వ క్వారీకి హద్దులు నిర్ణయిస్తే ఈ వివాదం ఉండదని చెప్పారు.

రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన సముద్రం

అప్రమత్తమైన కలెక్టర్, జేసీ

మచిలీపట్నం, నవంబరు14(ఆంధ్రజ్యోతి) : కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో ఏర్పాట్లు పూర్తి చేసి, అంతా సిద్ధం అనుకుంటున్న వేళ ఒక్కసారిగా గురువారం రాత్రి సముద్రం ముందుకొచ్చింది. సముద్రపు పోటు కారణంగా అలల ఉధృతి అధికమై నీరు బీచ్ సమీపంలోని రోడ్డుపైకి చొచ్చుకొచ్చాయి. దీంతో అధికారులు అప్రమత్తమయ్యారు. కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ మంగినపూడి బీచ్ వద్దకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సముద్రపు పోటు తగ్గేవరకు నీరు అలానే రోడ్డుపైకి వస్తుందని, ప్రమాదమేమీ ఉండదని స్థానిక మత్స్యకారులు చెప్పడంతో అధికారులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. పౌర్ణమి సందర్భంగా శుక్రవారం బీచ్ వద్ద పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.


మంగినపూడి బీచ్ వద్ద పరిస్థితిని సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలి శర్మ


మంగినపూడి బీచ్ సమీపంలోని రోడ్డుపైకి చొచ్చుకొచ్చిన సముద్రపు నీరు



ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీకి అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు, అర్చకులు

నేడు దుర్గగుడిలో కోటి దీపోత్సవం

వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర కార్తీకమాసంలో అత్యంత పర్వదినం పౌర్ణమి సందర్భంగా శుక్రవారం దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సాయంత్రం ప్రదోష వేళ కోటి దీప మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్టు ఈవో కేఎస్ రామారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రమైన కార్తీక మాసంలో శివ సన్నిధిలో ఒక దీపాన్ని వెలిగించటం వల్ల ఎంతో పుణ్యం వస్తుందని పురాణాలు చెబుతున్నాయి. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కోటిదీపాలను వెలిగించే కార్యక్రమానికి ఏర్పాట్లను చేసినట్టు ఆలయ అధికారులు పేర్కొన్నారు. దుర్గమ్మ ప్రధాన ఆలయం, మల్లేశ్వరాలయం, మహామండపం, శివకామసుందరీ, నటరాజస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీగణపతి మందిరం దీపాల వెలుగు జిలుగులలో శివుడి సుందర రూపాన్ని చూసి తరించాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

మల్లేశ్వరాలయంలో జ్వాలా తోరణం

మల్లేశ్వరాలయంలో శుక్రవారం సాయంత్రం సంధ్యా సమయంలో జ్వాలా తోరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఈవో తెలిపారు. పౌర్ణమి రోజున జ్వాలా తోరణ కార్యక్రమాన్ని ప్రతి శివాలయంలో నిర్వహిస్తారు. శివాలయాల్లో జ్వాలా తోరణం వెలిగించటం సంప్రదాయంగా వేల సంవత్సరాల నుంచి కొనసాగుతోంది. స్వయంభువు అయిన దుర్గగుడిలోని మల్లేశ్వరుడి సన్నిధిలో జ్వాలా తోరణ కార్యక్రమం ఎంతో విశిష్టతతో కూడుకున్నదని చెప్పవచ్చు. జ్వాలా తోరణాన్ని దాటటం వల్ల సకల పాపాలు పోతాయని పురాణాలు చెబుతున్నాయి. జ్వాల తోరణ దర్శనంతో పునర్జన్మ ఉండదని కూడా నమ్ముతారు. అందుకే భక్తులు జ్వాలా తోరణ కార్యక్రమాన్ని తిలకించేందుకు వేచి ఉంటారు. దీనిని యమద్వారం అని కూడా పిలుస్తారు. పార్వతీ పరమేశ్వరులను పల్లకీలో తోరణం కింద మూడుసార్లు అటూ ఇటూ తిప్పుతారు. అదే సమయంలో భక్తులు తోరణం కింద నడవటం చాలా మంచిదని భావిస్తారు. జ్వాలా తోరణం దాటిన వారికి యమలోకంలో మంటల ద్వారం ద్వారా వెళ్లే అవకాశం ఉండదని నమ్మిక.

నేడు గిరి ప్రదక్షిణ..

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో పౌర్ణమి రోజున గిరి ప్రదక్షిణ శుక్రవారం ఉదయం 5.55 గంటలకు ఘాట్ రోడ్డులోని టోల్‌గేట్ నుంచి ప్రారంభమవుతుంది. గంగా, పార్వతి మల్లేశ్వరుల ఉత్సవమూర్తులను అలంకరించి మేళతాళాలతో ప్రత్యేక వాహనంపై ఉంచి లఘు పూజ చేస్తారు. అనంతరం గిరి ప్రదక్షిణ మేళతాళాలు, తప్పెట మోతలు, కోలాట ప్రదర్శనలు, భక్తజనుల నామస్మరణలతో సాగుతుంది. కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, నాలుగు స్తంభాల సెంటర్, సొరంగం సెంటర్, కబేళా రోడ్డు, సీవీఆర్ బ్రిడ్జి, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి గుండా రథం సెంటర్ మీదుగా గిరిప్రదక్షిణ సాగుతుంది. తిరిగి ఘాట్‌రోడ్డు దగ్గర అమ్మవారికి హారతులు, టెంకాయలు సమర్పిస్తారు. అక్కడ నుంచి ఉత్సవ మూర్తులను ప్రధాన ఆలయంలోకి చేర్చుతారు.

దక్షిణామూర్తికి ప్రత్యేక అర్చనలు

మల్లేశ్వరాలయ కుడ్యంలో ఉన్న దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. జ్ఞాన సంపదలను ఇచ్చి భక్తులకు మోక్షం కలిగించే దక్షిణామూర్తిని కొలవటం వల్ల భక్తులకు సుఖసంపదలు సమకూరుతాయని నమ్మిక. దక్షిణామూర్తికి అర్చకులు అభిషేకాది కార్యక్రమాలతో పాటు షోడశ ఉపచారాలను సమర్పించారు. మంత్రపుష్పం, హారతులు ఇచ్చారు.

దుర్గమ్మ సేవలో రవిశంకర్ గురూజీ

ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు రవిశంకర్ గురూజీ గురువారం ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో రామారావు, అధికారులు, అర్చకులు ఆయనకు సాదర స్వాగతం పలికారు. అనంతరం వేద ఆశీర్వచనం, శేష వస్త్రం, ప్రసాదం, అమ్మవారి చిత్ర పటం అందజేశారు. ఈ సందర్భంగా దేవస్థానంలో రుద్రపారాయణ చేస్తున్న వేద విద్యార్థులను కలిసి వారితో కొంచెం సేపు రవిశంకర్ ముచ్చటించారు. విద్యార్థులకు ఆశీస్సులు అందచేశారు.

జేసీ-2 పోస్టుల కోసం ఎదురుచూపు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెండు జిల్లాల్లో జాయింట్ కలెక్టర్-2 పోస్టుల కోసం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, డీఆర్వోలు ఎదురుచూస్తున్నారు. తొలి, రెండు విడతల్లో ఆర్డీవోలు, డీఆర్వోలుగా పదోన్నతులు దక్కని వారు జిల్లాకు చెందిన వారు చాలామంది ఉన్నారు. వివిధ కేడర్లలో వీరంతా పనిచేస్తున్నారు. కొంతమంది ఎన్నికల సందర్భంలో బదిలీ అయి దూర ప్రాంతాలలో ఉంటున్నారు. వీరంతా మొదటి, రెండో జాబితాలలో తమకు అవకాశాలు వస్తాయని భావించారు. ప్రభుత్వం ప్రతి జిల్లాకు అదనంగా జేసీ-2 లను నియమిస్తామని గతంలో ప్రకటన చేయటంతో.. చిట్టచివరిగా అయినా తమకు అవకాశం దక్కుతుందేమోనని తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. శాసనసభ సమావేశాలు ముగిసిన తర్వాత ప్రభుత్వం ఈ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

న్యాయవాదుల కోసం 'గ్రూప్ మెడిక్లెయిమ్, ప్రమాద బీమా పాలసీ'

ప్రవేశపెట్టిన ఏపీ బార్ కౌన్సిల్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదులకు ఏపీ బార్ కౌన్సిల్ 'గ్రూప్ మెడిక్లెయిమ్ అండ్ పర్సనల్ యాక్సిడెంట్ పాలసీ'ని ప్రవేశపెట్టింది. నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ద్వారా 2024-25 సంవత్సరానికి గానూ అడ్వకేట్లు, వారి కుటుంబ సభ్యులకు (జీవిత భాగస్వామి, ఇద్దరు పిల్లలు) రూ.10 లక్షల మెడిక్లెయిమ్, న్యాయవాదులకు రూ.2 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా కల్పిస్తున్నట్లు బార్ కౌన్సిల్ పేర్కొంది. బీమా పాలసీ కింద లబ్ధి పొందేందుకు చెల్లించాల్సిన ప్రీమియం వివరాలను సర్క్యులర్ ద్వారా బార్ అసోసియేషన్లకు తెలియజేస్తామని తెలిపింది. ఈ నెల 15 నుంచి డిసెంబరు 13 మధ్య ప్రీమియం సొమ్ము చెల్లించాలని కోరింది. ఈ ఏడాది డిసెంబర్ 16న పాలసీ ఉనికిలోకి వస్తుందని, ఏడాది పాటు అమల్లో ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు ఏపీ బార్ కౌన్సిల్ చైర్మన్ ద్వారకానాథ్‌రెడ్డి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాలసీకి సంబంధంచి ఇతర సమాచారం కోసం బార్ కౌన్సిల్ అధికారిక వెబ్‌సైట్‌ను చూడాలని అందులో పేర్కొన్నారు.

ప్రతి పైరూ ఈ-క్రాప్‌లో నమోదు: అగ్రి డెరెక్టర్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగులో ఉన్న ప్రతి పైరును ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు. గురువారం మంగళగిరిలోని కమిషనర్ కార్యాలయం నుంచి వ్యవసాయ శాఖ అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిజిటల్ విధానంలో పంటల నమోదు, రబీ సీజన్ నుంచి సవరించిన మార్గదర్శకాలపై మాట్లాడారు. ఈ-క్రాప్ డేటాతో వాస్తవిక సమాచారాన్ని భారత ప్రభుత్వ పోర్టల్‌కు అనుసంధానం చేయనున్నట్లు ఆయన తెలిపారు. రబీ పంటల వివరాలను ఈనెల 18 నుంచి నమోదు చేసి, మార్చి 15లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్ల నియామకం

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం గురువారం మరో నాలుగు కార్పొరేషన్లకు డైరెక్టర్లను నామినేట్ చేసింది. వాల్మీకి/బోయ, తూర్పు కాపు, మాదిగ, క్షత్రియ కార్పొరేషన్లకు 15 మందిని చొప్పున నియమించింది. ప్రతి కార్పొరేషన్‌లో 12మంది టీడీపీ, ఇద్దరు జనసేన, ఒక బీజేపీ వారిని డైరెక్టర్లుగా నియమించింది.

డేటా ఫర్ సేల్!



పాన్ నెంబర్, ఈ మెయిల్ ఐడీ, లోకేషన్, వాహనాల హిస్టరీ.. ఇలా ఏ డేటా కావాలన్నా మీతో సంబంధం లేకుండానే కొన్ని ఏజెన్సీలు అమ్మకానికి పెడుతున్నాయి. ఇది మంచికా.. చెడుకా.. అన్న విషయాన్ని పక్కన పెడితే నగరంలోని సర్వీసు సెక్టార్‌లో పనిచేసే సంస్థలకు మాత్రం ఉపయోగపడుతున్నాయి. ఈ డేటాను కొనుగోలు చేయటానికి అనేక సర్వీసు సెక్టార్ ఏజెన్సీలు, సర్వీసు ప్రొవైడర్స్ ఆసక్తి చూపిస్తున్నాయి. తమ రంగాల్లో కస్టమర్లను పట్టుకోవటానికి, మార్కెటింగ్ చేసుకోవటానికి, వృద్ధిని సాధించేందుకు ఈ డేటాను ఉపయోగించుకుంటున్నారు.



- విజయవాడలో సర్వీసు ప్రొవైడర్స్, సర్వీస్ సెక్టార్ ఏజెన్సీలకు డేటా సేల్ ఆఫర్స్
- పాన్‌నెంబర్స్, ఈ మెయిల్ ఐడీలు, లొకేషన్స్, వెహికల్ హిస్టరీ, బ్యాంకింగ్ డేటా
- టెకీ నగరాలైన హైదరాబాద్, చెన్నై, బెంగళూరులలో డేటా క్యాప్చర్ సంస్థలు
- వైఫై ఆధారిత ప్రత్యేక సాఫ్ట్‌వేర్లను ఉపయోగించి వెబ్‌సైట్ల హ్యాకింగ్
- ప్యాకేజీల ప్రాతిపదికన డేటా బట్వాడా చేస్తున్న సంస్థలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

సర్వీసు సెక్టార్‌లో అనేక రంగాల పరిధిలో సేవలు అందించే ఏజన్సీలు, సర్వీసు ప్రొవైడర్లకు ఇటీవల కాలంలో డేటా విక్రయిస్తామన్న ఫోన్ కాల్స్ విపరీతంగా వస్తున్నాయి. ఎవరికి పడితే వారికి ఈ ఫోన్లు రావటం లేదు. ఏరికోరి మార్కెటింగ్ రంగాల్లో ఉన్న వారినే టార్గెట్ చేసుకుని వారికి ఫోన్లు చేస్తున్నారు. ప్రధానంగా నగరంలోని రియల్ ఎస్టేట్ ఏజన్సీలు, డెవలపర్లు, స్కూల్స్, కాలేజీలు, హాస్పిటల్స్, మీ-సేవ, సీఎస్‌సీ కేంద్రాలకు ఇలా ఆయా రంగాలకు అవసరమైన డేటాను ఇచ్చేందుకు ఈ డేటా క్యాప్చర్ సంస్థలు ఆఫర్ చేస్తున్నాయి.

ప్యాకేజీలతో ప్రత్యేక ఆఫర్లు..

కొత్తవారు అయితే నెలకు రూ. 1000, పాత వారు అయితే నెలకు రూ. 5వేల చొప్పున డేటా విక్రయిస్తున్నారు. నెలవారీ ప్యాకేజీలు, త్రైమాసిక ప్యాకేజీలు, అర్ధ సంవత్సర, సంవత్సర, లైఫ్‌టైమ్ వంటి ప్యాకేజీలతో అట్రాక్ట్ చేస్తున్నారు. ప్యాకేజీలు తీసుకున్న వారికి వ్యాలిడిటీ ఆధారంగా ప్రతిరోజూ అప్‌డేటెడ్ డేటాను అందిస్తూ ఉంటాయి. వాట్సప్, మెయిల్ ద్వారా ఈ డేటాను అందిస్తుంటాయి. ఫోన్ కాల్స్ ద్వారా, వాట్సప్ ద్వారా డేటా క్యాప్చర్ సంస్థలు టచ్‌లోకి వస్తుంటాయి. తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు ఈ డేటా ఎంతగానో సహాయపడుతుందన్న ఉద్దేశ్యంతో ప్యాకేజీలు తీసుకునే వారు కూడా పెద్ద సంఖ్యలో ఉంటున్నారు.

వ్యక్తిగత సమాచారం సేకరణ

పేర్లు, ఫోన్ నెంబర్లే కాదు.. పాన్ నెంబర్లు, డ్రైవింగ్ లైసెన్స్ వంటివి కూడా ఇస్తున్నారు. వ్యక్తిగత సమాచారాన్ని కూడా ఈ సంస్థలు సేకరిస్తుండటం గమనార్హం. మీరు ఎక్కడ ఉంటారో కూడా తెలిపేలా లోకేషన్స్‌ను కూడా అందిస్తున్నాయి. విభాగాల వారీగా చూస్తే రవాణాశాఖకు సంబంధించి దాదాపుగా మీ లైసెన్సులు, ఆర్‌సీ నెంబర్లు, వాహనాల డేటా మొత్తం అందిస్తున్నారు. ఫైనాన్స్ సంస్థలు, ఇన్సూరెన్స్ సంస్థలకు ఈ డేటాను విక్రయిస్తున్నారు. బ్యాంకింగ్ డేటాను కూడా విక్రయిస్తున్నారు. ఈ రంగం అని కాకుండా ప్రతి రంగానికి సంబంధించిన డేటాను విక్రయిస్తున్నారు.

డేటా సేకరణ ఇలా..

డేటాను ఈ సంస్థలు ఎలా సేకరించగలుగుతున్నాయంటే.. టెకీ నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నై కేంద్రాలుగా పనిచేస్తున్న కొన్ని డేటా క్యాప్చరింగ్ సంస్థలు ఈ డేటా బిజినెస్ చేస్తున్నాయి. డేటా బిజినెస్ చేసే సంస్థలు తమ సంస్థల పేర్లను కానీ, ప్రధాన కార్యాలయాలు ఎక్కడ ఉంటాయో మాత్రం చెప్పరు. కేవలం ఫలానా రాష్ట్రంలో తమ కేంద్రాలు ఉన్నాయనే చెబుతారు. ఈ సంస్థలు వైఫై ఆధారితంగా ప్రత్యేక సాఫ్ట్‌వేర్ల ద్వారా డేటాను సేకరిస్తాయని ప్రాథమికంగా వాళ్ల సర్వీసు ప్రొవైడర్లకు చెబుతున్న దానిని బట్టి తెలుస్తోంది. ప్రధాన కేంద్రాలలో ఉండే సర్వర్లలో డేటాను నిక్షిప్తం చేస్తూ వాటిని ప్రాసెసింగ్ చేస్తూ ప్యాకేజీల ప్రాతిపదికన అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ డేటా కూడా మనం కోరుకున్న విధంగానే ఇవ్వటం జరుగుతుంది. రాష్ట్ర వ్యాప్తంగా కావాలంటే ఆ విధంగా ఇస్తారు. ప్రాంతీయంగా కావాలన్నా, జిల్లాలు, నియోజకవర్గాల స్థాయిలో కావాలన్నా డేటా ఇస్తారు.

కార్తీక స్నానాలకు పటిష్ఠ ఏర్పాట్లు

- నేడు మంగినపూడి బీచ్‌లో సముద్ర స్నానాలు
- లక్షన్నర మంది వచ్చే అవకాశం



బోటులో సాగర తీరం వెంబడి పర్యటిస్తున్న జిల్లా ఎస్పీ, పోలీసులు



మంగినపూడి బీచ్‌లో..

మచిలీపట్నం టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమి సందర్భంగా మంగినపూడి బీచ్‌లో శుక్రవారం పవిత్ర స్నానాలకు జిల్లా యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసింది. కలెక్టర్ డీకే బాలాజీ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు గురువారం బీచ్‌ను సందర్శించారు. యాత్రికులకు తాగునీరు, అల్పాహారం, మహిళలకు తాత్కాలిక మరుగుదొడ్లు, వృద్ధులకు ప్రత్యేక ఆటోలు ఏర్పాటు చేశారు. జిల్లా పంచాయతీ అధికారి అరుణ, ఎలక్ట్రికల్ ఎస్ఈ సత్యానందం, ఎండీవో వెంకటేష్, ఆర్డీవో స్వాతి ఏర్పాట్లను పర్యవేక్షించారు. బీచ్‌లో వాహనాలకు ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేశారు. దత్తరామేశ్వరానికి వచ్చే భక్తుల పర్యవేక్షణకు పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఏర్పాట్లను కూటమి నేతలు గోపు సత్యనారాయణ, లంకే హరికృష్ణ, లంకే శేషగిరిరావు తదితరులు పర్యవేక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశాలు ఉన్నందున పాండురంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు.

యాత్రికులకు ఇబ్బందులు కలిగించొద్దు : డీఎస్పీ



బీచ్‌కు వచ్చే యాత్రికులకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేసినట్టు డీఎస్పీ సుభాన్ తెలిపారు. గురువారం బందరు రూరల్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయవాడ, గుడివాడ, చల్లపల్లి నుంచి వచ్చే భక్తులు చిలకలపూడి సెంటర్ నుంచి బీచ్‌కు వెళ్లాలన్నారు. బంటుమిల్లి నుంచి వచ్చే భక్తులు పెదపట్నం, కానూరు మీదుగా రావాలన్నారు. రోడ్ల పక్కన పార్కింగ్ చేయవద్దన్నారు. చిన్నపిల్లలకు ట్యాగ్‌లు వేస్తారన్నారు. భక్తులు విలువైన వస్తువులు, ఆభరణాలను తీసుకురావద్దన్నారు. ఆర్‌పేట సీఐ ఏసుబాబు, రూరల్ ఎస్ఐలు సత్యనారాయణ, నాగరాజులు పాల్గొన్నారు.

హంసలదీవిలో ఎస్పీ పర్యటన..

కోడూరు : కోడూరు మండల శివారు హంసలదీవి సాగర తీరం వెంబడి జిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా పాలకాయితిప్ప వద్ద నుంచి ప్రత్యేక బోట్లు హంసలదీవి పవిత్ర కృష్ణ సంగమ ప్రాంతం వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్తీక పౌర్ణమికి వచ్చే భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా భద్రతకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మురళీధర్, అవనిగడ్డ సీఐ యువకుమార్, కోడూరు, అవనిగడ్డ ఎస్ఐలు చాణిక్య, శ్రీనివాస్, మైరెన్ సీఐ సురేష్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాలకాయితిప్ప వద్ద ఏర్పాట్లు పూర్తి

పాలకాయితిప్ప బీచ్ వద్ద కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం విచ్చేసే భక్తుల సౌకర్యార్థం పూర్తిస్థాయి ఏర్పాట్లు చేస్తున్నట్టు తహసీల్దార్ శ్రీను నాయక్ తెలిపారు. సాగర తీరం వద్ద మూడు వైద్య శిబిరాలు, నాలుగు మరుగుదొడ్లు, మూడు బోట్లలో గజ ఈతగాళ్లతో పర్యవేక్షణ, మంచినీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్ పర్యవేక్షణలో కోడూరు ఎస్ఐ చాణిక్య ఆధ్వర్యంలో 60 మంది పోలీసు సిబ్బందితో ప్రత్యేక ఏర్పాట్లుచేస్తున్నట్టు తెలిపారు.

ప్రభుత్వ కళాశాలలకు నారాయణ సహకారం

- మంత్రి నారాయణ వెల్లడి

వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు నారాయణ విద్యాసంస్థల నుంచి పూర్తి సహకారం అందిస్తామని మునిసిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. విజయవాడలోని మేరీ స్టెల్లా కాలేజీ ఆడిటోరియంలో ఇంటర్ బోర్డు ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న మంత్రి అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులను ఎలా చదివించాలి, ఎలా ర్యాంకులు పొందాలి బోధనా ప్రణాళికలు ఎలా ఉండాలి, పోటీ పరీక్షల్లో పాల్గొని నైపుణ్యాలను ఎలా పెంచుకోవాలన్న అంశాలపై మంత్రి పలుసూచనలు చేశారు. పట్టుదల ఉంటే సాధించలేనిది లేదని, ఆ మేరకు విద్యార్థులకు అవసరమైన విద్యాబోధన చేయాలని అధ్యాపకులకు సూచించారు. ఈఏపీ సెట్ రాసే విద్యార్థులకు నారాయణ విద్యాసంస్థల నుంచి మెటీరియల్ అందిస్తామని చెప్పారు. లెక్కల మాస్టరు అయిన మంత్రి విద్యార్థులకు లెక్కలు ఎలా బోధించాలనే దానిపై వర్క్‌షాప్‌లో అధ్యాపకులకు ఉదాహరణలతో సహా వివరించారు. కార్యక్రమంలో ఇంటర్ బోర్డు డైరెక్టర్ కృతికా శుక్లా, ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, ఆర్ఐవోలు, జిల్లా వృత్తి విద్యా ఆఫీసర్లు, ఐదు రీజనల్ సెంటర్ల కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం ల్యాప్‌టాప్‌ల పంపిణీపై 90 రోజుల్లో దర్యాప్తు

- శాసనమండలిలో మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో ఐఐఐటీ విద్యార్థులకు నాసిరకం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారని, దీనిపై 90 రోజుల్లో దర్యాప్తు పూర్తిచేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. రాష్ట్రంలోని ఐఐఐటీ విద్యార్థులకు 2023లో నాసిరకం ల్యాప్‌టాప్‌లు అందించడంపై మండలిలో ఎమ్మెల్సీలు భూమిరెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, దువ్వారపు రామారావు, కంచర్ల శ్రీకాంత్ అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. ఏపీ ఈ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా ఆర్జీయూకేటీ(ఐఐఐటీ)ల్లో అభ్యసించే విద్యార్థులకు అందించేందుకు 2023లో 6,500 ల్యాప్‌టాప్‌లు కొనుగోలు చేశారని పేర్కొన్నారు. ఒక్కో ల్యాప్‌టాప్ కోసం రూ.27 వేలు వెచ్చించారని తెలిపారు. అయితే 1,520 ల్యాప్‌టాప్‌ల్లో సమస్యలు ఉన్నట్లు ఫిర్యాదులు వచ్చాయన్నారు. ల్యాప్‌టాప్‌ల్లో కనీసం ఒరిజినల్ ఆపరేటింగ్ సిస్టమ్ సాఫ్ట్‌వేర్ కూడా ఇన్‌స్టాల్ చేయలేదని, బేసిక్ అడాప్టర్‌లు కూడా పనిచేయని పరిస్థితి ఉందన్నారు. కొన్ని ల్యాప్‌టాప్‌ల్లో ఆడియో క్వాలిటీలో ఇబ్బందులు ఉన్నాయని, బ్యాటరీలు కూడా నాసిరకంగా ఉన్నాయని సభకు మంత్రి లోకేశ్ వివరించారు. 'విచిత్రమేమిటంటే.. అసలు కొన్ని ల్యాప్‌టాప్‌లు ఆన్ కూడా కాలేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. నాసిరకం ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర దర్యాప్తు చేపడతాం. 90 రోజుల్లో దర్యాప్తు పూర్తి చేసి ఆ వివరాలను తప్పనిసరిగా సభ ముందు పెడతాం' అని స్పష్టం చేశారు.

పత్తి రైతులకు మద్దతు ధర ఇవ్వాలి

సీసీఐని కోరిన మంత్రి అచ్చెన్నాయుడు

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, రైతులకు కనీస మద్దతు ధర అందించాలని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సీసీఐని కోరారు. పత్తి కొనుగోళ్లపై గురువారం అమరావతి సచివాలయంలో సీసీఐ, మార్కెటింగ్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష జరిపారు. ప్రభుత్వం నిర్ణయించిన 11 యార్డులు, 60 జిన్నింగ్ మిల్లుల్లో విధిగా పత్తి కొనుగోళ్లు జరిగేలా చూడాలని, తేమ శాతం విషయంలో సరళీకృతంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు. పత్తిని ఆరబెట్టి, నాణ్యత ఉండేలా చూసుకుని, ప్లాస్టిక్ సంచుల్లో కాకుండా గన్నీ బ్యాగ్స్‌లో తీసుకువచ్చేలా రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో సీసీఐ సీజీఎం పాణిగ్రహీ, జీఎం అమరనాథ్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.



దుర్గామల్లేశ్వర దేవస్థానంలో సహస్రలింగార్చన చేస్తున్న అర్చకులు

దుర్గగుడిలో సహస్ర లింగార్చన సేవ


వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా దుర్గగుడిలో సహస్రలింగార్చన సేవలు కొనసాగుతున్నాయి. గురువారం అర్చకులు భక్తిప్రపత్తులతో వేదమంత్రసహితంగా నిర్వహించారు. స్వామి వారికి పుష్పాలు, బిల్వాలతో అలంకరించారు.

దుర్గమ్మ సేవలో హీరో సాయిధరమ్ తేజ్

దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మను సినీహీరో సాయిధరమ్ తేజ్ గురువారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు వేద పండితులు వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ ఈవో రామారావు, డిప్యూటీ ఈవో రత్నరాజు, అర్చకులు ప్రసాదం, చిత్రపటం, శేష వస్త్రం అందజేశారు.

కళావేదికపై కూచిపూడి నృత్యం..

విజయవాడకు చెందిన ఎస్.ఆర్.నందిక దుర్గగుడి కళావేదిక పై గురువారం కూచిపూడి నృత్య ప్రదర్శన చేసింది. పలు కీర్తనలకు చక్కటి అభినయం చేసి హర్షధ్వానాలు అందుకుంది. డిప్యూటీ ఈవో రత్నరాజు సర్టిఫికెట్లు, ప్రసాదాలను అందజేసి అభినందించారు.



నృత్య కళాకారులతో డిప్యూటీ ఈవో రత్నరాజు

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం

- పలువురికి తీవ్ర గాయాలు

ఉయ్యూరు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : మోటార్‌సైకిల్‌పై వస్తూ కొద్దిసేపటిలో ఇంటికి చేరుకుంటామనగా ఆ దంపతులను గుర్తుతెలియని కారు ఢీకొని భర్త అక్కడికక్కడే మృతి చెందాడు. భార్యకు స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం రాత్రి విజయవాడ-



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధరరావు

మచిలీపట్నం జాతీయ రహదారిపై ఆకునూరు ఫ్లైవోవర్‌పై జరిగింది. ఉయ్యూరు రూరల్ ఎస్సై కె.సురేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. పమిడిముక్కల స్టేషన్‌లో మత్తే రామకోటేశ్వరరావు(37) కోర్టు కానిస్టేబుల్, గొడవర్రు డిస్టలరీ వద్ద ఎక్సైజ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న అతడి భార్య దుర్గాభవాని కలిసి బుధవారం రాత్రి ద్విచక్ర వాహనంపై కంకిపాడు నుంచి గుడ్లవల్లేరు మండలం డోకిపర్రులోని ఇంటికి వస్తున్నారు. ఆకునూరు ఫ్లైవోవర్‌పై వెనుక నుంచి కారు వీరి వాహనాన్ని వేగంగా ఢీకొంది. రామకోటేశ్వరరావు అక్కడికక్కడే మృతిచెందగా దుర్గాభవానికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమాచారం తెలిసిన జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. దుర్గాభవానీని చికిత్స నిమిత్తం ఉయ్యూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించి కేసు నమోదుచేసి దర్యాప్తుచేస్తున్నారు. వీరికి పాప, బాబు ఉన్నారు.



ప్రమాదంలో రోడ్డుపై పడిన కూలీలు

బైక్‌ను ఢీకొన్న వాహనం

జగ్గయ్యపేట: జాతీయ రహదారిపై జగ్గయ్యపేట సమీపంలో ఫుడ్ ప్లాజా సమీపంలో బైక్‌పై వస్తున్న ముగ్గురు కూలీలను గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మధ్యాహ్నం జరిగింది. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన కూలీలు చిల్లకల్లు వైపు వెళ్తుండగా ఫుడ్‌ప్లాజా క్రాసింగ్ వద్ద ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని వాహనం వేగంగా ఢీకొంది. ప్రమాదంలో అనిగండ్లపాడుకు చెందిన పాపట్ల ఏసురాజు (22), కేసర చందు (25), దోసపాటి బిక్షాలు (35) ఎగిరి రోడ్డుపై పడ్డారు. వీరిలో దోసపాటి బిక్షాలు తల ఛిద్రమై పేగులు బయట పడి అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మిగిలిన ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం వారిని విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు దర్యాప్తులో బైక్‌ను ఢీకొన్న వాహనం విజయవాడ నుంచి వస్తున్న వ్యాన్‌గా గుర్తించారు. కేడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్, నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త తన్నీరు నాగేశ్వరరావు, ఎంపీపీ మార్కపుడి గాంధీ, అనిగండ్లపాడు నేత బ్రహ్మం తదితరులు క్షతగాత్రులను పరామర్శించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాంపిళ్ల నరసాయమ్మకు ఘనంగా వీడ్కోలు

- పలువురు ప్రముఖుల నివాళి



నరసాయమ్మ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : బంధుమిత్రులు, అభిమానుల అశ్రునయనాల మధ్య స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ అంతిమయాత్ర గురువారం జరిగింది. పాలఫ్యాక్టరీ సమీపంలోని నరసాయమ్మ స్వగృహం వద్ద పలువురు ప్రముఖులు ఆమెకు అంజలి ఘటించారు. కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్, బోగవల్లి శ్రీధర్, పోతిన బేసుకంఠేశ్వరుడు, కార్పొరేటర్లు తదితరులు నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆమె సేవలను కొనియాడారు.

పలువురు ప్రముఖుల సంతాపం

స్వాతంత్ర్య సమరయోధురాలు రాంపిళ్ల నరసాయమ్మ మృతి తీరని లోటని హర్యానా మాజీ ముఖ్యమంత్రి భూపేందర్ సింగ్ హుడా తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం జాతీయ కార్యదర్శి రాంపిళ్ల జయప్రకాష్‌కు తమ సందేశాన్ని పంపించారు. సమరయోధుల సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సత్యానందయాజి తన సంతాపం సందేశంలో ఆమె ఆత్మకు భగవంతుడు శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్టు తెలిపారు.

ఉచిత మధుమేహ వ్యాధి చికిత్స కేంద్రం



ఆటోనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ నివారణ దినం సందర్భంగా పటమటలోని అనురాధ పాలీ క్లినిక్ కార్డియాక్ అండ్ డయాబెటిస్ కేర్ సెంటర్‌లో ఉచిత మధుమేహ వ్యాధి చికిత్స కేంద్రం గురువారం నిర్వహించినట్లు డాక్టర్ మురళీ కృష్ణ తెలిపారు. ఉచితంగా పలు పరీక్షలు నిర్వహించి రోగులకు మందులు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. ఈ సదుపాయాన్ని 250 మంది రోగులు వినియోగించుకున్నట్లు తెలిపారు. వరల్డ్ డయాబెటిక్స్ డే సందర్భంగా డిసెంబరు 14 వరకు రక్త పరీక్షలు చేయించుకునే వారికి ప్రత్యేక రాయితీ ఉన్నారు. డాక్టర్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.

మీ కోసం

మీ సమీపంలోని స్థానిక సమస్యలను పరిష్కరించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారా? అయితే ఆ సమస్యను ఒక ఫొటో తీసి చిన్న క్యాప్షన్‌తో మాకు పంపండి. దానిని పరిష్కరించేలా ఆంధ్రజ్యోతి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తుంది. మీరు పంపే సమస్య వ్యక్తిగతమైనది కాకూడదు. పది మందికి, మీ ప్రాంత వాసులందరీ సమస్య అయి ఉండాలి.

మీరు పంపాల్సిన వాట్సప్ నెంబరు
9985411602
సమయం : ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలోపు పంపాలి



పటమట నిర్మలా హైస్కూల్ రోడ్డులో సైడ్ డ్రెయినేజీలో చెత్త, చెదారం ప్లాస్టిక్ బాటిల్స్‌తో నిండిపోయాయి. మురుగు ముందుకు పార టం లేదు. ఆ ప్రదేశమంతా దుర్గంధభరితంగా మారింది. వర్షాలు పడినప్పుడు మురుగునీరు రోడ్డు మీద ప్రవహిస్తోంది.

మోతుకూరి అరుణ్‌కుమార్, సామాజిక సేవా కార్యకర్త

శుక్రవారం సిబ్బ పనివాళ్లను పురమాయించి, సైడ్ కాల్వలోని మురుగునీటిని శుభ్రం చేయిస్తా

-శివరామకృష్ణ, 10వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

రోడ్డుపై బందరు కాల్వ నీళ్లు

- రెండు ప్రాంతాల ప్రజలు వెళ్లేందుకు కాల్వకు సమాంతరంగా రోడ్డు
- కాల్వకు నీళ్లు వదిలితే వాహనదారులకు ఇబ్బందులే
- తాత్కాలిక చర్యలు తీసుకున్నా ఫలితం శూన్యం

(లబ్బీపేట/ పటమట, ఆంధ్రజ్యోతి)

ఫకీరుగూడెం నుంచి పటమటలంక వైపు న్యూ బ్రిడ్జి కింద నుంచి రెండు ప్రాంతాల ప్రజలు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన మార్గం బందరుకాల్వ నీటితో నిండి పోవడంతో అటువైపు వెళ్లే వారికి తీవ్ర అసౌకర్యంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు వైసీపీ పాలకులు ఎన్నికల స్టంట్‌లో భాగంగా రెండు ప్రాంతాల ప్రజల రాకపోకలకు మార్గాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆలోచన మంచిదైనా ఆచరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో వర్షాకాలం, బందరు కాల్వకు నీళ్లు వదిలిన సందర్భాల్లో ఆ రోడ్డులో నీరు చేరి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం కాల్వ నీళ్లు వదలడంతో కాల్వకు సమాంతరంగా రోడ్డు ఉండడం వల్ల నీళ్లు రోడ్డుపై చేరాయి. ఆ నీరు రోడ్డుపై నిల్వకుండా తాత్కాలిక చర్యలు తీసుకున్నా ఫలితం లేకపోవడంతో ఇటువైపు రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.



న్యూ బ్రిడ్జి క్రింద బందరు కాల్వ నీటితో నిండిన రోడ్డు

ఎండాకాలంలో రిటైనింగ్ వాల్ నిర్మిస్తాం



ఈ మార్గం నిర్మించిన సమయంలో ప్రణాళికబద్ధంగా వ్యవహరించక పోవడంతో ఈ సమస్య ఏర్పడింది. దూర ప్రాంతాల వ్యవసాయ అవసరాలకు అధికంగా కాల్వకు నీళ్లు వదులుతారు. ఆ సమయంలో ఈ సమస్య ఏర్పడుతుంది. దీనికి పరిష్కారం రిటైనింగ్ వాల్ నిర్మించడమే. ఎండాకాలంలో వాల్ నిర్మించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. అదే విధంగా రోడ్డు చిన్నదిగా ఉండడంతో పాటు అవతలి వైపు రోడ్డు కూడా సరిగ్గా లేకపోడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వాల్‌తో పాటు రోడ్డును కూడా వెడల్పు చేసి చిన్న చిన్న కార్లు కూడా ప్రయాణించే విధంగా చర్యలు తీసుకుంటాం.

-చెన్నుపాటి కాంతి శ్రీ, 9వ డివిజన్ కార్పొరేటర్

మెడికల్ కోడింగ్, విదేశీ విద్యపై సెమినార్

మొగల్రాజపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేవీఎస్ఆర్ సిద్ధార్థ ఫార్మశీ కళాశాలలో గురువారం మెడికల్ కోడింగ్, విదేశీ విద్య విశిష్టతపై అంతర్జాతీయ స్థాయిలో సెమినార్ జరిగింది. ఈ సెమినార్‌లో ముఖ్య అతిధులుగా దుబాయ్‌కు చెందిన ప్రీ అప్రూవల్ అధికారి, ఆడిటర్ మెహరున్నీసా, ఆతిథ్య వక్తగా బిజినెస్ ఎనలిస్ట్ అహ్మద్ షేక్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్‌లో సర్టిఫికెట్ కోర్సులు, కమ్యూనికేషన్ స్కిల్స్, కోడింగ్ నేర్చుకునే పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏ. సునీత, కళాశాల ఫార్మాకాలేజీ విభాగాధిపతి డాక్టర్ సుప్రియ, అల్యుమినీ కార్యదర్శి డాక్టర్ బి. అనుపమ పాల్గొన్నారు.

17న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు

కృష్ణలంక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): త్రిశక్తిపీఠంలోని కాళీమాత ఆలయంలో ఈనెల 17న శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి వ్రతాలు సామూహికంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కవిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్ కుమార్, ఆలయ ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్ కిరణ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

18న పీబీ సిద్ధార్థలో అంతర్ వర్సిటీ యోగా పోటీలు

విజయవాడస్పోర్ట్సు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 18న కృష్ణా యూనివర్సిటీ అంతర్ కళాశాలల యోగా చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. రమేష్, ఫిజికల్ డైరెక్టర్ టీవీబీ కృష్ణారెడ్డిలు తెలిపారు. స్త్రీ, పురుష కేటగిరుల్లో జరిగే ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు ఆ రోజు ఉదయం 8గంటలకు అర్హతా పత్రాలతో, తగిన ధ్రువీకరణలతో టీమ్ మేనేజర్‌తో పాల్గొనాలని వారు కోరారు.

ఏపీ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం భవనం ప్రారంభం నేడు

ఆటోనగర్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అయ్యప్పనగర్ శాంతిరోడ్డులోని ఆంధ్రప్రదేశ్ అగ్నికుల క్షత్రియ సంక్షేమ భవనాన్ని శుక్రవారం ఉదయం 6.46కి పుదుచ్చేరి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు ప్రారంభిస్తారని ఏపీ అగ్నికుల క్షత్రియుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బర్రి ప్రసాద్ అన్నారు.

గురువారం ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర ఎక్సైజ్, మైనింగ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, విశిష్ట అతిథులుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడె ప్రసాద్ తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. భవనం ప్రారంభమనంతరం ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని ది కృష్ణా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ హాలులో సభ జరుగుతుందని తెలిపారు.

హిందీ భాషపై పట్టు సాధించాలి

- పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్

మొగల్రాజపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): జాతీయ భాష హిందీపై ప్రతి విద్యార్థి పట్టు సాధించాలని, దేశంలో ఎక్కడికి వెళ్లినా ఉపాధి ఉద్యోగావకాశాలు ఉంటాయని పీబీ సిద్ధార్థ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ చెప్పారు. గురువారం కళాశాల హిందీ విభాగం ఆధ్వర్యంలో జాతీయ అక్షరాస్యతా దినోత్సవం నిర్వహించారు. కళాశాల డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ జంపాల మాట్లాడుతూ జాతీయభాష హిందీ నేర్చుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అద్దంకి) ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహన్‌రావు చదువు గొప్పతనాన్ని, గురువుల గొప్పతనాన్ని వివరించారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతుల ప్రదానం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దాస్, హిందీ విభాగ అధ్యక్షురాలు డాక్టర్ ఎం. జయలక్ష్మి, లెక్చరర్ భవ్య, తెలుగు విభాగం డాక్టర్ సత్యశ్రీ, డాక్టర్ నీరజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

లబ్బీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవ సందర్భంగా నలంద కళాశాల ఎన్ఎస్ఎస్ యునిట్ ఆధ్వర్యంలో చినకాకానిలోని ఫైన్ అనాథ శరణాలయంలోని బాలలతో బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు నిర్వహించారు. అనంతరం నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్స్‌పాల్ ఎం. అనురాధ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. వెంకటేశ్వరరావు, 50 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

గవర్నర్‌పేట: నలంద విద్యానికేతన్‌లో జరిగిన వేడుకల్లో స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ భారత మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి వేడుకలు ప్రారంభించారు. ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కేజీ చిన్నారులు ఫ్యాన్సీ డ్రెస్ పోటీలు, పలు రకాల వేషధారణలతో అలరించారు.

ఆటోనగర్: బాలల హక్కుల వారోత్సవాలను గురువారం రోటరీ నగర్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ మానసిక వైద్య నిపుణులు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ పిల్లలు నేర ప్రవృత్తికి అలవాటు పడటానికి సామాజిక, కుటుంబ పరమైన అంశాలు దోహదం చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి రామ్మోహన్ రెడ్డి, ఫోరంఫర్ చైల్డ్ రైట్స్ కో-ఆర్డినేటర్ అరవ రమేష్, బర్డ్ సంస్థ సెక్రటరీ ప్రకాష్ కుమార్, జువెనైల్ వెల్ఫేర్ శాఖ ఉన్నతాధికారి రాంమనోహర్, హోమ్ ఇంటెక్ ప్రొబెషన్ అధికారి శ్రీ హసన్ ఆలీ బేగ్, హోమ్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి తదితరులు

పటమట: పటమట కోనేరు బసవయ్య చౌదరీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పాల్గొని విద్యార్థులకు ఎల్ఐసీ విజయవాడ బ్రాంచి ద్వారా స్పాన్సర్ చేసిన బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సిటీ బ్రాంచ్ నెంబర్ -4 మేనేజర్ సీహెచ్ రామకృష్ణ, మేనేజరల్ ఎన్. లలిత, సిబ్బంది, హెచ్ఎం జి. ఎస్తేరు రాణి పాల్గొన్నారు.

- శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ ఒలింపియాడ్ పాఠశాలలో ప్రీ ప్రైమరీ, ప్రైమరీ విద్యార్థులు వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు. పాఠశాల ఇన్‌చార్జి రావి పద్మ, జోన్ ఈడీ ఎం మద్దినేని మురళీకృష్ణ, ప్రిన్సిపాల్ కొల్లి సునీత, అకడమిక్ డీన్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారతీనగర్: ఆంధ్రా లయోలా కళాశాల అలుమ్నిఅసోసియేషన్ (ఎల్‌సీఏఏ) ఆధ్వర్యంలో కళాశాలలోని ఆల్కా స్కూల్‌లో కార్యదర్శి కొత్త విజయ్‌కుమార్ అధ్యక్షతన గురువారం బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ కె.సుధాకర్ బాబు, కళాశాల ఫాదర్ పి.జాన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.



పటమట స్కూల్‌లో బాలల దినోత్సవంలో పాల్గొన్న డీఈవో సుబ్బారావు



నలందలో వివిధ వేషధారణలతో అలరించిన చిన్నారులు

పిల్లలను ఆటలు, సాంస్కృతిక అంశాల్లో ప్రోత్సహించండి



గ్రాండ్ పేరెంట్స్‌కు బహుమతులు అందజేస్తున్న మేడా సీతారామయ్య

మొగల్రాజపురం, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల తరువాత పిల్లలను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని వీపీ సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య చెప్పారు. బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు క్రీడల్లోను, సాంస్కృతిక అంశా ల్లోను పిల్లలు పాల్గొనేలా తల్లిదం డ్రులు ప్రోత్సహించాలని సూచిం చారు. అనంతరం ఉపాధ్యాయులు పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే విషయంలో తమ పాత్ర ఏంటి అనే అంశంపై స్కిట్ ప్రదర్శించారు. చదువులో వివిధ సబ్జెక్టులలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్‌లు, జ్ఞాపికలు బహుకరించారు. పదిహేను సంవత్సరాలుగా సేవలు అందించిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రోజ్‌మేరీ, విద్యార్థులు పాల్గొన్నారు.

- **ముగిసిన గ్రాండ్ పేరెంట్స్ డే**

కిండర్ గార్డెన్ విభాగం రెండు రోజుల పాటు నిర్వహించిన గ్రాండ్ పేరెంట్స్ డే గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య మాట్లాడుతూ నానమ్మ, అమ్మమ్మ, తాతయ్యలు మనుమలు, మనుమరాండ్రకు మంచి స్ఫూర్తిదాయకమైన కథలు చెప్పాలని సూచించారు. పోటీల్లో గెలుపొందిన గ్రాండ్ పేరెంట్స్‌కు మొమెంటోలు బహుకరించారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డి పై చర్యలు తీసుకోండి

- తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా

వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, హోం మంత్రి కుటుంబాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శ్రీరెడ్డిపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా ప్రభుత్వాన్ని కోరారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటువంటి వారి పై కఠిన చర్యలు తీసుకోకపోవటంతోనే వైసీపీ సోషల్ మీడియా పేట్రేగిపోతోందని వ్యాఖ్యానించారు. శ్రీరెడ్డి కూడా ఒక మహిళేనని, ఆమె మాట్లాడే భాషను చెప్పుకోవడానికి కూడా సిగ్గుపడుతున్నామన్నారు. ఈనెల 12న సాయంత్రం కృష్ణలంక పోలీస్ స్టేషన్‌లో తాను ఫిర్యాదు చేసినా శ్రీరెడ్డి పై కేసు నమోదు చేయలేదన్నారు. తాను ఆధారాలతో పోలీసుల వద్దకు వెళ్లినప్పుడు కేసు నమోదు చేశారని, తగు విచారణ చేసి చర్యలు తీసుకుంటానని సీఐ హామీ ఇచ్చారని తెలిపారు. బంకా నాగమణి, తుపాకుల రమణమ్మ, మద్దాల రుక్మిణి, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న చిగురుపాటి రాధిక

సర్టిఫికెట్లు పంపిణీ

లబ్బీపేట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీ వాహనాలు నడిపేవారు అప్రమత్తంగా వ్యవహరించాలని, డ్రైవింగ్ అనేది బాధ్యతగా గుర్తించిన నాడే రహదారి ప్రమాదాలు తగ్గు ముఖం పడతాయని భారత మహిళా పారిశ్రామికవేత్తల సమైక్య ఏపీ చాప్టర్ అధ్యక్షురాలు చిగురుపాటి రాధిక అన్నారు. గురువారం ది కృష్ణా డిస్ట్రిక్ట్ లారీ ఓనర్స్ అసోసియేషన్ మోడల్ డ్రైవింగ్ స్కూల్‌లో 32 రోజుల పాటు హెవీ వెహికల్ శిక్షణ పూర్తి చేసుకున్న 1076, 77 బ్యాచ్‌ల ట్రైనీలకు సర్టిఫికెట్లు పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె డ్రైవింగ్ స్కూల్‌లో డిజిటల్ తరగతి, సిమ్యులేటర్‌ల విభాగాలను సందర్శించి మౌలిక వసతుల పట్ల హర్షం వ్యక్తం చేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు నాగమోతు రాజా, ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు పాల్గొన్నారు.

రజకుల సంక్షేమానికి టీడీపీ కట్టుబడి ఉంది : ఎమ్మెల్యే గద్దె



వల్లూరు మధుసూదనరావును అభినందిస్తున్న గద్దె రామ్మోహన్

పటమట, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రజకులు సంక్షేమానికి టీడీపీ చిత్తశుద్ధితో పనిచేస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఏపీ రజక కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన వల్లూరి మధుసూదనరావు అశోక్‌నగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో గురువారం ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. మధుసూదనరావును గద్దె అభినందిస్తూ రజకుల సంక్షేమానికి టీడీ పీ రాష్ట్రంలోని పలు ప్రాతాంల్లో ధోబీఖానాల నిర్మాణంతో పాటు అవసరమైన విద్యుత్, నీటి సౌకర్యాలను కల్పించిందన్నారు. ఇటీవల కృష్ణలంక ప్రాంతంలో దోబీఖానా వద్ద రూ.10లక్షల వ్యయంతో రేకుల షెడ్ల నిర్మాణం ప్రారంభించామన్నారు. రజక నాయకులు ఝాన్సీ, నాగయ్య శ్రీనివాసరావు, వి శ్రీనివాసరావు, కె శ్రీను, ఆర్ అమరేశ్వరరావులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి మంజూరు పత్రం అందజేత

19వ డివిజన్‌కు చెందిన పల్లంకుర్తి ఈసమ్మకు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.2.50లక్షల నగదు మంజూరు పత్రాన్ని ఎమ్మెల్యే గద్దె తన కార్యాలయంలో అందజేశారు. గద్దె రమేష్, ఇత్తడి ఛార్లెస్, తలపాటి ప్రసాద్‌లు పాల్గొన్నారు.



మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సిద్ధార్థ మెడికల్ కళాశాలలో మధుమేహ నిర్ధారణ క్యాంప్


ప్రభుత్వాసుపత్రి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ మధుమేహ నివారణ దినం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సిద్ధార్థ మెడికల్ కళాశాలలో గురువారం డయాబెటీస్ స్క్రీనింగ్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డయాబెటీస్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ప్రొఫెసర్ డాక్టర్‌ఆర్.నాగేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ విజయశ్రీ, డాక్టర్ ప్రశాంతి, సత్యకిషోర్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే లక్ష్యం

కృష్ణలంక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): అధిక సంఖ్యలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాలను కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్ బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. గురువారం విద్యాధరపురంలోని నాక్ శిక్షణ కేంద్రంలో జాబ్‌మేళా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ - సీడాప్, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) శిక్షణా కేంద్రం ఆధ్వర్యంలో ఈ మేళా జరిగింది. ఈ మేళాలో అర్బన్ సంస్థ, ఇన్నోసోర్స్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ (ఎస్‌బీఐ కార్డ్స్), అపోలో ఫార్మసీస్ లిమిటెడ్, ఎస్‌బీఐ పేమెంట్స్ లిమిటెడ్, ఫెయిర్ డీల్ కాపిటల్ ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారని వారు తెలిపారు.

నేడు గోపరాజు రామచంద్రరాజు జయంతి

సమాజంలో అసమానతలు, కుల, మత ఛాయలు చెరిగిపోవాలని యవ్వనంలోనే కంకణం కట్టుకున్నారు. ప్రజలకు మూఢ నమ్మకాలపై కాకుండా శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాలపై విశ్వాసం ఉండాలని గాఢంగా విశ్వసించారు. అందుకోసం ఎన్నో ఆటు పోట్లను ఎదుర్కొన్నారు. పనిచేసే చోట వ్యతిరేకతనూ మూటగట్టుకున్నారు. చివరికి ఉద్యోగాన్ని వదిలేసి సమాజంలో మార్పు కోసం అడుగులేశారు. ఆయనే గోరా (గోపరాజు రామచంద్రరాజు). హేతువాద ఉద్యమానికి బీజాలు వేసిన గోరా జయంతి సందర్భంగా ప్రత్యేక కథనం..





సహపంక్తి సమావేశంలో గోరా(ఫైల్)

మానవత్వం.. గోరా అభిమతం

యవ్వనంలోనే కుల, మత రేఖలు చెరిపేసి.. కృష్ణాజిల్లా నుంచి నాస్తికత్వ ఉద్యమానికి శ్రీకారం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్)

గోరా అసలు పేరు గోపరాజు రామచంద్రరాజు. కులం, మతం కాకుండా సమాజంలో మానవత్వం పరిమళించాలని విద్యార్థి దశ నుంచే ఆయన బలంగా విశ్వసించారు. అందుకోసం అంచలంచెలుగా పోరాటం మొదలు పెట్టారు. నాస్తికత్వ ఉద్యమానికి కృష్ణాజిల్లాలో మొదటిగా పునాదులు వేశారు. ఆ విత్తనాలను ప్రపంచవ్యాప్తంగా నాటారు. సమాజంలో నీతి కావాలంటే నాస్తికత్వం అవసరమని గాఢంగా విశ్వసించారు. విద్యార్థి దశలో ఆయనను స్నేహితులు నువ్వు మంచివాడివే కానీ నీలో వచ్చిన లోటల్లా ఆ నాస్తికత్వమే అన్నారు. అయినా ఆయన వెనకడుగు వేయలేదు. సాంఘిక అసమానతలను పెంచుతున్న కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేశారు.

జంధ్యాన్ని విసిరేసి..కులాన్ని వదిలేసి

కాకినాడ, మద్రాసు నగరాల్లో విద్యాభ్యాసం చేసిన ఆయన మచిలీపట్నం కళాశాలలో వృక్షశాస్త్ర విభాగ ప్రొఫెసర్‌గా పనిచేశారు. నాస్తిక భావాలను వ్యాప్తి చేస్తున్నారని అక్కడ రెండుసార్లు డిస్మిస్ చేశారు. తర్వాత 1940లో ఆయనే ఉద్యోగాన్ని వదిలేశారు. 1928లో బహిరంగంగా తనకు ఏ కులం లేదని ఒంటిపై ఉన్న జంధ్యాన్ని తీసి విసిరేశారు. దీనితో కులం నుంచి ఆయనను బహిష్కరించారు. 1936 నుంచి నాస్తిక ప్రచారం విస్తృతంగా చేశారు. కృష్ణాజిల్లా కనుమూరులో 1942 ఫిబ్రవరి 28, మార్చి ఒకటో తేదీల్లో నాస్తిక ప్రథమ మహాసభలు నిర్వహించారు. వయోజన విద్య అస్పృశ్యత నిర్మూలన, గ్రామపారిశుధ్యం, మహిళాభివృద్ధి, మూఢనమ్మకాలకు వ్యతిరేకం, జాతీయోద్యమ ప్రచారం, గ్రంథాలయ ఉద్యమం, కులాంతర వివాహాలు, సహ పంక్తి భోజనాలు వంటి కార్యక్రమాలు చేపట్టారు.

పటమటలో నాస్తిక కేంద్రం

తొలుత ముదునూరులో నాస్తిక ప్రచారం మొదలుపెట్టారు. 1947లో ముదునూరు నుంచి విజయవాడ పటమటకు వచ్చి నాస్తిక కేంద్రాన్ని స్థాపించారు. 1949లో సంఘం పత్రికను స్థాపించారు. ఈ నాస్తికత్వాన్ని దేశవ్యాప్తం చేశారు. 1970 జనవరిలో అఖిల భారత నాస్తిక మహాసభలు నిర్వహించారు. ఇటలీ, పశ్చిమజర్మనీ, హాలెండ్, డెన్మార్క్, స్వీడన్, నార్వే, ఫ్రాన్స్, ఇంగ్లండ్, ఐర్లాండ్, అమెరికా, కెనడా, ఫిజీదీవులు, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా, ఇండోనేషియా, సింగపూర్, శ్రీలంక దేశాల్లో పర్యటించి నాస్తికత్వాన్ని ప్రచారం చేశారు. అక్కడ నాస్తిక సంఘాలను నెలకొల్పారు. ఇండియన్ రేషనలిస్ట్ అసోసియేషన్ స్థాపకుల్లో గోరా ఒకరు. దీనికి ఆయన అధ్యక్షుడిగా పనిచేశారు. జాతీయ, భూదాన ఉద్యమంతోపాటు హేతువాద ఉద్యమాన్ని సమాంతరంగా నడిపారు. గాంధీజీ, వినోభాతో సంబంధాలు కొనసాగిస్తూనే పెరియార్ ఈవీ రామస్వామినాయకర్, త్రిపురనేని రామస్వామి, ఎస్.రామనాథన్, జీడీ నాయుడు వంటి వారితో సంబంధాలు నడిపేవారు. కృష్ణాజిల్లాలో ప్రారంభించిన నాస్తిక ఉద్యమాన్ని ఆనాడే ఆయన విదేశాలకు తీసుకెళ్లారు. ఇప్పటి విజయవాడలో ఏటా అంతర్జాతీయ నాస్తిక మహాసభలు నిర్వహిస్తారు. ఇక్కడికి విదేశాల నుంచి ప్రతినిధులు హాజరవుతారు.


మహాత్మా గాంధీతో గోరా(ఫైల్)

పేరుకో సిగ్నేచర్

సమాజంలో మార్పు యువతరం మాత్రమే తీసుకురాగలదని బలంగా నమ్మిన వ్యక్తి గోరా. అందుకే నాస్తికత్వ ప్రచారంలో యువకులను భాగస్వాములను చేసుకున్నారు. నాడు విద్యాభ్యాసం చేస్తున్న యువతకు దీని గురించి వివరించేవారు. ఆ మార్పును తన ఇంటి నుంచే చూడాలని భావించారు. గోరా పిల్లలకు మతఛాయలు లేని పేర్లు పెట్టారు. నాడు మూఢ నమ్మకాలు ఎక్కువగా ఉండేవి. పుట్టిన ప్రతి బిడ్డకు తాతల పేర్లు, భగవంతుడి పేర్లను పెట్టేవారు. అమ్మాయిలకు గ్రామదేవతల పేర్లు ఉండేలా నామకరణం చేసేవారు. ఈ వ్యవస్థకు భిన్నంగా గోరా సంతానానికి నామకరణాలు చేశారు. ఆ పేర్ల వెనుక ఒక ఉద్యమస్ఫూర్తి ఉండాలనుకున్నారు. పెద్దకుమార్తెకు మనోరమ అని కొలంబోలో ఉండగా మిత్రులు పేరు పెట్టారు. 1930లో ఉప్పు సత్యాగ్రహం జరుగుతున్నప్పుడు కుమారుడు జన్మించాడు. అతనికి లవణం అని నామకరణం చేశారు. 1932లో గాంధీ ఇర్విన్ ఒడంబడిక సమయంలో మూడో సంతానంగా జన్మించిన కుమార్తెకు మైత్రిగా పేరు పెట్టారు. గాంధీజీ జాతీయ విద్య కోసం ప్రయత్నాలు చేస్తున్న సమయంలో జన్మించిన కుమార్తెకు విద్య అని నామకరణం చేశారు. ఐదో సంతానంగా కుమారుడు 1936 డిసెంబరులో పుట్టాడు. 1937 ప్రారంభంలో ఎన్నికలు జరిగి కాంగ్రెస్ పార్టీ మొదటిసారిగా రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చింది. దీనితో అతడికి విజయం అని పేరు పెట్టారు. 1939లో రెండో ప్రపంచ యుద్ధం ప్రారంభమైనప్పుడు జన్మించిన కుమారుడికి సమరం అని నామకరణం చేశారు. 1941లో ఆయనకు ఏడో సంతానంగా కుమారుడు జన్మించాడు. అది ప్రపంచంలో హిట్లర్, ముసోలినీ టోజో వంటి వారు నియంతలుగా రాజ్యమేలుతున్న సమయం. దీంతో అతడికి నియంత అని పేరు పెట్టారు. ఎనిమిదో సంతానంగా 1945లో కుమార్తె జన్మించింది. అప్పుడు ప్రపంచ వాతావరణం, దేశ పరిస్థితుల్లో మార్పులు మొదలయ్యాయి. దీనితో ఆమెకు మారు అని పేరు పెట్టారు. చివరిగా, తొమ్మిదో సంతానంగా జన్మించిన కుమార్తెకు నౌ అని నామకరణం చేశారు. మనుమలకు మిలాప్, చునావ్, సాదిక్, పవర్, వజీర్, గ్రాం, రాహత్, వికాస్, ఆదేశ్ అని పేర్లు పెట్టారు. మనవరాళ్లకు సకల, సుగతి, క్రాంతి, సూయజ్, రశ్మి, కీర్తి, దీక్ష, జగతి, రజత, సబల అని పేర్లు పెట్టారు. కులమతాలతో సంబంధం లేకుండా వారికి వివాహాలు జరిపించారు.

నాలుగో తరమూ గోరా బాటలోనే..

కులం, మతం లేని సమాజాన్ని చూడాలని గోరా సంకల్పం తీసుకున్నారు. నాస్తిక ఉద్యమానికి ఆయన ఒక్కరే ముందుగా అడుగులు వేశారు. ఇప్పుడు రెండు తెలుగు రాష్ట్రాల్లో 10వేల మంది వరకు నాస్తికత్వం వైపు ఉన్నారు. ఏటా విజయవాడ నాస్తిక కేంద్రంలో జాతీయ, అంతర్జాతీయ సదస్సులు నిర్వహిస్తాం. మేమంతా మూడో తరంలో ఉన్నాం. ఇప్పుడు నాలుగో తరం వచ్చింది. వారూ గోరా ఆశయాలను కొనసాగిస్తున్నారు. ఇక్కడున్న నాస్తిక కేంద్రంలో కులాంతర వివాహాలు జరుగుతాయి. కులాంతర వివాహాలు చేసుకుని కుటుంబ పెద్దలు ఏం చేస్తారోనన్న భయంతో ఉన్న వారికి ఇక్కడ కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

- కీర్తి, గోరా మనవరాలు

దేశభద్రతకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అవసరం

» ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): దేశభద్రత కోసం నూతన సాంకేతిక పరిజ్ఞానాలను అభివృద్ధి చేయడం ఎంతో అవసరమని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) అన్నారు. డిఫెన్స్ స్టాండింగ్ కమిటీ పర్యటనలో భాగంగా గురువారం తిరువనంతపురంలోని బ్రహ్మోస్ ఏరో స్పేస్‌ను ఆయన సందర్శించారు. కమిటీ చైర్మన్ రాధామోహన్‌సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎంపీ పాల్గొన్నారు. రక్షణ రంగ అభివృద్ధి కోసం బ్రహ్మోస్ వంటి సంస్థలను మరింతగా ప్రోత్సహించాలని అన్నారు. తర్వాత తిరువనంతపురంలోని సదరన్ ఎయిర్ కమాండ్ హెడ్ క్వార్టర్స్‌ను ఎంపీ సందర్శించారు. అక్కడ నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు.

జీతాలు చెల్లించండి

» ప్రభుత్వానికి గ్రంథాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు విజ్ఞప్తి

కృష్ణలంక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు, పెన్షనర్లకు జీతాలు, పెన్షన్లు నవంబరు 14వ తేదీ దాటుతున్నా ఇంతవరకు జమకాలేదని ఆంధ్రప్రదేశ్ జిల్లా గ్రంథా లయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కళ్లేపల్లి మధుసూదనరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని ఇతర ఉద్యోగులకు అందరికి జీతాలు వచ్చినా తమకెందుకు రాలేదో అని గ్రంథాలయ సంస్థ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఒకవైపు గ్రంథాలయ వారోత్సవాలు మొదలై వాటిని ఘనంగా నిర్వహిస్తున్నప్పటికీ తమకు ప్రభుత్వం జీతాలు ఇంకా ఇవ్వలేదని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి నారా చంద్ర బాబునాయుడు జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.


శాస్త్రోకంగా పూజలు చేస్తున్న శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు

నూతన చాంబర్‌లోకి శాప్ చైర్మన్

విజయవాడ స్పోర్ట్సు, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ(శాప్) కార్యాలయంలో ఆధునీకరించిన నూతన చాంబర్‌లోకి శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు గురువారం ప్రవేశించారు. శాస్త్రోకంగా పూజలు చేసి, చాంబర్లోకి వెళ్లిన ఆయనకు పలువురు ప్రముఖులు, అధికారులు, ఉద్యోగులు శుభాభినందనలు తెలి పారు. ఈ చాంబర్ నుంచే రాష్ట్రంలో క్రీడల అభ్యున్నతి, మౌలిక వసతుల కల్పనకు, మార్పులకు శ్రీకారం చుడతానని ఆయన హామీ ఇచ్చారు.

కాకినాడ సుబ్బయ్య హోటల్ భోజనంలో కాళ్లజెర్రి

» మానవ హక్కుల కమిషన్ చైర్మన్ ఆగ్రహం

» హోటల్ పరిశీలన.. సీజ్

వన్‌టౌన్, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గవర్నర్‌పేటలోని కాకి నాడ సుబ్బయ్య హోటల్‌లో గురువారం మధ్యాహ్నం ఒక కస్టమర్ భోజ నంలో కాళ్లజెర్రి కనిపించింది. ఈ విషయం వ్యక్తిగత పనులపై విజయ వాడ వచ్చిన కేంద్ర మానవ హక్కుల కమిషన్ ఇన్‌చార్జి చైర్మన్ విజయ భారతి సయాని దృష్టికి వెళ్లగా, ఆమె తనిఖీలు నిర్వహించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు, విజయవాడ మునిసిపల్ అధికారులతో కలిసి హోటల్‌ను పరిశీలించారు. అనంతరం హోటల్‌ను సీజ్ చేస్తూ ఉత్తర్వులిచ్చారు. ప్రజ ల ప్రాణాలతో చెలగాటమాడితే ఎంతటి వారికైనా చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు.

రైల్వే రక్షణ కవచ్!

» ప్రయాణికుల భద్రతకు పటిష్ట వ్యవస్థ

» దక్షిణ మధ్య రైల్వేలో విజయవంతంగా అమలు

» మెయిన్ లైన్‌లో విజయవాడ డివిజన్ అత్యంత కీలకం

» విజయవాడ డివిజన్‌లో అమలు చేసేదెప్పుడు?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రైలు ప్రమాదాలు జరగటానికి ప్రధాన కారణం సిగ్నలింగ్ సమస్య. ఒకే లైనుపై రెండు రైళ్లు ఎదురెదు రుగా దూసుకురావటం వల్ల జరుగుతున్నవే 99 శాతం మేర ఉంటు న్నాయి. రైలు పట్టాలు తప్పినా ప్రమాదాలు జరుగుతాయి కానీ ప్రస్తుతం అందుబాటులోకి తీసుకువచ్చిన ఎల్‌హెచ్‌బీ బోగీల కారణంగా పట్టాలు తప్పినా అవి బ్యాలెన్స్ చేసుకుంటున్నాయి. ఒకే ట్రాక్‌పై ఎదురెదురుగా 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో దూసుకు వచ్చే రైళ్లు ఢీ కొన్నపుడు మాత్రం ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అయినా కూడా ప్రయాణికులు చనిపోతున్నారు. ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు అనేవి కేవలం పట్టాలు తప్పితే వాటిని బ్యాలెన్స్ చేయటా నికే పరిమితమవుతున్నాయి. ఒకే ట్రాక్ మీదకు వచ్చే ప్రమాదాలను నియంత్రిం చగలిగితే తప్ప ప్రయాణికుల భద్రతకు భరోసా ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఒకే ట్రాక్ మీదకు రైళ్లు ఎందుకు వస్తాయంటే సిగ్నలింగ్ సమస్యలు వచ్చినపుడే జరుగుతుంది. మాన్యు వల్‌గా ఇచ్చే సిగ్నల్స్‌లో ఏమాత్రం పొరపాటు జరిగినా ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు వచ్చే ప్రమాదం ఉంటుంది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఇటీవల కాలంలో తక్కువ దూరంలో మరిన్ని సిగ్నల్స్ ఏర్పాటు, ఆటో మేటిక్ సిగ్నలింగ్ సిస్టమ్ వంటివి ఏర్పాటు చేస్తున్నారు. ఇవి చాలా వరకు సత్ఫలితాలు ఇస్తున్నా.. ఇటీవల కాలంలో చెన్నైలో జరిగిన ప్రమాదంతో ఇంకా పటిష్టమైన వ్యవస్థలను అభివృద్ధి చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇందులో భాగంగా 'కవచ్'ను దక్షిణ మధ్య రైల్వే అధికారులు విజయవంతంగా పరీ క్షించారు. ఒకే ట్రాక్ మీదకు రెండు రైళ్లు దూసుకువస్తుంటే ఈ వ్యవస్థ వల్ల పైలట్లతో సంబంధం లేకుండా రైలు వేగాన్ని తగ్గించేసి వాటిని నిలుపుదల చేస్తుంది. ఇదెలా సాధ్యమవుతుంది? దీని సాంకేతిక విధానాలేమిటో చూద్దాం..

కవచ్ అంటే ఏమిటి?

కవచ్‌ను యాంటీ కొలిజన్ సిస్టమ్ అని కూడా పిలుస్తారు. రైళ్ల భద్రతను పెంచటానికి పూర్తి స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో దీనిని రూపొందించారు. ఒకే ట్రాక్‌పైన ఎదు రెదురుగా వచ్చే రైళ్ల ప్రమాదాలను నివారించటం, వెనుక నుంచి రైళ్లు ఢీకొనటం, అతివేగం కారణంగా పట్టాలు తప్పటం, ఎదురుగా వచ్చే వాటిని ఢీకొనాల్సిన పరిస్థితుల్లో ప్రమాదాలను నివారించే వ్యవస్థ ఈ 'కవచ్'. ఆటోమేటిక్ బ్రేకింగ్ సిస్టమ్ (ఏబీఎస్), ఆటోమేటిక్ వార్నింగ్ సిస్టమ్, రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ (ఆర్ఎఫ్ఐడీ) ట్యాగ్‌లు, జీపీఎస్ - జీఎస్ఎం కమ్యూనికేషన్స్ మిళితంగా 'కవచ్' వ్యవస్థ ఆధారపడి పని చేస్తుంది.

'కవచ్' పనిచేసే విధానం

'కవచ్' వ్యవస్థను ఏర్పాటు చేయాలంటే లోకో పైలట్ల ఇంజిన్ చాంబర్‌లో ప్రత్యేకమైన కవచ్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టలేషన్ చేస్తారు. ట్రాక్ వెంబడి ఉన్న ప్రతి రైల్వేస్టేషన్‌లో కూడా కవచ్ సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టలేషన్ చేస్తారు. ట్రాక్ పొడవునా టెలి కమ్యూనికేషన్ టవర్లను నెలకొల్పుతారు. ట్రాక్‌ల వెంబడి ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లను అమర్చుకుంటూ వెళతారు. ఈ వ్యవస్థలు నిరంతరాయంగా పనిచేస్తాయి. ఒకే ట్రాక్‌లో నిర్ణీత సమయంలో ఎదురెదురుగా రైళ్లు వస్తుంటే చాలా దూరం నుంచే కవచ్ పసిగట్టి వెంటనే లోకో పైలట్లకు వీడియో, ఆడియోతో కూడిన ప్రమాద సంకేతాలను అందిస్తుంది. ఒక వేళ లోకో పైలట్ ప్రతిస్పందించకపోతే కవచ్ సిస్టమ్ ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. వెంటనే రైళ్ల వేగాన్ని తగ్గిం చేస్తుంది. రైళ్ల మధ్య దూరాన్ని లెక్కించుకుని బ్రేకింగ్ దూరాన్ని అంచనా వేస్తుంది. వెంటనే బ్రేకింగ్ చేయటం ద్వారా రెండు రైళ్లను నిలుపుదల చేస్తుంది. రైల్వే ట్రాక్ వెంబడి ఉన్న ఆర్ఎఫ్ఐడీ ట్యాగ్‌లు ఎప్పటికప్పుడు కవచ్‌కు వాటి స్థితిగతుల గురించి సమాచారాన్ని ఇస్తాయి. దీంతో రియల్ టైమ్ డేటా ఆధారంగా కవచ్ పనిచూస్తూ రైళ్లను ఢీకొనకుండా నియంత్రిస్తాయి.

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో అమలు

కవచ్ వ్యవస్థను మొదటి సారిగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోనే ప్రయోగాత్మకంగా ప్రారంభించి విజయవంతంగా అమలు చేస్తున్నారు. కవచ్ వ్యవస్థ అమల్లో ఉన్న ట్రాక్‌లలో ప్రమాదాలు దాదాపుగా తగ్గాయి. సమయపాలనతో రైళ్లు నడుస్తున్నాయి. నిర్వహణ ఖర్చులు తగ్గుతున్నాయి.

విజయవాడకు కవచ్ అవసరం!

దేశంలోనే రెండో అతిపెద్ద రైల్వే జంక్షన్ విజయవాడ మీదుగా రోజూ ప్రయాణికులు, సరకు రవాణాకు 450 రైళ్లు తిరుగుతుంటాయి. ఈ ప్రాంతంలో మెయిన్‌లైన్ నౌపాడ వరకు ఉంది. విజయవాడ-విశాఖపట్నం, విజయవాడ-చెన్నై, విజయవాడ-బెంగళూరు, విజయవాడ- తిరుపతి, విజయవాడ-గూడూరు, విజయవాడ-కాజీపేట సెక్షన్ల మధ్య రైళ్లు కిటకిటలాడుతుంటాయి. విజయవాడ మీదుగా ముంబాయి, ఢిల్లీ, పాట్నా, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. తీవ్రరద్దీ కూడలి విజయవాడ డివిజన్‌లో భవిష్యత్తు ఉపద్రవాలను నివారించాలంటే కవచ్ వంటి వ్యవస్థ అవసరం.

22 నుంచి ఫల, పుష్ప ప్రదర్శన


ప్రదర్శనా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రోజ్ సొసైటీ సభ్యులు

లబ్బీపేట, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రోజ్ సొసైటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో విజయవాడ నగరపాలక సంస్థ, అర్బన్ గ్రీనరీ, ఉద్యానవన శాఖ సహకారంతో ఈనెల 22 నుంచి 25వ తేదీ వరకు పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులోని సిద్ధార్థ హోట ల్ మేనేజ్‌మెంట్ కళాశాల మైదానంలో ఫల, పుష్ప ప్రదర్శన-2024 నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షురాలు ఎస్.ఉషారాణి, కార్య దర్శి జి.లక్ష్మి తెలిపారు. గురువారం టిక్కిల్ రోడ్డులోని రోజ్ సొసై టీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ మాజీ అధ్యక్షురాలు ఎ.వి.సీతామహాలక్ష్మి నివాసంలో ప్రదర్శనా పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. రాష్ట్రం లోని వివిధ ప్రాంతాల నుంచి చేమంతులు, గులాబీలతో పాటు దేశీయ, అంతర్జాతీయ పూలమొక్కలు, పలు రకాల పండ్ల మొక్కలు, గార్డెన్ అలంకరణ వస్తువులు, పరికరాలు, పూల కుండీలు, ఆర్గానిక్ ఎరువులు, ఆర్గానిక్ ఆహార పదార్థాలు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ ప్రదర్శనలో 95 స్టాల్స్‌కు పైగా ఏర్పాటు చేస్తున్నామని అందులో రైతుల స్టాల్స్ కూడా ఉంటాయని తెలిపారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ ప్రదర్శనలో నాలుగు రోజులు పలు పాఠశాలల విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, పలు రకాల పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇక్కడకు వచ్చే సందర్శకులకు కొన్ని రకాల విత్తనాలు, మొక్కల నారు ఉచితంగా అందజేస్తామని తెలిపారు.

తిరుమలలో గతంలో అపచారాలు: మంత్రి కొల్లు


ఆలయం వెలుపల కొల్లు రవీంద్ర

తిరుమల, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గతంలో కొన్ని అపచారాలు జరిగాయని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. తిరుమలలో గురువారం తిరుప్పావడ సేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో శ్రీవారి ప్రసాదాలు ఎలా ఉండేవో అందరం చూశామని, ఇప్పుడు ప్రసాదం తీసుకుంటే ఆత్మసంతృప్తి కలుగుతోందన్నారు. తిరుమల పవిత్రతను కాపాడేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చాలా మార్పులు చేశారన్నారు. రాష్ట్రంలో సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అమలు కావాలని, ముఖ్యంగా యువతకు మంచి ఉపాధి అవకాశాలు వచ్చేలా ఆశీస్సులు ఇవ్వాలని శ్రీవారిని వేడుకున్నానని రవీంద్ర తెలిపారు.

24న ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవం

ధర్నాచౌక్, నవంబర్ 14 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ సినీ వజ్రోత్సవ వేడుకలు ఈనెల 24న విజయవాడలో నిర్వహించనున్నట్టు ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ తొండెపు దశరథ జనార్దన్ తెలిపారు. గాంధీనగర్‌లోని తెలుగు ఫిలిం చాంబర్ హాల్‌లో గురువారం నిర్వహించిన కమిటీ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. వజ్రోత్సవ వేడుకల్లో దేశవ్యాప్తంగా పలు భాషల ప్రముఖ నట దిగ్గజాలు పాల్గొంటారన్నారు. విజయవాడలో ఎన్టీఆర్ స్మారక ఉద్యానవనాన్ని ఏర్పాటు చేసేందుకు తెలుగు సినీ ముఖ్యులతో పాటు సీఎం చంద్రబాబు ఆసక్తితో ఉన్నారన్నారు. నగరంలోనూ రామోజీ ఫిలింసిటీ లాంటి స్టూడియో ఏర్పాటుకు సహకారం అందిస్తామన్నారు. సినీ పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు చంద్రబాబు సానుకూలంగా ఉన్నారన్నారు. వేదికపై అనాటి సినీ ప్రముఖులను సన్మానిస్తామన్నారు. పాలేపు రామారావు, నవరంగ్ థియేటర్ అధినేత భూపాల్ ప్రసాద్, ఊర్వశీ థియేటర్ అధినేత విశ్వనాథ్, ముత్తవరపు శ్రీనివాసులు, రాంగోపాల్ రామచంద్రరావు, శక్తి పిక్చర్ రమేష్, తెలుగు ఫిలిం చాంబర్ సహ కార్యదర్శి శివ, విశ్వేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

సంయమనం పాటించండి

» లయోల కళాశాల యాజమాన్యం నిర్ణయం వెలువరించే వరకు ఆగండి

» వాకర్స్‌తో సమావేశంలో సీపీ ఎస్వీ రాజశేఖరబాబు

విజయవాడ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రా లయోలా కళాశాల యాజమాన్యం నిర్ణయాన్ని వెలువరించేవరకు సంయమనం పాటించండి. కళాశాల గేట్లను తోసుకుంటూ వెళ్లడం, యాజమాన్యం పట్ల అనుచితంగా వ్యవహరించడం మంచి పద్ధతి కాదు. యాజమాన్యంపై సామాజిక మాధ్యమాల్లో ద్వేషపూరిత పోస్టింగ్‌లు ఆపండి.' అని వాకర్స్‌కు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు సూచించారు. లయోలా కళాశాల, వాకర్స్ అసోసియేషన్ సభ్యుల మధ్య కొద్దిరోజులుగా వివాదం జరుగుతున్న నేపథ్యంలో గురువారం కమిషనరేట్‌లోని సమావేశమందిరంలో కళాశాల యాజమాన్యం, వాకర్స్ అసోసియేషన్ సభ్యులతో సీపీ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు శ్రేయస్కరం కాదని ఇరువర్గాలకు సూచించారు. సమస్యకు త్వరలో పరిష్కారం వస్తుందని సీపీ అన్నారు.

నేడు జాబ్‌మేళా

కృష్ణలంక, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ), జిల్లా ఉపాధి కల్పన శాఖ, డీఆర్‌డీఏ- సీడాప్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువత కోసం శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలోని మహాత్మాగాంధీ రోడ్డు, లబ్బీపేట జోయలుక్కాస్ జ్యూయలరీ, వివంత హోటల్ పక్కన జోయలుక్కాస్ జ్యూయలరీ సంస్థలో పనిచేయడా నికి సేల్స్ ఎగ్జిక్యూటివ్, సేల్స్ ట్రైనీలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. డిప్లొమా, డిగ్రీ పూర్తిచేసి 18 నుంచి 25 ఏళ్ల లోపున్న వారు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి మంచి వేతనం ఇస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతలు ఉన్న అభ్యర్థులు ముందుగా హెచ్ టీటీపీఎస్://టిన్యూరల్. కామ్/జాబ్‌మేళా-నైపుణ్యం లింక్ నందు తమ పూర్తి వివరాలతో రిజిస్టర్ అయి జాబ్‌మేళాకు రెజ్యూమ్‌లతో లేదా బయోడేటా ఫామ్‌లతో పాటు ఆధార్, సర్టిఫికెట్ల జిరాక్సు కాపీలతో రావాలని, మరిన్ని వివరాలకు 0866-2491916, 89787 77585లకు ఫోన్‌చేసి సంప్రదించాలని సూచించారు.

నవ్య చిత్రజ్యోతి

శుక్రవారం 15 నవంబరు 2024
cinema@andhrajyothy.com

మామయ్య ఆశీస్సులు



సాయిదుర్గ తేజ్ తెలుగు చిత్రపరిశ్రమలో తన పదేళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్నారు. ఆయన నటించిన తొలి చిత్రం 'పిల్లా నువ్వు లేని జీవితం' 2014 నవంబర్ 14న విడుదలైంది. ఇక అప్పటినుంచి వరుసగా సినిమాలు చేస్తూ హీరోగా తన స్థాయిని పెంచుకున్నారు సాయిదుర్గా తేజ్. తన మేనమామ పవన్‌కల్యాణ్‌తో కలసి 'బ్రో' చిత్రంలో నటించి తన కల నెరవేర్చుకున్నారు. రోడ్ యాక్సిడెంట్ తర్వాత మళ్లీ కొత్త జీవితాన్ని పొందిన సాయిదుర్గా తేజ్ 'విరూపాక్ష'తో హిట్ కొట్టారు. 'బ్రో' తర్వాత కొంత గ్యాప్ తీసుకుని ఇప్పుడు తన 18వ చిత్రంలో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమా నిర్మాణం శరవేగంతో జరుగుతోంది. తన పదేళ్ల సినీ జీవితం పూర్తయిన సందర్భంగా సాయిదుర్గా తేజ్ గురువారం సాయంత్రం మంగళగిరిలో మామయ్య పవన్‌కల్యాణ్‌ను కలసి ఆశీస్సులు పొందారు.

వెన్నెల వచ్చింది



బెల్లంకొండ సాయిశ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకత్వంలో కె.కె.రాధామోహన్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. పెన్ స్టూడియోస్ అధినేత డాక్టర్ జయంతిలాల్ గడా చిత్ర సమర్పకుడు. ఈ సినిమాలో ఓ హీరోయిన్‌గా తమిళ దర్శకుడు శంకర్ కుమార్తె అదితీ శంకర్ నటిస్తోంది. 'అల్లరి పిల్ల వెన్నెల' అంటూ పరిచయం చేస్తూ ఆమె ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. హాఫ్ సారీ ధరించి, సైకిల్ నడుపుతున్న అదితీ లుక్ ఆకట్టుకుంటోంది. సాయిశ్రీనివాస్ సరసన ఆమె నటిస్తోంది.

క్రైమ్ థ్రిల్లర్

కొత్తగా..



త్రిగుణ్ హీరోగా హెబ్బా పటేల్, ఇషా చావ్లా, వర్షిణి హీరోయిన్లుగా నటించిన 'టర్నింగ్ పాయింట్' చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను హీరో బెల్లంకొండ సాయిశ్రీనివాస్, దర్శకుడు విజయ్ కనకమేడల విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్ దత్తి మాట్లాడుతూ 'ఓ వైవిధ్యమైన కాన్సెప్ట్‌కు సస్పెన్స్, మాస్ అంశాలు జోడించి తీస్తున్నాం. త్వరలోనే టీజర్‌ను కూడా విడుదల చేస్తాం. కొత్తదనం కోరుకునే ప్రేక్షకులను అలరించే సినిమా ఇది.' అన్నారు. దర్శకుడు కుహన్ నాయుడు మాట్లాడుతూ 'క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ సినిమాలో త్రిగుణ్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. ప్రతి సన్నివేశం ఉత్కంఠభరితంగా ఉంటుంది. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి' అని చెప్పారు.

కామెడీ ఎంటర్‌టైనర్



నివాస్, అమితశ్రీ జంటగా నటించే 'తెలియదు.. గుర్తులేదు.. మర్చిపోయా' చిత్రం షూటింగ్ గురువారం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో మొదలైంది. వెంకటేశ్ వీరవరపు దర్శకత్వంలో శరత్ చెన్నా నిర్మిస్తున్నారు. పృథ్వీపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు సంగీత దర్శకుడు ఆర్.పి.పట్నాయక్ కెమెరా స్విచ్ఆన్ చేయగా, నటుడు రఘుబాబు తొలి క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా పృథ్వీ మాట్లాడుతూ 'ఇందులో ఓ ఇంట్రెస్టింగ్ రోల్ చేశాను. ఏ పాత్రకు ఎవరు సరిపోతారో వారినే తీసుకుని నిర్మిస్తున్నారు. నిర్మాత శరత్ బాగా చదువుకున్న వ్యక్తి. ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా తీస్తున్నారు' అని చెప్పారు. ఇది ఫుల్‌లెంగ్త్ కామెడీ ఎంటర్‌టైనర్ అని దర్శకుడు వెంకటేశ్ చెప్పారు. 18 నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తున్నట్లు నిర్మాత శరత్ తెలిపారు. వినోద్‌కుమార్, రఘుబాబు, జెమిని సురేశ్, భరద్వాజ్, ఖయ్యూం ఇతర ముఖ్య తారాగణం.

డబ్బు కోసం సాహసాలు



హీరో నితిన్, దర్శకుడు వెంకీ కుడుముల కాంబినేషన్‌లో వస్తున్న యూనిక్ యాక్షన్ ఫిల్మ్ 'రాబిన్‌హుడ్'. ఈ సినిమాను మైత్రీ మూవీస్ అధినేతలు నవీన్ యర్నేని, రవిశంకర్ వై నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను గురువారం విడుదల చేశారు. డబ్బు సంపాదించడమే లక్ష్యంగా హై ఫై ఇళ్లను టార్గెట్ చేసుకుని దోపీడిలు చేసే మోడరన్ రాబిన్‌హుడ్‌గా నితిన్‌ని టీజర్‌లో పరిచయం చేశారు. పవర్‌ఫుల్ కుటుంబ నేపథ్యం కలిగిన శ్రీలీలను ఇష్టపడడం, అప్పటికే డేంజర్‌లో ఉన్న అతని లైఫ్‌ని మరింత కాంప్లికేట్ చేస్తుంది. వినోదం, యాక్షన్, బ్రీత్ టేకింగ్ మూమెంట్స్‌తో దర్శకుడు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నారు. ఇందులో ఓ సీన్‌లో నితిన్ అరబ్ షేక్‌గా కనిపించి అలరించారు. క్రిస్మస్ సందర్భంగా డిసెంబర్ 25న చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాతలు తెలిపారు.

జపాన్ వెళ్లిన మెగాస్టార్



మెగాస్టార్ చిరంజీవి ప్రస్తుతం జపాన్‌లో ఉన్నారు. అయితే ఇది హాలీడే ట్రిప్ కాదు.. 'విశ్వంభర' చిత్రం షూటింగ్ కోసం. ఒక పాట, కొన్ని కీలక సన్నివేశాలను ప్రస్తుతం అక్కడ చిత్రీకరిస్తున్నారు. పది రోజుల పాటు జపాన్‌లో ఉండి తర్వాత హైదరాబాద్‌కు తిరిగి వస్తారు. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో చిరంజీవి పోస్ట్ చేసిన లేటెస్ట్ స్టిల్ ఇప్పుడు వైరల్ అవుతోంది. సోషియో ఫాంటసీ ఇతివృత్తంతో రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' వచ్చే సంక్రాంతికి రిలీజ్ కావాలి. అయితే రామ్‌చరణ్ నటిస్తున్న 'గేమ్‌ఛేంజర్' కోసం సంక్రాంతి నుంచి వేసవికి విశ్వంభర చిత్రాన్ని షిఫ్ట్ చేశారు. వశిష్ట దర్శకత్వంలో ప్రమోద్, వంశీకృష్ణారెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.



అందుకే రాటుదేలా


'నా కెరీర్ ఆరంభం నుంచి ఏదైనా కొత్తగా ప్రయత్నించాలనుకున్నాను. అందులో రిస్క్ ఎక్కువ ఉంటుంది అని తెలుసు. కానీ నటిగా రాటుదేలాలంటే అదొక్కటే మార్గం అని అర్థం చేసుకున్నాను' అని జాన్వీకపూర్ చెప్పారు. తన సినిమాల ఎంపిక గురించి ఆమె మాట్లాడుతూ 'కమర్షియల్ హంగులు, డ్యూయెట్‌లు, డాన్స్‌లు, ఎక్కువ మందికి రీచ్ అయ్యే అవకాశం ఉన్న సినిమా కథలు నా దగ్గరకు చాలా వచ్చాయి. అలాంటి సినిమాలకు సక్సెస్ రేటు కూడా ఎక్కువే ఉంటుంది. కానీ నన్ను నేను సవాల్ చేసుకోవాలని నిర్ణయించుకున్నాను. స్క్రిప్ట్ చదివినప్పుడు నన్ను ఆశ్చర్యపరిచినవాటినే ఎంచుకున్నాను. సినిమా విజయానికి బాక్సాఫీసును ఎప్పుడూ కొలమానంగా చూడను. నేను మొదట్నుంచి కఠినమైన మార్గాన్నే ఎంచుకున్నాను. సులభంగా ఉండే కథలు, పాత్రలకు దూరంగా ఉన్నాను. నాకు సవాల్‌గా అనిపించే వాటినే అంగీకరించాను. అలా ఇండస్ట్రీలో నా ప్రత్యేకతను నిలబెట్టుకున్నాననే అనుకుంటున్నాను' అన్నారు.

విక్కీ మహావతార్

యోధుడు, చిరంజీవి అశ్వత్థామ జీవితం ఆధారంగా బాలీవుడ్‌లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. విక్కీ కౌశల్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. 'మహావతార్' అనే టైటిల్‌ను మేకర్స్ ఖరారు చేశారు. స్త్రీ 2 చిత్రానికి దర్శకత్వం వహించిన అమర్ కౌశిక్ 'మహావతార్'ను తెరకెక్కిస్తున్నారు. దినేశ్ విజన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను యూనిట్ ఇటీవలే విడుదల చేసింది. అగ్నికీలల మధ్యన తీక్షణంగా చూస్తున్న పరశురాముని పాత్రలో విక్కీ కౌశల్ ఆకట్టుకున్నారు. ఇప్పటికే ప్రీ ప్రొడక్షన్ వర్క్ ప్రారంభమైంది. వచ్చే ఏడాది నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. 2026 క్రిస్మస్‌కు ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం విక్కీ కౌశల్ 'ఛావా' అనే చిత్రం చేస్తున్నారు. ఇందులో ఛత్రపతి శివాజీ కుమారుడు శంభాజీ మహారాజ్ పాత్రను ఆయన పోషిస్తున్నారు.




రిపబ్లిక్‌డే నాడు రిలీజ్



అక్షయ్ కుమార్ కథానాయకుడిగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'స్కై ఫోర్స్'. ఈ చిత్రం విడుదల తేదీ ఖరారైంది. వచ్చే ఏడాది రిపబ్లిక్ డే నాడు సినిమాను విడుదల చేస్తున్నట్లు యూనిట్ తెలిపింది. అలాగే క్రిస్మస్ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. 1947లో భారతదేశం పాకిస్థాన్‌పై జరిపిన తొలి వైమానిక దాడుల నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది. యాక్షన్, డ్రామా, ఎమోషన్స్ దేశభక్తి లాంటి అంశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి అని చిత్రబృందం తెలిపింది. ఈ చిత్రంలో సారా అలీఖాన్, నిమ్రత్ కౌర్ కథానాయికలు. సందీప్ కేల్వానీ, అభిషేక్ అనిల్ కపూర్ ద్వయం దర్శకత్వం వహించారు. దినేశ్ విజన్ జియో స్టూడియోస్‌తో కలసి నిర్మిస్తున్నారు.

కుందాపూర్‌లో కాంతార



రిషబ్ శెట్టి కథానాయకుడిగా నటించిన కన్నడ చిత్రం 'కాంతార' సక్సెస్ తర్వాత దీనికి ప్రీక్వెల్‌గా వస్తున్న 'కాంతార: చాప్టర్ 1' పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ ఖర్చుకు వెనుకాడకుండా భారీస్థాయిలో సినిమాను తెరకెక్కించే పనిలో పడింది. కర్నాటకను పాలించిన కదంబ రాజుల నేపథ్యంలో కథ సాగుతుంది. ఆ నాటి కాలాన్ని ప్రతిబింబించేలా కుందాపూర్‌లో మేకర్స్ భారీ సెట్స్‌ను నిర్మించి షూటింగ్ చేస్తున్నారు. కొన్ని ఎకరాల విస్తీర్ణంలో రాజ భవనాలు, దేవాలయాల సెట్స్‌ను వేశారు. ఈ చిత్రానికి రిషబ్‌శెట్టి దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ కిరంగందూర్ నిర్మిస్తున్నారు.

అపరిచితుడు కాన్సెప్ట్‌తో



జగదీష్ ఆమంచి కథానాయకుడిగా నటిస్తూ, స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిస్తున్న చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అనేది ఉపశీర్షిక. థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాలను ప్రారంభించింది. గురువారం 'యముడు' ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి చేతుల మీదుగా విడుదల చేశారు. జగదీశ్ ఆమంచి మాట్లాడుతూ 'విక్రమ్ నటించిన 'అపరిచితుడు' చిత్రం కాన్సెప్ట్ తరహాలోనే మా సినిమా కథ కూడా ఉంటుంది. అధర్మానికి పాల్పడేవాళ్లకు యముడు గరుడ పురాణం ప్రకారం శిక్షలు వేస్తుంటాడు. తెలుగు ప్రేక్షకులకు నచ్చే అన్ని హంగులూ మా సినిమాలో ఉన్నాయి' అని చెప్పారు. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి కథానాయిక. ఆకాశ్ చల్లా కీలకపాత్ర పోషించారు. సంగీతం: భవానీ రాకేశ్. సినిమాటోగ్రఫీ: విష్ణురెడ్డి వంగా

తెలంగాణ నేపథ్యంలో తొలి డిటెక్టివ్ వెబ్ సిరీస్



నరేశ్ అగస్త్య, మేఘా ఆకాశ్ ప్రధాన పాత్రలు పోషించిన 'వికటకవి' వెబ్ సిరీస్ ఈ నెల 28 నుంచి స్ట్రీమింగ్ కానుంది. రామ్ తాళ్లూరి నిర్మించిన ఈ సిరీస్‌కు ప్రదీప్ మద్దాలి దర్శకత్వం వహించారు. తెలంగాణ నేపథ్యంలో రూపుదిద్దుకున్న తొలి డిటెక్టివ్ వెబ్ సిరీస్ ఇదే. తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ మాట్లాడుతూ 'స్వాతంత్ర్యం రాకముందు మన దేశంలో చాలా సంస్థానాలు ఉండేవి. వాటిల్లో తెలంగాణకు చెందిన అమరగిరి ప్రాంతం ఒకటి. శ్రీశైలం ప్రాజెక్ట్ పూర్తి చేస్తున్నారు. కొన్నాళ్లకు ఊరు మునిగిపోతుంది అనగా ఏం జరిగింది అనే బ్యాక్‌డ్రాప్‌లో తీసిన సిరీస్ ఇది. 1940ల్లో అమరగిరి ప్రాంతంలో ఒక సంఘటన జరుగుతుంది. 1970లో అది పునరావృతమవుతుంది. ఇలా జరగడాన్ని అమ్మోరు శాపంగా అక్కడి ప్రజలు భావిస్తుంటారు. హీరో ఈ సమస్యను ఎలా పరిష్కరించాడన్నది ఆసక్తికరం. అప్పటి ప్రపంచాన్ని క్రియేట్ చేసి తెరకు ఎక్కించడం కిక్ ఇచ్చింది. కంటెంట్ ప్రకారం రాయల్ లుక్‌తో చూపిస్తూ మంచి థ్రిల్లర్‌గా రూపొందించాను.' అన్నారు. ఇందులో నరేశ్ డిటెక్టివ్‌గా, అమరగిరి యువరాణిగా మేఘా ఆకాశ్ అద్భుతంగా నటించారని ప్రదీప్ చెప్పారు.

దీపిక పాంచ్ పటాక



13-0తో థాయ్‌పై భారత్ గెలుపు

రాజ్‌గిర్ (బిహార్): చిచ్చర పిడుగు దీపిక ఐదు గోల్స్‌తో మోతెక్కించడంతో.. మహిళల ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో డిఫెండింగ్ చాంప్ భారత్ సెమీస్ బెర్త్‌ను దాదాపు ఖాయం చేసుకొంది. గురువారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో భారత్ 13-0తో పసికూన థాయ్‌లాండ్‌ను చిత్తు చేసి టోర్నీలో మూడో విజయాన్ని నమోదు చేసింది. దీపిక (3వ, 19వ, 43వ, 45వ, 45వ నిమిషాలు) ఐదు గోల్స్ చేయగా.. ప్రీతి దూబే (9, 40), లాల్‌రిమ్సియామి (12, 56), మనీషా చౌహాన్ (55, 58) తలో రెండు గోల్స్ సాధించారు. డుంగ్ డుంగ్ (30), నవ్‌నీత్ కౌర్ (53) చెరో గోల్ కొట్టారు. శనివారం జరిగే నాలుగో మ్యాచ్‌లో ఒలింపిక్ రజత పతక విజేత చైనాతో భారత్ తలపడనుంది. రౌండ్ రాబిన్ లీగ్ ఫార్మాట్‌లో జరుగుతున్న టోర్నీలో ప్రస్తుతం భారత్ 9 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

సూర్య ఇచ్చిన చాన్స్‌తోనే..


తిలక్ వర్మ

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరిగిన మూడో టీ20లో తిలక్ వర్మ వన్‌డౌన్‌లో బరిలోకి దిగి శతకంతో అదరగొట్టాడు. అయితే ఈస్థానంలో కెప్టెన్ సూర్యకుమార్ ఆడుతుంటాడు. కానీ ఆ మ్యాచ్‌లో మాత్రం తిలక్ రావడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఇందుకు కారణం.. సూర్యనే అతడి బ్యాటింగ్ ఆర్డర్ మార్చాడట. 'మ్యాచ్ ముందు రోజు రాత్రి కెప్టెన్ సూర్య నా గదికి వచ్చి నీవు మూడో నెంబర్‌లో ఆడబోతున్నావని చెప్పాడు. ఇది చక్కటి అవకాశం.. సద్వినియోగం చేసుకోమని సలహా ఇచ్చాడు. మైదానంలో నా సత్తా ఏమిటో చూపిస్తానని అప్పుడే అతడితో అన్నాను. అలాగే నిరూపించుకోవడం సంతోషంగా ఉంది' అని మ్యాచ్ ముగిశాక తిలక్ తెలిపాడు. అయితే కెప్టెన్ సూర్య మాత్రం.. గెబెహాలో తిలక్ తన గదికి వచ్చి వన్‌డౌన్‌లో చాన్స్ ఇవ్వమని అడిగినట్టు చెప్పడం గమనార్హం.

ప్రీక్వార్టర్స్‌లోనే సింధు ఓటమి

కుమామోటో (జపాన్): భారత ఏస్ షట్లర్ పీవీ సింధు.. జపాన్ మాస్టర్స్ ప్రీక్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సింధు 21-17, 16-21, 17-21తో మిషెల్లీ లీ (కెనడా) చేతిలో ఓడింది. గంటా 15 నిమిషాలపాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్‌ను గెలిచిన సింధు.. ఆ తర్వాత తడబడింది.

అర్జున్ పరాజయం

కోల్‌కతా: టాస్ స్టీల్ చెస్ ఇండియా ఓపెన్ ర్యాపిడ్‌లో తెలుగు గ్రాండ్ మాస్టర్ అర్జున్ ఇరిగేసికి రెండు ఓటములు ఎదురయ్యాయి. టోర్నీకి రెండో రోజైన గురువారం జరిగిన నాలుగో రౌండ్‌లో సో వెస్లీ (అమెరికా), ఆరో రౌండ్‌లో టాప్ ర్యాంకర్ కార్ల్‌సన్ (నార్వే) చేతిలో పరాజయం పాలైన అర్జున్.. ఐదో రౌండ్‌లో సహచరుడు నారాయణ లైనాతో గేమ్‌ను డ్రాగా ముగించాడు. ఇక, మహిళల విభాగం నాలుగో రౌండ్‌లో దివ్య దేశ్‌ముఖ్‌పై గెలిచిన హారిక.. ఐదో రౌండ్‌లో వంతిక అగర్వాల్, ఆరో రౌండ్ వాలెంటినా గునియాతో గేమ్‌లను డ్రాగా ముగించింది. కాగా, మరో జీఎం కోనేరు హంపి రెండు గేమ్‌లు ఓడి ఓ మ్యాచ్‌ను డ్రా చేసుకొంది. మొత్తంగా ఆరు రౌండ్లు ముగిసే సరికి అర్జున్ 2 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో.. మహిళల్లో హారిక 3.5 పాయింట్లతో నాలుగు, హంపి 2 పాయింట్లతో 8వ స్థానంలో ఉన్నారు.

సిరీస్‌పైనే గురి!

రాత్రి 8.30 గం. నుంచి స్పోర్ట్స్18, జియో సినిమాలో

గెలుపే ధ్యేయంగా భారత్ | సమం కోసం దక్షిణాఫ్రికా | నేడు నాలుగో టీ20



జొహాన్నె‌స్‌బర్గ్: నాలుగు టీ20ల సిరీస్ ఆఖరి అంకానికి చేరింది. శుక్రవారం వాండరర్స్ మైదానంలో భారత్-దక్షిణాఫ్రికాల మధ్య చివరిదైన నాలుగో మ్యాచ్ జరుగనుంది. 2-1 ఆధిక్యంలో ఉన్న టీమిండియాకు సిరీస్ దక్కాలంటే మరో విజయం చాలు. బ్యాటింగ్ పూర్తి స్థాయిలో పటిష్టంగా కనిపించకపోయినా.. బౌలర్లు మాత్రం అండగా నిలుస్తున్నారు. అటు ఆతిథ్య జట్టు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ మ్యాచ్‌ను చేజారనీయకూడదనే కసితో ఉంది. మూడో టీ20లో విజయానికి చేరువగా వచ్చినా ఫలితం సాధించలేకపోయింది. దీంతో నేటి మ్యాచ్‌లో నెగ్గి సిరీస్‌ను సమం చేయాలన్న ఆలోచనలో ఉంది. మరోవైపు వాండరర్స్‌లో భారత్‌కు మెరుగైన రికార్డే ఉంది. ఇక్కడే తొలి టీ20 వరల్డ్‌కప్ గెలవడంతో పాటు, ఈ ఫార్మాట్‌లో సూర్య తన చివరి శతకాన్ని కూడా ఇక్కడే సాధించాడు.

రింకూపై ఆందోళన: ఫినిషర్ రింకూ సింగ్ ఆటతీరుపై జట్టు ఆందోళనలో ఉంది. ఐపీఎల్‌లో సంచలన ఆటతీరుతో టీమిండియాలో చోటు దక్కించుకున్న తను కొంత కాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బందిపడుతున్నాడు. ఈ సిరీస్‌లో మూడు మ్యాచ్‌ల్లో కలిపి 28 పరుగులే సాధించాడు. ఆత్మవిశ్వాసం లోపించడంతో సెంచూరియన్‌లో వేగంగా ఆడాలని చూసినా బంతిని సరిగ్గా కనెక్ట్ చేయలేకపోయాడు. ఆరు, ఏడో నెంబర్‌లో బ్యాటింగ్‌కు దిగడం కూడా అతడి బ్యాటింగ్‌పై ప్రభావం చూపిస్తోంది. రింకూ ఉత్తమ ఇన్నింగ్స్ అన్నీ ఐదో నెంబర్‌లో ఆడినప్పుడే వచ్చాయి. క్రీజులో నిలదొక్కుకునేందుకు కాస్త సమయం చిక్కితే ఫామ్‌లోకి వచ్చే అవకాశం ఉంది. ఇందుకు బ్యాటింగ్ ఆర్డర్‌లో హార్దిక్‌కన్నా ముందుగా పంపితే ఫలితం ఉంటుందేమో. ఇక ఓపెనర్ శాంసన్ రెండు వరుస డకౌట్లతో నిరాశపరిచినా.. అభిషేక్ బ్యాట్ ఝుళిపించడం సానుకూలాంశం. వన్‌డౌన్‌లో దిగిన తిలక్ వర్మ శతకంతో అదరగొట్టాడు. నేటి మ్యాచ్‌లో ఈ ముగ్గురూ చెలరేగితే మరోసారి భారీ స్కోరు ఖాయమే. కెప్టెన్ సూర్యకుమార్ మాత్రం బ్యాట్ ఝుళిపించాల్సి ఉంది. బౌలింగ్ విభాగం పటిష్టంగా కనిపిస్తోంది. అయితే ఈ మ్యాచ్‌లోనైనా పేసర్లు వైశాఖ్, యష్‌లలో ఒకరికి అవకాశం దక్కుతుందా అనేది వేచిచూడాల్సిందే.

అన్ని విభాగాల్లో రాణిస్తేనే..: చివరి రెండు టీ20ల్లో ఆతిథ్య జట్టు ప్రదర్శన మెరుగ్గానే ఉంది. రెండో టీ20లో సఫారీ బౌలర్లు తేలిపోయినా బ్యాటర్లు మాత్రం భారత్‌ను కాసేపు భయపెట్టారు. విఫలమవుతున్న క్లాసెన్ తన బ్యాట్ పవరేంటో చాటుకున్నాడు. అలాగే జాన్సెన్ అనూహ్య బ్యాటింగ్‌తో దాదాపు గెలుపు దిశగా మ్యాచ్‌ను తీసుకెళ్లాడు. మిల్లర్ ఒక్కడే స్థాయికి తగ్గట్టుగా ఆడడం లేదు. బౌలింగ్‌లో స్పిన్నర్ కేశవ్ అండగా నిలుస్తుండగా పేసర్లు కొట్జీ, సిమెలానె ధారాళంగా పరుగులిచ్చుకున్నారు. జాన్సెన్ మాత్రం పొదుపుగా బౌలింగ్ చేయగలిగాడు. నేటి మ్యాచ్ జట్టుకు అత్యంత కీలకం కావడంతో అన్ని విభాగాల్లోనూ చెలరేగితేనే భారత్‌ను ఓడించి సిరీస్‌ను సమం చేసే అవకాశం ఉంటుంది.

తుది జట్లు (అంచనా)

భారత్: శాంసన్, అభిషేక్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, రమణ్‌దీప్, అక్షర్, అర్ష్‌దీప్, బిష్ణోయ్, వరుణ్ చక్రవర్తి.

దక్షిణాఫ్రికా: రికెల్టన్, హెన్‌డ్రిక్స్, మార్‌క్రమ్ (కెప్టెన్), స్టబ్స్, క్లాసెన్, మిల్లర్, జాన్సెన్, కొట్జీ, సిమెలానె, కేశవ్, సిపామ్లా.

పిచ్, వాతావరణం

వాండరర్స్ వికెట్ బ్యాటర్లకు అనుకూలంగా ఉంటుంది. ఆఖరి పది మ్యాచ్‌ల్లో తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 174గా ఉంది. దీంతో నేటి మ్యాచ్‌లోనూ భారీ స్కోర్లు ఖాయమే. ఇక్కడ ఆడిన చివరి పోరులో భారత్ 200+ స్కోరు చేయగా.. కుల్దీప్ ఐదు వికెట్లు తీసి దక్షిణాఫ్రికాను 100లోపే కట్టడి చేశాడు. ఆకాశం మేఘావృతంగా ఉండనుంది.

సర్ఫరాజ్ మోచేతికి గాయం?

పెర్త్: వాకాలో ప్రాక్టీస్ చేస్తుండగా మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కుడి మోచేతికి బంతి బలంగా తగిలింది. దీంతో అతడు ఇబ్బందిపడుతూ నెట్స్‌లో నుంచి బయటకు వెళ్లాడు. అయితే, తీవ్రమైన గాయం కాకపోవడంతో స్కానింగ్ అవసరం లేదని చెప్పినట్టు సమాచారం. ఆసీస్, భారత్‌ల మధ్య తొలి టెస్ట్ ఈ నెల 22 నుంచి జరగనుంది.

మ్యాక్స్‌వెల్ మెరుపులు

తొలి టీ20లో ఆసీస్ గెలుపు


మ్యాక్స్‌వెల్ (43)

బ్రిస్బేన్: మ్యాక్స్‌వెల్ (43) మెరుపు దాడితో.. తొలి టీ20లో ఆస్ట్రేలియా 29 పరుగుల తేడాతో పాకిస్థాన్‌ను ఓడించింది. వర్షం కారణంగా 7 ఓవర్లకు కుదించిన మ్యాచ్‌లో తొలుత ఆసీస్ 4 వికెట్లకు 93 పరుగులు చేసింది. ఛేదనలో పాక్ 64/9 స్కోరు మాత్రమే చేసింది. టాపార్డర్ బ్యాటర్ల పేలవ ప్రదర్శనతో 24/6తో పీకల్లోతు కష్టాల్లో నిలిచిన పాక్‌ను టెయిలెండర్లు అబ్బాస్ అఫ్రీది (20), షహీన్ అఫ్రీది (11) ఘోర పరాభవం నుంచి కాపాడారు. బ్రాట్‌లెట్, నాథన్ ఎలీస్ చెరో 3 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌తో బాబర్ ఆజమ్ పాక్ తరపున అత్యధిక (124) వన్డేలాడిన షోయబ్ మాలిక్ రికార్డును దాటేశాడు.

కుశాల్, అవిష్క సెంచరీలు

కివీస్‌పై లంక విజయం

దంబుల్లా: కుశాల్ మెండిస్ (143), అవిష్క ఫెర్నాండో (100) శతకాలతో అదరగొట్టడంతో.. వర్షప్రభావిత తొలి వన్డేలో శ్రీలంక 45 పరుగుల (డక్‌వర్త్ లూయిస్ పద్ధతి) తేడాతో న్యూజిలాండ్‌పై గెలిచింది. వాన కారణంగా మ్యాచ్ నిలిచే సమయానికి శ్రీలంక 49.2 ఓవర్లలో 324/5 స్కోరు చేసింది. అనంతరం డ/లూ పద్ధతిలో లక్ష్యాన్ని 27 ఓవర్లలో 221 పరుగులకు కుదించగా.. కివీస్ 175/9 స్కోరు మాత్రమే చేసింది. విల్ యంగ్ (48), రాబిన్సన్ (35), బ్రేస్‌వెల్ (34) ఫర్వాలేదనిపించారు. మధుశంక 3 వికెట్లు పడగొట్టాడు.

గోవా కుర్రాళ్ల చరిత్ర

రంజీల్లో 606 పరుగుల భాగస్వామ్యం


కశ్యప్ బక్లే (300 నాటౌట్) | స్నేహల్ కౌతాంకర్ (314 నాటౌట్)

పోర్వోరిమ్ (గోవా): గోవా ఆటగాళ్లు స్నేహల్ కౌతాంకర్ (215 బంతుల్లో 314 నాటౌట్), కశ్యప్ బక్లే (269 బంతుల్లో 300 నాటౌట్) త్రిశతకాలతోపాటు 90 ఏళ్ల రంజీ చరిత్రలో రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో ప్లేట్‌గ్రూప్‌లో అరుణాచల్‌పై గోవా ఇన్నింగ్స్ 551 పరుగుల భారీ తేడాతో గెలిచింది. మూడో వికెట్‌కు స్నేహల్, కశ్యప్ ఏకంగా 606 పరుగులు చేసి రంజీ చరిత్రలో అత్యధిక భాగస్వామ్యం నెలకొల్పారు. దీంతో గోవా తొలి ఇన్నింగ్స్‌ను 92 ఓవర్లలో 727/2 వద్ద డిక్లేర్ చేసింది. ప్లేట్ డివిజన్‌లో ఇది రెండో అత్యధిక స్కోరు. అరుణాచల్ తొలి ఇన్నింగ్స్‌లో 84, రెండో ఇన్నింగ్స్‌లో 92 పరుగులు సాధించింది. 2016లో ఢిల్లీతో మ్యాచ్‌లో మహారాష్ట్ర ప్లేయర్లు ఎస్ఎం గుగాలె, ఏఆర్ బావ్నే మూడో వికెట్‌కు 594 పరుగుల భాగస్వామ్య రికార్డును స్నేహల్, కశ్యప్ బద్దలు కొట్టారు. అంతేకాకుండా ఒకే ఇన్నింగ్స్‌లో ఇద్దరు బ్యాటర్లు ట్రిపుల్ సెంచరీలు చేయడం రంజీ చరిత్రలో ఇది రెండోసారి. ఇక ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో శ్రీలంక ఆటగాళ్లు సంగక్కర-మహేల జయవర్దనె సాధించిన 624 పరుగుల (2006లో దక్షిణాఫ్రికాతో టెస్టు) భాగస్వామ్యం తర్వాత ఇదే అత్యధికం. మనోళ్లు మరో 19 పరుగులు చేసివుంటే ప్రపంచరికార్డు బద్దలైవుండేది.

హైదరాబాద్ 301

ఆంధ్ర 168/2 ● రషీద్ అర్ధసెంచరీ

హైదరాబాద్: ఆంధ్రతో జరుగుతున్న రంజీ ఎలీట్ మ్యాచ్‌లో హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 301 పరుగులు చేసింది. తన్మయ్ అగర్వాల్ (159) భారీ శతకం సాధించాడు. స్పిన్నర్ విజయ్‌కు ఐదు, రఫీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత రెండో రోజు గురువారం ఆట ముగిసే సమయానికి ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 58 ఓవర్లలో 2 వికెట్లకు 168 పరుగులు చేసింది. రషీద్ (79 బ్యాటింగ్) అజేయ అర్ధసెంచరీతో నిలవగా, కరణ్ షిండే (41 బ్యాటింగ్) అండగా ఉన్నాడు.

షమికి 4 వికెట్లు

ఇండోర్: పేసర్ మహ్మద్ షమి (4/54) అదరగొట్టాడు. దీంతో బెంగాల్‌తో రంజీలో రెండో రోజు గురువారం మధ్యప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 167 పరుగులకే కుప్పకూలింది. 61 పరుగుల స్వల్ప ఆధిక్యంతో రెండో ఇన్నింగ్స్ మొదలెట్టిన బెంగాల్ 170/5 స్కోరుతో నిలిచింది. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 228 రన్స్ చేసింది.

బిజినెస్

రెండేళ్ల గరిష్ఠానికి ఎగుమతులు

అక్టోబరులో రూ. 3.33 లక్షల కోట్లు



న్యూఢిల్లీ: ఎగుమతుల రంగం అక్టోబరులో మంచి వృద్ధిని నమోదు చేసింది. వాణిజ్య ఎగుమతులు గత ఏడాది అక్టోబరుతో పోల్చితే 17.25 శాతం పెరిగి 3,920 కోట్ల డాలర్లకు (రూ.3.33 లక్షల కోట్లు) చేరాయి. ఎగుమతుల రంగం 2022 జూన్‌లో నమోదు చేసిన వృద్ధి 30.12 శాతం తర్వాత నమోదైన గరిష్ఠ వృద్ధి ఇదే. వాణిజ్య లోటు (ఎగుమతులు, దిగుమతుల మధ్య వ్యత్యాసం) గత ఏడాది అక్టోబరుతో పోల్చితే తగ్గినా ఈ ఏడాది సెప్టెంబరు నెలతో పోల్చితే మాత్రం పెరిగి 2,714 కోట్ల డాలర్లకు (రూ.2.31 లక్షల కోట్లు) చేరింది. ఇది సెప్టెంబరు నెలలో 2,078 కోట్ల డాలర్లుంటే (రూ.1.77 లక్షల కోట్లు) గత అక్టోబరులో 3,042 కోట్ల డాలర్లుగా (రూ.2.59 లక్షల కోట్లు) నమోదైంది. ప్రభుత్వం గురువారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం దిగుమతులు వార్షిక ప్రాతిపదికన 3.9 శాతం వృద్ధితో 6,386 కోట్ల డాలర్ల (రూ.5.43 లక్షల కోట్లు) నుంచి 6,634 కోట్ల డాలర్లకు (రూ.5.64 లక్షల కోట్లు) పెరిగాయి. క్రూడాయిల్ దిగుమతులు 13.34 శాతం పెరగడం ఇందుకు కారణం.

ఇతర ముఖ్యాంశాలు...

- ఏప్రిల్-అక్టోబరు నెలల కాలంలో ఎగుమతులు 3.18 శాతం పెరిగి 25,228 కోట్ల డాలర్లకు (రూ.21.44 లక్షల కోట్లు) చేరగా దిగుమతులు 5.77 శాతం పెరిగి 41,693 కోట్ల డాలర్లకు (రూ.35.44 లక్షల కోట్లు) చేరాయి.
- 7 నెలల వాణిజ్య లోటు 14,967 కోట్ల డాలర్ల (రూ.12.72 లక్షల కోట్లు) నుంచి 16,465 కోట్ల డాలర్లకు (రూ.13.99 లక్షల కోట్లు) చేరింది.
- 7 నెలల కాలంలో సేవల రంగం ఎగుమతులు 21,598 కోట్ల డాలర్లుగా (రూ.18.36 లక్షల కోట్లు) నమోదయ్యాయి.
- అక్టోబరులో క్రూడాయిల్ దిగుమతులు 1,610 కోట్ల డాలర్ల (రూ.1.37 లక్షల కోట్లు) నుంచి 1,820 కోట్ల డాలర్లకు (రూ.1.55 లక్షల కోట్లు) చేరాయి.
- ఇంజనీరింగ్ ఎగుమతులు 39.37 శాతం, ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 45.7 శాతం పెరిగాయి. అయితే పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు మాత్రం 22 శాతం తగ్గాయి.


తగ్గిన బంగారం దిగుమతులు

అక్టోబరు నెలలో బంగారం దిగుమతులు స్వల్పంగా తగ్గి 723 కోట్ల డాలర్ల (రూ.61,455 కోట్లు) నుంచి 713 కోట్ల డాలర్లకు (రూ.60,605 కోట్లు) దిగి వచ్చాయి. వెండి దిగుమతులు కూడా 131 కోట్ల డాలర్ల (రూ.11,135 కోట్లు) నుంచి 33 కోట్ల డాలర్లకు (రూ.2,805 కోట్లు) తగ్గాయి.

2.36 శాతానికి టోకు ద్రవ్యోల్బణం

ఆహార వస్తువుల ధరల పెరుగుదల ప్రభావం టోకు ద్రవ్యోల్బణంపై కూడా పడింది. అక్టోబరులో ఇది నాలుగు నెలల గరిష్ఠ స్థాయి 2.36 శాతానికి దూసుకుపోయింది. కూరగాయలు, తయారీ వస్తువుల ధరలు ద్రవ్యోల్బణానికి ఆజ్యం పోశాయి. టోకు ద్రవ్యోల్బణం సెప్టెంబరులో 1.84 శాతం ఉండగా గత ఏడాది అక్టోబరులో మైనస్ 0.26 శాతం ఉంది. సెప్టెంబరుతో పోల్చితే ఆహార వస్తువుల ధరల వృద్ధిరేటు 11.53 శాతం నుంచి 13.54 శాతానికి పెరిగింది. కూరగాయల ధరల్లో వృద్ధి 48.73 శాతం నుంచి 63.04 శాతానికి చేరింది. బంగాళాదుంప ధరల్లో వృద్ధి 78.73 శాతం, ఉల్లిపాయల ధరల పెరుగుదల 39.25 శాతం వద్ద యథాతథంగా ఉంది. తయారీ వస్తువుల ధరలు 1.50 శాతం పెరిగాయి. టోకు ద్రవ్యోల్బణం వృద్ధిలో 0.63 శాతం వాటా ఆహార ద్రవ్యోల్బణానిదేనని ఇక్రా సీనియర్ ఎకనామిస్ట్ రాహుల్ అగర్వాల్ అన్నారు.

క్విక్ కామర్స్‌తో కిరాణా హైరానా



రాజకీయ సమస్యగా మారే ప్రమాదం | ఎఫ్‌పీఐల పెట్టుబడులపై జర జాగ్రత్త | ఉదయ్ కోటక్

ముంబై: క్విక్ కామర్స్ సంస్థల విజయంతో దేశంలోని కిరాణా దుకాణాలకు సవాళ్లు తప్పవని ప్రముఖ బ్యాంకర్ ఉదయ్ కోటక్ హెచ్చరించారు. ముందు ముందు ఇది రాజకీయ సమస్యగానూ పరిణమించే ప్రమాదం ఉందన్నారు. సీఎన్‌బీసీ టీవీ 18 నిర్వహించిన ఒక సదస్సులో ఆయన ఈ ఆందోళన వ్యక్తం చేశారు. క్విక్ కామర్స్ కంపెనీ స్విగ్గీ ఐపీఓ విజయవంతమైన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. ప్రపంచంలో అనేక దేశాల్లో పెద్దగా రాణించని క్విక్ కామర్స్ సంస్థలు మన దేశంలో మాత్రం బాగా రాణిస్తున్నాయన్నారు. మన దేశ క్విక్ కామర్స్ కంపెనీల సృజనాత్మకత ఇందుకు ప్రత్యేక కారణమని కోటక్ అన్నారు. మన దేశ కంపెనీలు సృజనాత్మకంగా ఆలోచించి సరికొత్త ఉత్పత్తులపై దృష్టి పెట్టాలని సూచించారు.

కాగా భారత స్టాక్ మార్కెట్‌పై పెరుగుతున్న ఎఫ్‌పీఐల పట్టుపైనా ఉదయ్ కోటక్ మాట్లాడారు. ప్రస్తుతం ఈ సంస్థలు మన మార్కెట్లో 90,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.75.98 లక్షల కోట్లు) వరకు పెట్టుబడులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అమెరికా కొత్త అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక విధానాలు లేదా ఇతర అంతర్జాతీయ పరిణామాలతో ఈ సంస్థలు ఇందులో 5 నుంచి 10 శాతం పెట్టుబడులను వెనక్కి తీసుకున్నా, తట్టుకునేలా మన విధానాలు ఉండాలన్నారు.

మనకు ఢోకా లేదు: ఆర్‌బీఐ గవర్నర్ దాస్

అంతర్జాతీయంగా కొన్ని ఆటుపోట్లు ఉన్నా మన ఆర్థిక వ్యవస్థకు ప్రస్తుతం ఎలాంటి ఢోకా లేదని ఇదే సదస్సులో ప్రసంగించిన ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించాలన్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వ్యాఖ్యలపై మాట్లాడేందుకు ఆయన నిరాకరించారు. ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) దీనిపై నిర్ణయం తీసుకుంటుందన్నారు. అక్టోబరులో 6 శాతం దాటిన రిటైల్ ద్రవ్యోల్బణం డిసెంబరు నుంచి తగ్గే అవకాశం ఉందన్నారు. ప్రస్తుత మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు.. మన మొత్తం విదేశీ రుణాల తీర్చివేసినా.. ఏడాది దిగుమతులకు సరిపోయే స్థాయిలో ఉన్నట్టు దాస్ తెలిపారు డాలర్‌తో రూపాయికి నిర్దిష్ట మారకం రేటు నిర్ణయించే ఆలోచన లేదని కూడా దాస్ స్పష్టం చేశారు. కాకపోతే అనుచిత ఆటుపోట్లను అడ్డుకునేందుకు మాత్రం అపుడప్పుడు జోక్యం చేసుకుంటామన్నారు.

కొన్ని స్టార్టప్స్ మిణుగురు పురుగులే | రాజీవ్ బజాజ్

ఇదే సదస్సులో ప్రసంగించిన బజాజ్ ఆటో ఎండీ రాజీవ్ బజాజ్, స్టార్టప్ కంపెనీలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సరికొత్త ఉత్పత్తులు, మార్కెట్ వ్యూహం, టెక్నాలజీ లేకుండా కొన్ని స్టార్టప్ కంపెనీలు ఉన్నదంతా తగలబెట్టుకుంటున్నాయన్నారు. ఇలాంటి స్టార్టప్‌లను ఆయన మిణుగురు పురుగులతో పోల్చారు. స్టార్టప్ కంపెనీల్లో 90 నుంచి 95 శాతం మూతపడుతున్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల్లోనూ ఏటా సగం మంది గుడ్‌బై చెబుతున్నారన్నారు. విక్రయానంతర సేవలు పేలవంగా ఉండడంతో స్టార్టప్‌ల వినియోగదారులూ తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నట్టు బజాజ్ తెలిపారు.

శ్రీసిటీలో నిడెక్ ఇండియా ప్లాంట్

రూ.50 కోట్ల పెట్టుబడి

శ్రీసిటీ (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ మోటార్ల తయారీలోని జపాన్‌కు చెందిన నిడెక్ కార్పొరేషన్ అనుబంధ సంస్థ నిడెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ గురువారం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీలో ప్లాంట్‌ను ఏర్పాటు చేసింది. చెన్నైలోని జపాన్ కాన్సుల్ జనరల్ టకాహషి మునియో, నిడెక్ చైర్మన్ హిరోషి కోబే, ఇండియా ఎండీ కెయిజీ ఒషిమా ఈ ప్లాంట్‌ను ప్రారంభించారు. భారత ఎయిర్ కండిషనర్ (ఏసీ) తయారీ రంగంలో ఇదో మైలురాయి అని కంపెనీ పేర్కొంది. రూ.50 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసిన ఈ ప్లాంట్ వార్షిక ఉత్పత్తి సామర్థ్యం 60 లక్షల మోటార్లుగా ఉంది. ఈ ప్లాంట్ ద్వారా 200 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయని నిడెక్ ఇండియా తెలిపింది. వచ్చే జనవరిలో ఈ ప్లాంట్ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది.

హీరో మోటోకార్ప్ లాభం రూ.1,066 కోట్లు

న్యూఢిల్లీ: ద్విచక్ర వాహన దిగ్గజ సంస్థ హీరో మోటోకార్ప్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.1,066 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం 6 శాతం వృద్ధి చెందింది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ మొత్తం రెవెన్యూ రూ.9,533 కోట్ల నుంచి రూ.10,483 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో కంపెనీ మొత్తం 15.2 లక్షల మోటార్‌సైకిళ్లు, స్కూటర్లను విక్రయించింది. కాగా వచ్చే ఆరు నెలల్లో ప్రీమియం విభాగంలో ఎక్స్‌పల్స్ 210, ఎక్స్‌ట్రీమ్ 250ఆర్, కరిజ్మా ఎక్స్ఎంఆర్ 250 విడుదల చేయనున్నట్లు ప్రకటించింది.

- ఐటీసీ లిమిటెడ్‌తో కలిసి ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ డెవలప్‌మెంట్ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా అయోడిన్ డెఫిషియెన్సీపై అవగాహన, ఆరోగ్యకరమైన ఆహార అలవాట్లపై పాఠశాలల్లో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని 30 జిల్లాల్లోని పాఠశాలల్లో ఈ ప్రోగ్రామ్‌ను ఐటీసీ చేపడుతోంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



15వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	540
వరంగల్	532	గోదావరి	545
చిత్తూరు	593	విశాఖపట్నం	530
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	109
వరంగల్	90	గుంటూరు	105
కరీంనగర్	90	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	91
కర్నూలు	90	నెల్లూరు	91
విశాఖపట్నం	103	అనంతపురం	91
గోదావరి	109		

నిఫ్టీ..ఆరో రోజూ నష్టాలే..

- నేడు స్టాక్ మార్కెట్లకు సెలవు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు గురువారం ట్రేడింగ్‌లో మరింత నష్టపోయాయి. సెన్సెక్స్ మరో 110.64 పాయింట్లు కోల్పోయి 77,580.31 వద్దకు జారుకుంది. సూచీ జారుకోవడం వరుసగా ఇది మూడో రోజు. కాగా, నిఫ్టీ 26.35 పాయింట్ల నష్టంతో 23,532.70 వద్ద ముగిసింది. సూచీ నష్టపోవడం వరుసగా ఇది ఆరో రోజు. విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులు తరలిపోతుండటం, నిరాశాజనక త్రైమాసిక ఆర్థిక ఫలితాలతో పాటు ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠానికి ఎగబాకడంతో ట్రేడింగ్ సెంటిమెంట్ మరింత బలహీనపడింది. కాగా, గురునానక్ జయంతి సందర్భంగా శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీలకు సెలవు ప్రకటించారు.

సరికొత్త కనిష్ఠానికి రూపాయి

భారత కరెన్సీ విలువ గురువారం సరికొత్త జీవిత కాల కనిష్ఠానికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 7 పైసలు క్షీణించి 84.46 వద్ద ముగిసింది.

అదరగొట్టిన నవ లిమిటెడ్

క్యూ2 లాభంలో 365% వృద్ధి | 2:1 నిష్పత్తిలో షేర్ల విభజన

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): నవ లిమిటెడ్ కంపెనీ సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికం (క్యూ2)లో అద్భుతమైన ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.430.5 కోట్ల మొత్తం రెవెన్యూపై రూ.146.1 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలం (రూ.31.40 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 365.3 శాతం వృద్ధి చెందగా ఆదాయం 21.3 శాతం (రూ.355 కోట్లు) వృద్ధి చెందింది. త్రైమాసిక కాలంలో మెరుగైన పనితీరును కనబరచటం ఎంతగానో కలిసి వచ్చిందని కంపెనీ పేర్కొంది. కాగా కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన కంపెనీ రూ.942.90 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.331.90 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. మరోవైపు గురువారం జరిగిన సమావేశంలో రూ.2 ముఖ విలువ కలిగిన షేర్లను రూ.1 ముఖ విలువతో కూడిన రెండు షేర్లుగా (2:1 నిష్పత్తి) విభజించేందుకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది.

మరో 18 జిల్లాల్లో గోల్డ్ హాల్‌మార్కింగ్ తప్పనిసరి

న్యూఢిల్లీ: దేశంలోని మరో 18 జిల్లాల్లో గోల్డ్ హాల్‌మార్కింగ్‌ను తప్పనిసరి చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్,బిహార్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, కేరళ, ఒడిశా, పుదుచ్చేరి, రాజస్థాన్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్‌కు చెందిన 18 జిల్లాల్లో ఈ నెల 5 నుంచే ఇది అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది.

రిలయన్స్, డిస్నీ మీడియా ఆస్తుల విలీనం పూర్తి

- రూ.70,352 కోట్ల విలువైన జేవీ ఏర్పాటు
- విలీన సంస్థ చైర్మన్‌గా నీతా అంబానీ

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మీడియా దిగ్గజం వాల్ట్ డిస్నీకి చెందిన భారత ఆస్తులతో రిలయన్స్ ఇండస్ట్రీస్ మీడియా వ్యాపారం విలీన ప్రక్రియ పూర్తయింది. తద్వారా రూ.70,352 కోట్ల విలువైన జాయింట్ వెంచర్ (జేవీ)గా అవతరించింది. ఆర్ఐఎల్ అధిపతి ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ ఈ జేవీకి చైర్మన్‌గా నియమితులయ్యారు. డిస్నీకి చెందిన ఉదయ్ శంకర్ వైస్ చైర్మన్ హోదాలో జేవీకి వ్యూహాత్మక మార్గనిర్దేశం చేస్తారు. విలీన ఒప్పందంలో భాగంగా ఈ జేవీ వ్యాపారాభివృద్ధి కోసం రిలయన్స్ ఇండస్ట్రీస్ రూ.11,500 కోట్లు సమకూర్చింది. ఈ విలీన సంస్థ ఆర్ఐఎల్ నియంత్రలో ఉండనుంది. సంస్థలో రిలయన్స్ ఇండస్ట్రీస్ 16.34 శాతం, తన మీడియా అనుబంధ విభాగమైన వయాకామ్ 46.82 శాతం, డిస్నీ 36.84 శాతం వాటా కలిగి ఉంటాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	75,650 ▼	69,360 ▼	99,000 ▼
ముంబై	73,739 ▼	67,545 ▼	87,103 ▼

మాసాలలో కార్తిక మాసానికి, ఈ నెలలో పౌర్ణమి తిథికి ఆధ్యాత్మికంగా ఎంతో ప్రత్యేకత ఉంది. ముఖ్యంగా ఇళ్ళలో, ఆలయాల్లో దీపాలు వెలిగించడం, జ్వాలా తోరణాల విశిష్టత గురించి ప్రముఖ ప్రవచనకారులు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు వెల్లడించిన విశేషాలివి.



అరుణాచల దీపోత్సవం



కార్తిక పౌర్ణమి దీపాలకు... దేవాలయ ప్రాంగణాలలో అయితే కృత్తికా నక్షత్రాన్ని ప్రమాణంగా తీసుకోవాలి. ఇంట్లో అయితే తిథిని ప్రమాణంగా తీసుకోవాలి. ఇంట కార్తికదీపం పెడితే కార్తిక పౌర్ణమి తిథి ప్రధానం. దేవాలయంలో పెడితే కృత్తికా నక్షత్రం ప్రధానం. అరుణాచలంలో కృత్తికా నక్షత్రం నాడు జ్యోతి వెలిగిస్తారు. అరుణాచలంలో వెలిగే ఆ కృత్తికా దీపోత్సవాన్ని చూడడానికి కొన్ని లక్షల మంది వస్తారు. ఆ రోజు గిరి ప్రదక్షిణం చేయడానికి అవకాశమే ఉండదు. మొత్తం కొండ చుట్టూ జనంతో నిండిపోతుంది. వారు వెలుగుతున్న దీపం ఒక్కదాన్నే చూస్తారు. చూసి నమస్కారం చేస్తారు. భగవాన్ రమణమహర్షి లాంటివారు కూడా అసురసంధ్యవేళ కాగానే వచ్చి, చెక్క సోఫాలో పడుకొని, అరుణాచలం కొండ మీద వెలిగే దీపం కోసం ఎదురుచూస్తూ ఉండేవారు. ఆయనే పెద్ద జ్యోతి స్వరూపుడు. అయినా సరే, ఆ జ్యోతిని చూడ్డానికి ఆయన అక్కడికి వచ్చేవారు. ఆ జ్యోతిని చూసి, నమస్కరిస్తూ ఉండేవారు. భారతదేశం మొత్తం మీద కృత్తికా దీపోత్సవం అంటే అంత ప్రసిద్ధి. అరుణాచలం కొండే అగ్నిలింగం కాబట్టి, అక్కడ కొండ మీద వెలిగించే దీపం అంత ప్రసిద్ధి.

కార్తిక దీపం కథ

కార్తిక పౌర్ణమి నాడు ప్రతి ఒక్కరూ ఇళ్ళలో దీపం పెట్టుకుంటారు. ఆ రోజున గుత్తి దీపాలు కూడా పెడతారు. దీనికి రెండు కారణాలు. ఒక ఇల్లు మనం కడితే... ఆ ఇంట దీపం లేకుండా ఏ ఒక్కరోజూ ఉండకూడదు. మీరు ఇల్లు తాళం పెట్టి ఎక్కడికైనా వెళుతున్నప్పుడు మీ ఇంటి పురోహితుణ్ణి పిలిచి... "రోజూ మా పూజా మందిరంలో దీపం వెలిగించి, స్వామికి ఓ బెల్లం ముక్క నైవేద్యం పెట్టి వెళ్ళండి" అని చెప్పాలని శాస్త్రం స్పష్టం చేస్తోంది. ఇంట దీపం వెలగలేదు అంటే అది పరమ అమంగళకరమైన గృహం అని అర్థం. అలా మీకు ఎన్ని ఇళ్ళు ఉన్నాయో అన్ని చోట్లా దీపాలు వెలుగుతూ ఉండాలి. మీరు 'స్వగృహే' అని ఎక్కడ కూర్చొని సంకల్పం చెప్పగలరో అలాంటి అన్ని చోట్లా 365 రోజులూ దీపాలు వెలుగుతూ ఉండాలి. అలా దీపం వెలగకపోతే ఆ దోషం మీకే వస్తుంది. మళ్ళీ ఆ ఇంట్లో తిరిగినందుకు... ఆ పాపాన్ని పోగొట్టుకోవడానికి ప్రాయశ్చిత్తంగా లభించిన అద్భుతమైన తిథి కార్తిక పౌర్ణమి. అందుకే కార్తిక పౌర్ణమినాడు 365 వత్తులున్న గుత్తి దీపాన్ని ఆవు నేతిలో ముంచి వెలిగిస్తూ ఉంటారు. పదిరోజులో, పదిహేనురోజులో... ఇది తెలియకముందు తప్పు చేసిన రోజులు ఎన్ని ఉన్నాయో, ఆ రోజుల్లో దీపం పెట్టకపోతే తమకు ఎంత పాపం వస్తుందో అదంతా పోవాలని 365 వత్తులు వెలిగిస్తారు.

దీపం - ఆధ్యాత్మిక నిర్వచనం

దీపం పరమేశ్వర స్వరూపం. ఈశ్వరుడు కాంతి స్వరూపుడు. ఆయన ఎల్లప్పుడూ మన వెనుక వెలుగుతూ ఉంటాడు. వెనుక ఉండి ప్రకాశిస్తూ... మన శరీరం ఎంత కాలం నిలబడాలో అంతకాలం ఊపిరిని గుప్తంగా నిలబెట్టి, ఆ ఊపిరి అయిపోగానే బయటకు వెళ్ళి... శవంగా చేసి పడగొట్టగలిగిన పరమేశ్వర స్వరూపమే అక్కడ కూర్చొని ఉంటుంది. అది కాంతి. అందుకే పూజ అంతా అయిపోయిన తరువాత మంత్రపుష్పంలో చెబుతారు... 'నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా' అని... అణువంత రూపంతో ఇక్కడ ప్రకాశిస్తూ ఉంటాడు. దాన్ని ఏ పేరు పెట్టి పిలుస్తారు? ఏ పేరు పెట్టి పిలిచినా అది పలుకుతుంది. యదార్థానికి ఇది ఒక రూపం కాదు. ఒక కాంతి. అందుకే వెలుగుతోంది. 'భాస్కర' అని పేరు. 'భా' అంటే కాంతి. ఆ కాంతి ఏదో అదే పరమేశ్వరుడు. నిజానికి ఆయనకు ఒక ఆకారం ఎక్కడుంది? 'ఆకారంచ నిర్గుణంచ, సాకారంచ గుణకరం తత్త్వం తత్త్వం' అంటారు శంకరాచార్యులవారు. నిర్గుణం, సగుణం అని రెండు రకాలు. నిర్గుణంలోకి వెళ్ళాలన్నవాడు పరమ వైరాగ్యంలోకి వెళతాడు. సాధారణ ఉపాసన చేసేవాడు, బాహ్య ప్రయోజనం కావాలనుకొనేవాడు మనస్సును నిలబెట్టాలి. కాబట్టి ఒక ఆకారాన్ని పూజ చేస్తాడు. యదార్థానికి అది ఒక కాంతి పుంజం. ఆ కాంతి పుంజమే దివ్వె. దీపం అంటే ప్రకాశం. ఆ దీపమే పరమేశ్వర స్వరూపం.

యజమానే వెలిగించాలి

ఇంటి యజమాని దీపం వెలిగించాలి. 'మా ఆవిడ వెలిగిస్తుంది. నేను టీవీ చూస్తాను' అనుకోకూడదు. యజమాని పంచె కట్టుకొని వెళ్ళి దేవాలయంలో దీపం పెట్టాలి. "యజమాని ఇంట్లో దీపం పెడితే సమస్త భూతాలకు ఉపకారం" అని చెప్పాలి. సంకల్పంలో 'ధర్మపత్నీ సమేతస్య' అని ఉంది తప్ప, ఆవిడ వెలిగించి 'ధర్మపతీ సమేతస్య' అని చెప్పడం సంకల్పంలో లేదు. పురుషుడే ఇంటికి యజమాని కాబట్టి... ఈ రోజున ఆ పని చేయకపోతే... పరమేశ్వరుడు అతనికి ఇచ్చిన అద్భుతమైన అవకాశాన్ని జారవిడుచుకున్నవాడు అవుతాడు. కాబట్టి ఎంతెంత దీపాలు పెడతారో అంతంత అనుగ్రహం.



సమస్త జీవుల ఉద్ధరణ కోసం

కార్తిక పౌర్ణమినాడు వెలిగించే దీపం కేవలం మనకోసమే కాకుండా... మనం చేసే దుష్కృతులను, మన పాపాలను, అంతర తిమిరాన్ని, బాహ్యములోని తిమిరాన్ని పోగొట్టి, లోకోపకారం చేసి, సమస్త జీవులను ఉద్ధరించడానికి పెట్టే దీపం. కాబట్టి ఆశ్వయుజ మాసం చివరిలో వచ్చే దీపంతో మొదలుపెట్టి, కార్తిక పౌర్ణమి వరకూ వెలిగించే దీపాలకు అంత గొప్ప గౌరవం ఇచ్చారు. ఈ దీపాలు వెళ్ళిపోవాలి. దీపాలు వెళ్ళిపోవడం అంటే ఏమిటి? దీపాలను నీటి దగ్గరకు తీసుకువెళ్ళి, అరటి దొప్పలలో పెట్టి విడిచిపెడతారు. నీటిని ఆధారం చేసుకొని ఆ దీపం వెళ్ళిపోతూ ఉంటుంది. "దీపం విడిచిపెట్టానండీ" అంటారు. ఆ దీపం వెళ్ళి ఎక్కడో మరో దీపాన్ని కలుసుకుంటుంది. అలా వెళుతూ, వెళుతూ ఆ నీటిలోనే ఎక్కడో సమాప్తమైపోతుంది. గంగానది ఒడ్డున నిలబడి చూస్తుంటే... అసుర సంధ్య వేళ అయ్యేటప్పటికి ఆ దీపాలన్నీ నదిలో వెళ్ళిపోతూ ఉంటే చూడడానికి మహా ముచ్చటగా ఉంటుంది. గంగ సముద్రంలో కలిసిపోయేటప్పుడు ఆ దీపాన్ని కూడా తీసుకుపోయినట్టు 'రామానామ సంతుష్టాయై నమోనమః' అని లలితాపరాభట్టారికా స్వరూపంలో మీ మనసు లయమై, ఆ భగవంతుడి గురించే చింతన చేస్తే ఆ భగవంతుడే మిమ్మల్ని తనలోకి తీసుకుంటాడనే పారమార్థిక భావన మనం నదిలో దీపాన్ని విడిచిపెట్టి చూస్తూ ఉండడం వెనుక ఉంది.

అనువైన చోటే దీపాలు వెలిగించాలి.

కార్తిక దీపానికి ఎంతో ప్రాశస్త్యం ఉంది. మనకు పన్నెండు నెలలు ఉన్నప్పటికీ ఏ నెలలో పెట్టే దీపానికి ఆ నెల పేరు లేదు. ఒక్క కార్తిక మాసంలో వెలిగించే దీపానికి మాత్రమే 'కార్తిక దీపం' అని పేరు. కాబట్టి కార్తిక మాసంలో దీపం వెలిగిస్తే చాలన్నారు పెద్దలు. 'వెలిగించాలి కదా' అని కర్పూరపు బిళ్ళలు తీసుకువెళ్ళి, ఎక్కడ పడితే అక్కడ వెలిగించకూడదు. దీపం పెట్టడానికి ఎక్కడ అనువైన ప్రదేశమో... అక్కడే దీపాలు ఉంచాలి. కార్తికమాసంలో ఏ శివాలయానికైనా వెళ్ళి చూడండి... భక్తి ఎక్కువై, నందీశ్వరుడి వెనుక భాగంలో పెడతారు. ఇది పద్ధతేనా? ఇంకొకరు వచ్చి అక్కడ దర్శనం ఎలా చేసుకుంటారు? వారికి ఇబ్బంది కలుగుతుంది కదా? ఒక పని చేస్తున్నామంటే ఏదో చెయ్యడం కాదు. కొంచం మనసు పెట్టి విచారణ చేయాలి. మనిషిగా మనం ఎంత పరిజ్ఞానంతో, పరిపక్వతతో, పరిణతితో చేయవలసి ఉంటుందో... ఆ ప్రకారం ఆ కార్యాన్ని చెయ్యాలి తప్ప... సమస్త లోకానికి ఉపకారం జరగడం కోసం నిర్దేశించిన ఒక ప్రత్యేకమైన కార్యాన్ని ఎవరికైనా అపకారం మాత్రం చేయకూడదు.

నీటి రూపంలో పరమశివుడు

ఈశ్వరుడికి 'తజ్జలా' అని పేరు. నీటికి ఈశ్వరుడనే పేరు ఉంది. లింగ పురాణంలో 'సజీవనం సమస్త నిగత సలిలభ వాయుక్తి యుచ్యతే మూర్తి భవశ్య పరమార్థః' అంటారు. "నీరుగా పరమశివుడు ఉన్నాడు" అని అర్థం. నీటిని ఆశ్రయించి దీపం వెళుతోంది. భగవంతుణ్ణి ఆశ్రయించి సంకల్పాలు వెళుతున్నాయి. సంకల్పాలు ఊపిరి మీద ఆధారపడతాయి. ఊపిరి తీసి, విడిచిపెడుతూ ఉంటే సంకల్పాలు నడుస్తూ ఉంటాయి. మనస్సు కదులుతుంది. ఈ కదలికలు పరమేశ్వరుణ్ణి పట్టుకున్నాయి. ఈ పరమేశ్వరుణ్ణి పట్టుకొని మనసు, ఊపిరి వెళుతున్నాయి. దీపం రెపరెపలాడుతూ... ఎక్కడో ఈ ఊపిరి ఆగిపోతుంది. ఆ ఆగిపోయిన ఆఖరి సంకల్పం కూడా ఆయన నుంచే వచ్చింది, ఆయనలోనే లీనమవుతుంది. అరటి దొప్ప మీద దీపం అలా అలా ప్రయాణం చేస్తూ ఉంటే, దానిలో ఉన్న ఆవు నెయ్యి ఆవిరైపోతుంది. అరటి దొప్పమీదే సమాప్తం అయిపోతుంది. కొంత ఒత్తిడికి తిరగబడి ఆ గంగలోనే కలిసిపోయింది. గంగలో ఉన్న చేప దాన్ని మింగేసింది. 'గంగను ఆధారం చేసుకొని బయలుదేరి, గంగలోనే కలసిపోయిన దీపంలా... నిన్ను ఆధారంగా చేసుకొని, నీ గురించి చేసిన ఉపాసన వల్ల నా చైతన్యం నీలో ఐక్యమగునుగాక! పునరావృత్తిరహిత శివ శాశ్వత అంత్యస్థితిని పొందునుగాక!' అనే పూనికను పెంచుకోవడమే దీపాన్ని విడిచిపెట్టడం. దాన్ని అరటి దొప్ప మీద ఉంచి విడిచిపెడతారు. ఎందుకని? ఆ జలభూతాలకు ఇబ్బంది కలుగకూడదు కాబట్టి. మనం చేసే పనులు ఇతర ప్రాణులకు హాని కలిగించేవి కాకూడదు. అరటిదొప్పలాంటివి నీటిలో నానిపోయినా జలచరాలు తినగలుగుతాయి. అంతేకాని 'నేను పెట్టిన దీపం నీటి మీద బాగా తేలాలి' అనుకొని నీటిలో కరగని పదార్థాన్ని మీరు విడిచిపెట్టారనుకోండి. అది నీటిలో ఉండే వాటికి అపకారం చేసినట్టవుతుంది. అందుకనే 'అరటి దొప్పలో దీపం విడిచిపెట్టండి' అన్నారు పెద్దవాళ్ళు.



• బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

పరమేశ్వరుడిచ్చిన కానుక... జ్వాలాతోరణం



యమద్వార దర్శనం అంటే భీతి చెందిన ఋషులు దాని నుంచి రక్షించేది పరమశివుడు ఒక్కడే కాబట్టి ఆయనను మహా మృత్యుంజయ మంత్రాలతో ప్రార్థన చేశారు. వారికి ఆయన వరం ఇస్తూ కార్తిక పౌర్ణమినాడు జ్వాలా తోరణం ఏర్పాటు చేయమన్నాడు. ఆ ప్రకారం యమద్వారం ఎలా ఉంటుందో ఆ విధంగా ఆలయాల ముందు జ్వాలాతోరణాన్ని నిర్మిస్తారు. రెండు కర్రలు పాతి, అడ్డంగా ఒక కర్ర కడతారు. కొత్త గడ్డి తీసుకువచ్చి దానికి చుడతారు. దాని మీద నెయ్యి పోస్తారు. ఇంధనం పోస్తారు. 'ఆ యమ ద్వారాన్ని చూడవలసిన భయాన్ని మీకు పోగొట్టడానికి నేనున్నాను' అంటూ ఆ స్వామి తనకు అవసరం లేకపోయినా... ఆ అగ్నితోరణం కిందకు పల్లకిలో మనతోపాటు వస్తాడు. కార్తిక పౌర్ణమి నాడు జ్వాలా తోరణం కింద పార్వతీ పరమేశ్వరులు పల్లకిలో వెళుతూ ఉంటే... వారితో కలిసి మూడు సార్లు ఆ తోరణం కింద అటూ ఇటూ ఎవరు వెళ్ళి వచ్చారో... వారు యమద్వారంలో ఉండే అగ్ని తోరణాన్ని చూడరు. అంటే శివ లోకాన్ని కానీ, విష్ణు లోకాన్ని కానీ పొందుతాడు. అది మహర్షులకు పరమేశ్వరుడు ఇచ్చిన అద్భుతమైన కానుక. మహర్షుల కన్నా కూడా వారి ప్రార్థన మీద మానవాళికి ఇచ్చిన కానుక. కాబట్టి కార్తిక పౌర్ణమినాడు జ్వాలాతోరణం చెయ్యకుండా ఉండకూడదు. ఆ జ్వాలా తోరణంలో కాలిపోగా మిగిలిన గడ్డి రక్ష పెడుతుందంటారు. అందుకే అగ్ని హోత్రం ఆరిపోయిన ఆ గడ్డిని ఇంటికి తెచ్చి చూరులోనో, గడ్డి వాములోనో పెడతారు. ఎప్పటికీ ధాన్యాగారాలు నిండుగా ఉండాలని కొంత గడ్డిని ధాన్యాగారంలో పెడతారు. దాని కింద నుంచి శివుడు తిరిగాడు కాబట్టి... ఆ గడ్డి వల్ల భూత ప్రేతాదులు ఇంట్లోకి రావని వాటిని వీధి ద్వారం దగ్గర పెడతారు.



గీతాసారం

చిన్న ప్రయత్నాలతో పెద్ద ఫలితాలు

కర్మ యోగాన్ని ఏ మోతాదులో సాధన చేసినా కూడా ఫలితాలను ఇస్తుందనీ, ఈ ధర్మం (క్రమశిక్షణ) మహా భయాల నుంచి మనల్ని రక్షిస్తుందని శ్రీకృష్ణుడు హామీ ఇచ్చాడు. తమ ఆధ్యాత్మిక యాత్రను ఇప్పుడే ప్రారంభించినవారికి, ఆ ప్రయత్నాన్ని కఠినంగా భావించే సాధకులకు శ్రీకృష్ణుడు ఇచ్చిన కచ్చితమైన హామీ ఇది. మన కష్టాన్ని అర్థం చేసుకున్న కృష్ణుడు... ఒక చిన్న ప్రయత్నమైనా అద్భుత ఫలితాలను ఇస్తుందని హామీ ఇచ్చాడు. నిష్కామకర్మ (ప్రేరణలేని చర్య) ద్వారా సమానత్వ మార్గాన్ని అనుసరించాల్సిందిగా ఆయన మనల్ని ప్రేరేపిస్తాడు. సాంఖ్య యోగం అనేది స్వచ్ఛమైన అవగాహన కాగా, కర్మ యోగంలో ప్రయత్నం చేయాల్సి ఉంటుందనే విషయాన్ని గమనించాలి.

వాటిలో ఒక మార్గం... శ్రీకృష్ణుడు చెప్పిన దాని మీద శ్రద్ధ కలిగి ఉండడం. కర్మయోగం గురించి ఆయన చేసిన బోధను ఆచరించడం. మన అనుభవాలను కర్మయోగం అనే దృష్టితో చూడడాన్ని అభ్యసించినప్పుడు... మన అనుభూతులు మరింత లోతుకు వెళుతూ ఉంటాయి. చివరకు అంతరంగాన్ని చేరుకుంటాయి. దీనికి ప్రత్యామ్నాయమైన మార్గం ఏమిటంటే... కర్మ యోగ సాధన ఆ భయాలను ఎలా తొలగించగలదో తెలుసుకోవడం. మన అంతర్గత అంచనాలకు, వాస్తవ ప్రపంచానికి మధ్య పొంతన కుదరకపోవడమే భయానికి మూలం. కర్మయోగం మనకు నిష్కామ కర్మ గురించి బోధిస్తుంది. ఇది మనం చేసే పనుల విషయంలో ఆశలు లేకుండా ఉండేలా సహాయపడుతుంది. తద్వారా మనలోని భయాన్ని తగ్గిస్తుంది.

నీటి స్వభావం కారణంగా... చుక్కానికి జత చేసిన ఒక చిన్న బద్ద (ట్రిమ్ ట్యాబ్) మీద కాస్త అంతర్గత శక్తిని ఉపయోగించినా... ఓడ తన గమనాన్ని మార్చుకోవడానికి అది సహాయపడుతుంది. అదే విధంగా విశ్వానికి ఉన్న స్వభావం కారణంగా... మన లోపల నుంచి సరైన దిశలో చేసే చిన్న ప్రయత్నం కూడా పెద్ద మార్పును తీసుకురాగలదు. ఇది మనకు కర్మయోగ మార్గం సుగమం కావడానికి సహాయం చేస్తుంది. చిన్న పిల్లలుగా ఉన్నప్పుడు మనం నడక, పరుగెత్తడం నేర్చుకొనే వరకూ ఆ ప్రయత్నాన్ని ఎన్నటికీ వదులుకోం. అది అంత తేలికైన పనేమీ కాదు. అదే విధంగా కర్మయోగంలో ప్రావీణ్యం సంపాదించడానికి పదేపదే చేసే ప్రయత్నాలు చిన్నవైనా... కచ్చితమైన విజయవంతమైన ఫలితాలను ప్రసాదిస్తాయి.



కె. శివప్రసాద్
ఐఎఎస్


ధర్మపథం

కల్పాలు, కల్పభేదాలు

'కల్ప' (కల్పము) అనే పదం బౌద్ధమత ప్రారంభ కాలంలో పాలీ భాషలో కనబడుతుంది. బౌద్ధ సాహిత్యంలో కల్పాన్ని దీర్ఘకాలాన్ని లెక్కించడం కోసం ఉపయోగించారు. కల్పం అనేది సృష్టి, స్థితి, లయం మధ్య కాలం. 'ఒక కల్పం 4.32 బిలియన్ సంవత్సరాలకు సమానం' అని హిందూ మత పురాణాలు నిర్వచించాయి. ప్రత్యేకంగా 'విష్ణుపురాణం'లో, 'భాగవత పురాణం'లో కల్పం గురించి పేర్కొన్నారు. బౌద్ధ గ్రంథమైన 'విశుద్ధ మగ్గం'లో కల్పాలు, వాటి కాల వ్యవధుల వివరణలు ఉన్నాయి. 'కల్పం' అంటే బ్రహ్మకు ఒక పగలు. అది 432 కోట్ల ఏళ్ళు. ఒక కల్పంలో 14 మన్వంతరాలు ఉంటాయి. మన్వంతరాన్నే 'మను యుగం' అని కూడా అంటారు. మన్వంతరానికి 31,10,40,000 సంవత్సరాలు. ఒక్కో మన్వంతరంలో భూమిని ఒక్కో మనువు పాలించాడు. ప్రస్తుతం నడుస్తున్నది ఏడో మన్వంతరం. దీన్ని పాలిస్తున్నది వైవస్వత మనువు. అందుకే దీన్ని 'వైవస్వత మన్వంతరం' అంటారు. ఒక్కో మన్వంతరానికి 71 మహా యుగాలు, ఒక్కో మహాయుగంలో నాలుగు యుగాలు... కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు ఉంటాయి.

పాలీ సాహిత్యంలో ఈ కాలమానానికి, బుద్ధుడికి మధ్య అవినాభావ సంబంధం ఉంది. 'స్థవిరవాద' బౌద్ధ సాహిత్యం మాదిరిగానే సంస్కృత సాహిత్యంలో కూడా 'కల్ప' అనే పదాన్ని చాలాసార్లు వాడారు. బౌద్ధ సాహిత్యంలో ప్రధానంగా రెండు రకాలైన కల్పాలు ఉన్నాయి. ఒకటి సుజ్ఞకప్పము... అంటే శూన్యకల్పం, రెండోది అసుజ్ఞకప్పము... అంటే అశూన్యకల్పం. బుద్ధుడు, ప్రతిబుద్ధుడు, చక్రవర్తులు ఎవరూ జన్మించని కాలాన్ని 'సుజ్ఞకప్పము' అన్నారు. అంటే ఆ కల్పంలో సద్గురువులు జన్మించరు. అందుకే దాన్ని 'శూన్యకల్పం' అన్నారు. కానీ బుద్ధుడు, ప్రతిబుద్ధుడు, చక్రవర్తి... ఈ ముగ్గురిలో ఒక్కరైనా జన్మిస్తే దాన్ని 'అశూన్య కల్పం' అన్నారు. ఈ అశూన్యకల్పంలో కూడా అయిదు భాగాలు ఉన్నాయి. వాటిని వరుసగా... సరకప్ప, మండకప్ప, వరకప్ప, సరమండకప్ప, భద్దకప్ప అంటారు.

కొండఞ్ఞ, పదముత్తర, సిద్ధత్త విపస్సి బుద్ధులు సారకల్పంలో జన్మించారని పాలీ గ్రంథాలు చెబుతున్నాయి. సుమేధ, సుజాత, తిస్స, పుస్స, శిఖి, వెస్సభు అనే బుద్ధులు మండకల్పంలో జన్మించారు. అనోమదస్సి, నారద, విపస్సి, అత్తదస్సి, ధమ్మదస్సి అనే బుద్ధులు వరకల్పంలో, తణ్హంకర, మేధంకర, శరణంకర, దీపంకర, మంగళ, సుమన, రేవత, శోభిత అనే బుద్ధులు సరమండకల్పంలో, కకుసంధ, కోణాగమన, కస్సప, గౌతమ బుద్ధ అనే బుద్ధులు భద్రకల్పంలో దర్శనమిచ్చారు. భవిష్యత్తులో జన్మించే మైత్రేయ బుద్ధుడు కూడా భద్రకల్పంలోనే కనిపిస్తాడు. ఈ విధంగా పాలీ సాహిత్యంలో శూన్య కల్ప, అశూన్య కల్పాలు, అయిదు కల్ప భేదాలు కనిపిస్తాయి.



'ఒక కల్పం 4.32 బిలియన్ సంవత్సరాలకు సమానం' అని హిందూ మత పురాణాలు నిర్వచించాయి. ప్రత్యేకంగా 'విష్ణుపురాణం'లో, 'భాగవత పురాణం'లో కల్పం గురించి పేర్కొన్నారు. బౌద్ధ గ్రంథమైన 'విశుద్ధ మగ్గం'లో కల్పాలు, వాటి కాల వ్యవధుల వివరణలు ఉన్నాయి.



ఆచార్య చౌడూరి ఉపేంద్రరావు
జెఎన్‌యూ, ఢిల్లీ.

చింతన

కాలమహిమ

కాలచక్రం నిర్విరామంగా పరిభ్రమిస్తూ ఉంటుంది. దాన్ని నిలువరించడం ఎవరికీ సాధ్యంకాని పని. కాలగమనంలో ఎన్నో పరిణామాలు సంభవిస్తూ ఉంటాయి. వాటిని తెలుసుకొని, సాక్షులుగా ఉండడం తప్ప మనకు వేరే మార్గం ఉండదు. ఒకప్పుడు నిరుపేదగా ఉన్న వ్యక్తి... కొంతకాలానికి గొప్ప ఐశ్వర్యవంతుడిగా కనిపిస్తాడు. అదే కాల మహిమ.

కాలం అత్యంత పవిత్రమైనది. నిర్ణీత కాలంలో చేసిన కార్యం ఏదైనా విజయవంతమై తీరుతుంది. చేయబోయే పనికి సరైన సమయాన్ని నిర్దేశించడం, ఆ నిర్దేశించిన సమయాన్ని మరే కార్యానికీ ఖర్చు చేయకుండా... దేనికోసం కేటాయించారో దానికే ఉపయోగించడం వివేకవంతులు తీసుకొనే తెలివైన నిర్ణయం. కార్యసాధకుడు ఏనాడూ కాలానికి తలవంచడు. తన ప్రయత్నం తాను చేస్తూ ముందడుగు వేస్తాడు. కార్యసాధనలో మొదట నిరాశ ఎదురైనా... దాన్ని లక్ష్యపెట్టకుండా, పట్టుదలతో ముందుకు సాగి విజయాన్ని కైవసం చేసుకుంటాడు.

ఈ విషయంలో మనకు హనుమంతుడు స్ఫూర్తిప్రదాత. సీతాన్వేషణలో హనుమంతుడికి ముందుగా మైనాకుడు ఎదురై, తన ఇంటికి రమ్మని ఆహ్వానిస్తాడు. ఆ ఆహ్వానాన్ని ఆయన సున్నితంగా తిరస్కరించి, లంకకు చేరుకుంటాడు. అక్కడ తనకు శాప విముక్తి ప్రసాదించే వానరుడి కోసం లంకిణి ఎంతో కాలంగా నిరీక్షిస్తోంది. చివరకు హనుమ చేతిలో ఆమెకు శాపవిమోచన కలిగింది. అదే కాలమహిమ. కాలమే అన్నిటికీ సమాధానం చెబుతుంది. కాలం ఎప్పుడూ తక్షణమే సత్ఫలితాలను ఇవ్వదు. అలాగని వెంటనే దుఃఖాలను కూడా ఇవ్వదు. ఎవరికి ఏ సమయంలో ఏది అనుకూలమో దాన్ని మాత్రమే ఇవ్వగలుగుతుంది.

శ్రీరామచంద్రుడికి మరునటిరోజు పట్టాభిషేకం జరగబోతోందని అయోధ్యలో ప్రజలు ఎంతో ఆనందంగా గడిపారు. కానీ ఆ మర్నాడు... అదే సమయానికి సీతారామ లక్ష్మణులు నార వస్త్రాలను ధరించి వనవాసానికి బయలుదేరుతారని ఎవరూ ఊహించలేదు. కానీ రాముడు వనవాసానికి వెళ్ళకపోతే రావణ వధ జరిగి ఉండేది కాదు కదా! కాలమహిమ అంటే అదే మరి! రామ దర్శనం కోసం శబరి పన్నెండేళ్ళపాటు నిరీక్షించింది. ఆ తరువాతే ఆమెకు రామదర్శనం అయింది.




కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి.

ఆమె పునీత అయింది, చివరకు పవిత్ర నదిగా మారింది.

మహా భారతాన్ని గమనిస్తే... మాయా ద్యూతంలో ఓడిన పాండవులు పన్నెండేళ్ళపాటు వనవాసం, ఒక ఏడాది అజ్ఞాత వాసం చేయవలసి వచ్చింది. అయితే వాళ్ళు కుంగిపోలేదు. ఆ కఠినతరమైన సమయాన్ని తమకు అనుకూలంగా మార్చుకున్నారు. వనవాస సమయంలోనే అర్జునుడు ఇంద్రకీలాద్రిపై తపస్సు చేసి, శివుణ్ణి మెప్పించి, పాశుపతాస్త్రాన్ని వరంగా పొందగలిగాడు. అదే విధంగా స్వర్గలోకంలో ఒక రోజు తన సన్నిధిలో ఉండడానికి నిరాకరించాడని అర్జునుణ్ణి ఏడాదిపాటు బృహన్నలగా మారిపోతావని ఊర్వశి శపించింది. ఆ శాపాన్ని ఆయన వరంగా మార్చుకున్నాడు. అజ్ఞాత వాస సమయంలో... విరాట రాజు కొలువులో నాట్యాచార్యుడిగా చేరి... ఆ శాపాన్ని ఉపయోగించుకున్నాడు. సాక్షాత్తూ నారాయణుడైన కృష్ణుడే కంసుడు, శిశుపాలుడు తదితర దుష్టుల్ని శిక్షించడానికి సమయం తీసుకున్నాడు. పాపం పండితే కాదని ఫలితం బయటకు రాదన్నది సత్యం.

కాలం మనల్ని కొన్ని సందర్భాల్లో కష్టపెట్టినా... ఆ తరువాత తగిన ఫలితాన్ని తప్పక ఇస్తుంది. ఆ ఫలితాన్ని పొందడానికి ముందు మనకు ఎదురయ్యే గడ్డు కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. దానికోసం మనకు కావలసింది ఓర్పు. ఓర్పు స్థానంలో ఉదాసీనత ఏర్పడితే... కాలం సత్ఫలితాలను ఇవ్వదనే విషయాన్ని గుర్తుపెట్టుకోవాలి. ప్రస్తుతం పరిగెడుతున్న కాలంతో మనం సహజీవనం చేస్తున్నాం. ఈ ప్రహసనంలో దుఃఖం మనకు చేరువైన వెంటనే... దానికి సరైన నివారణ వెతకడానికి ప్రయత్నించాలి. అప్పుడు తప్పకుండా విజయం వరిస్తుంది. కాబట్టి కాలాన్ని గౌరవిద్దాం. కాలంతోపాటు పయనిస్తూ... కష్టాలు ఎదురైనప్పుడు వాటికి ఎదురీదుదాం. పట్టుదలతో ముందుకు సాగితే విజయం లభిస్తుంది. కాలం ఎప్పుడూ మనకు అర్హమైన విజయాన్ని ఇవ్వకుండా ఉండదని గుర్తు పెట్టుకొని ముందుకు సాగినప్పుడు జీవితం ఫలప్రదం అవుతుంది.

• మందరపు వి.జె.శంకరాచారి



బడ్జెట్‌పై చర్చను పక్కదారి పట్టించారు: వైసీపీ

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై చర్చ సాగనీయకుండా మంత్రులు సభను పక్కదారి పట్టిస్తున్నారని వైసీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి, ఇప్పుడు కరెంట్ చార్జీలు పెంచారని విమర్శించారు. విద్యుత్ రంగంపై చర్చ జరగనీయకుండా టీడీపీ ఎమ్మెల్సీలు, మంత్రులు అడ్డుపడ్డారని ఆరోపించారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ ప్రజల పక్షాన మాట్లాడుతుంటే తమ గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆక్షేపించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ 39% ఓట్లు వచ్చిన పార్టీ నేతను ప్రతిపక్ష నేతగా గుర్తించకుండా కూటమి నేతలు అవమానిస్తున్నారన్నారు. సభ సజావుగా జరిగేలా చూడాలని ఎమ్మెల్సీలు సూర్యనారాయణరాజు, రవీంద్రనాథ్ కోరారు.

29న రాష్ట్రానికి ప్రధాని రాక

- ఎన్టీపీసీ 'గ్రీన్' ప్రాజెక్టులకు శంకుస్థాపన
- 80వేల కోట్ల పెట్టుబడి... 48వేల మందికి ఉపాధి
- విశాఖలో ఇప్పటికే 1200 ఎకరాలు కేటాయింపు



అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ఈనెల 29న రాష్ట్రానికి రానున్నారు. ఎన్టీపీసీ రూ.80వేల కోట్ల పెట్టుబడులతో స్థాపించనున్న గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లతోపాటు గ్రీన్ ఇండస్ట్రియల్ పార్కులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో ఇప్పటికే 1200 ఎకరాలు కేటాయించింది. గ్రీన్ హైడ్రోజన్ హబ్‌లో 20 గిగావాట్‌ల విద్యుత్తును ఎన్టీపీసీ ఉత్పత్తి చేయనుంది. గురువారం శాసనసభలో 'క్లీన్ ఎనర్జీ'పై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు ప్రధాని పర్యటన గురించి వెల్లడించారు. ఈ రెండు భారీ ప్రాజెక్టుల వల్ల నాలుగేళ్లలో 48వేల మందికి ఉపాధి లభిస్తుందని పరిశ్రమ వర్గాలు వెల్లడించాయి.

నేడు ఢిల్లీకి సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు శుక్రవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ఢిల్లీలో జరగనున్న హిందూస్థాన్ టైమ్స్ కాన్‌క్లేవ్‌కు హాజరవుతారని సమాచారం. ఢిల్లీ ఆర్థిక మంత్రితో పాటు మరికొంత మంది కేంద్ర మంత్రులతోనూ భేటీ అయ్యే అవకాశం ఉంది. శని, ఆదివారాల్లో ఢిల్లీ నుంచి మహారాష్ట్రకు వెళ్లి అక్కడ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని తెలుస్తోంది. తెలుగువారు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ముఖ్యమంత్రి ఎన్డీయే అభ్యర్థుల కోసం ప్రచారం చేయనున్నారు.

త్వరలో కొత్త పెన్షన్లు: మంత్రి కొండపల్లి

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన వారందరూ సామాజిక పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదేశించారు. గురువారం సచివాలయంలో సెర్ప్, ఏపీ ఆన్‌లైన్, వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. త్వరలో పింఛన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. వికలాంగుల పెన్షన్లనూ అనేక మంది అనర్హులు తీసుకుంటున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని, విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

బూతు పోస్టింగ్ పెడితే జగనైనా అరెస్టే: వర్ల

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'జగన్ పనికిమాలిన సవాళ్లు చేయడం మానుకోవాలి. వర్రా రవీంద్రారెడ్డి పెట్టిన బూతు పోస్టింగ్‌లు ఆయన పెట్టినా 24 గంటల్లో ప్రభుత్వం జగన్‌ని అరెస్టు చేస్తుంది' అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య హెచ్చరించారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'సభ్య సమాజాన్ని గౌరవించే వారంతా జగన్ పెట్టించే సోషల్ మీడియా పోస్టింగ్‌లను ఛీ కొడుతున్నారు. సాతాను ముఠాకు నాయకుడైన జగన్‌ని ఆంధ్ర లూసిఫర్ అంటే తప్పేముంది?' అని వర్ల అన్నారు.

ఉక్కుపాదంతో అణిచివేయాలి: పనబాక

మహిళల వ్యక్తిత్వ హననానికి పాల్పడే అల్లరి మూకలకు బుద్ధి చెప్పాలని కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. 'వైసీపీ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి ఆడ పిల్లలను ఘోరంగా అవమానిస్తున్నారు. అలాంటి వారిని ఉక్కుపాదంతో అణిచివేయాలి' అని పనబాక అన్నారు.

తప్పుడు పోస్టింగ్‌లను క్షమించేదిలేదు: మంతెన

సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టే వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు అన్నారు. గురువారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ...మహిళలను అసభ్యకరంగా మాట్లాడే వారిని కూటమి ప్రభుత్వం క్షమించదని హెచ్చరించారు.

టీడీపీలో చేరిన రాజీవ్ కృష్ణ

- సాదరంగా ఆహ్వానించిన నారా లోకేశ్, పల్లా శ్రీనివాస్



నారా లోకేశ్, పల్లా శ్రీనివాస్ సమక్షంలో టీడీపీలో చేరిన రాజీవ్ కృష్ణ

అమరావతి, రాజమహేంద్రవరం, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లాకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త ఎస్.రాజీవ్‌కృష్ణ గురువారం టీడీపీ కండువా కప్పుకున్నారు. మంత్రి నారా లోకేశ్, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ సమక్షంలో పలువురు జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఇతర నేతలతో కలిసి అమరావతిలో ఆయన టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... 'తూర్పుగోదావరి జిల్లాలో అందరూ ఐక్యంగా పార్టీని ముందుకు నడిపించాలి. రాజీవ్ రాజకీయ భవిష్యత్‌ను నేను చూసుకుంటా' అని హామీ ఇచ్చారు. రాజీవ్‌కృష్ణ మాట్లాడుతూ, 'సీఎం చంద్రబాబు విజన్ 2047 కోసం నా వంతు కృషి చేస్తా' అన్నారు.

విజయనగరం ఎమ్మెల్సీ ఉప ఎన్నిక నోటిఫికేషన్ రద్దు

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): విజయనగరం జిల్లా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటన విడుదల చేసింది. ఏపీ హైకోర్టు ఉత్తర్వుల మేరకు నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుపై శాసనమండలి చైర్మన్ అనర్హత వేటు వేశారు. దీనిపై ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. తన వాదనలు వినిపించేందుకు ఎమ్మెల్సీ రఘురాజుకు అవకాశం ఇవ్వకుండా అనర్హత వేటు వేస్తూ ట్రైబ్యునల్ హోదాలో చైర్మన్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు తప్పుపట్టింది. అనర్హత ఉత్తర్వులను రద్దు చేసింది. పిటిషనర్ వాదన విని తగిన నిర్ణయం వెల్లడించాలని ట్రైబ్యునల్‌కు స్పష్టం చేసింది.

మండలిలో మంటలు

- బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రచ్చరచ్చ
- అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం
- జగన్ వల్లే ఆర్థిక వ్యవస్థ కుదేలు: యనమల
- గత ప్రభుత్వంలో సభ్యులను మాట్లాడనివ్వలేదు
- వైసీపీ ఒప్పుకొంటే అదే సంప్రదాయం పాటిద్దాం: పయ్యావుల
- వైసీపీ అవకతవలు సరిచేసి రాష్ట్రాన్ని గాడిన పెడుతున్నాం: అనిత
- కూటమి సభ్యుల స్ట్రాంగ్ కౌంటర్





అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో గురువారం బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార కూటమి సభ్యులు, ప్రతిపక్ష వైసీపీ సభ్యుల మధ్య మాటల మంటలు చెలరేగాయి. ఇరుపక్షాల మధ్య ప్రతి అంశంలోనూ వాగ్యుద్ధం చోటుచేసుకుంది. ప్రభుత్వంపై బురద చల్లేందుకు ప్రయత్నించిన వైసీపీ సభ్యులకు మంత్రులు, కూటమి సభ్యులు దీటుగా బదులిచ్చారు. అసత్యాలు, అబద్ధాలు మాట్లాడుతూ సభను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. సభ సంప్రదాయాలు మార్చాలని బొత్స సూచించడంతో 'గత ఐదేళ్ల రికార్డులు తీసి అప్పుడు ఏ సంప్రదాయాలు పాటించారో వాటిని పాటిద్దామా..?' అంటూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. వైసీపీ సభ్యులు, వరుదు కల్యాణి, కుంభా రవిబాబు.. సూపర్ సిక్స్ పథకాలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించడంతో.. 'అసత్యాలు చెప్పొద్దు.. ఇప్పటికే సూపర్ సిక్స్‌లో కొన్ని అమలు చేశాం. మిగిలినవి కూడా అమలు చేసి తీరుతాం' అని కూటమి సభ్యులు స్పష్టం చేశారు. 'జగన్.. మద్యపాన నిషేధం అన్నారు.. వారంలో సీపీఎస్ రద్దు అన్నారు.. ఐదేళ్లు అధికారంలో ఉండి ఎందుకు అమలు చేయలేదు..?' అని నిలదీశారు. బడ్జెట్‌పై చర్చంతా అధికార, విపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధంగా సాగడంతో.. చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు సభను శుక్రవారానికి వాయిదా వేశారు.

జగన్ హయాంలో ఆర్థిక వ్యవస్థ పతనం..: యనమల

బడ్జెట్‌పై చర్చ సందర్భంగా గత జగన్ ప్రభుత్వం రూ.14 లక్షల కోట్లు అప్పులు చేసిందని మాజీ మంత్రి, టీడీపీ ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడు మండిపడ్డారు. జగన్ హయాంలోనే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ కొలాప్స్ అయిందని విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్రంలో అప్పులు ఎలా పెంచారో కాగ్ రిపోర్టు స్పష్టం చేసిందన్నారు. తాను చేసిన అప్పులపై జగన్ సొంత పత్రికలో ఘనంగా చెప్పుకున్నారన్నారు. కాగ్ అభ్యంతరాలకు జగన్ ప్రభుత్వం ఎందుకు సమాధానం చెప్పలేకపోయిందో చెప్పాలని డిమాండ్ చేశారు. రూ.14లక్షల కోట్లు అప్పు చేసి.. ఆ మొత్తాన్ని దేనికి ఖర్చుపెట్టారో ఎక్కడా స్పష్టంగా చెప్పలేదన్నారు. గత ప్రభుత్వానికి సంబంధించి ప్రస్తుతం రూ.1.30 లక్షల కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఆ బిల్లులు మొత్తం అప్పుల కిందకే వస్తాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వం సంపద సృష్టించకపోగా.. రోడ్లపై గుంతలు కూడా పూడ్చలేని పరిస్థితి తెచ్చిందన్నారు. ఆ గుంతలు పూడ్చడానికి తాము డబ్బులు ఇవ్వాల్సి వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఆర్థిక వ్యవస్థ చితికిపోవడానికి ప్రధాన కారణం వైసీపీ ప్రభుత్వమేనని, ఏడాదికి రూ.50వేల కోట్లు వడ్డీలు కట్టాల్సిన దుస్థితి తెచ్చిందని మండిపడ్డారు. గత ఐదేళ్లలో ఆర్థిక వృద్ధి రేటు -4.2గా నమోదైందని, గ్రోత్ రేట్ నెగిటివ్ ఉన్నప్పుడు రెవెన్యూ ఎప్పటికీ పెరగదని చెప్పారు. ఈ వ్యవస్థను గాడిన పెట్టేందుకు కొంత సమయం పడుతుందన్నారు. వృద్ధి రేటును -4.2 నుంచి 15 శాతానికి పెంచడమే లక్ష్యంగా చంద్రబాబు పని చేస్తున్నారని చెప్పారు.

సర్వనాశనం చేసింది వైసీపీ ప్రభుత్వమే: పయ్యావుల

మండలిలో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, విపక్ష నేత బొత్స సత్యనారాయణ మధ్య మాటల యుద్ధం నడిచింది. వైసీపీ సభ్యులు మాట్లాడుతున్నప్పుడు మంత్రులు పదేపదే అడ్డుపడుతున్నారంటూ బొత్స వ్యాఖ్యానించారు. సభ్యుల ప్రసంగం తర్వాతే మంత్రులు సమాధానమివ్వాలని.. లేదా ప్రొసీజర్లు మార్చాలని సూచించారు. ఈ సూచన పట్ల పయ్యావుల ఘాటుగా స్పందించారు. "గత ఐదేళ్లలో బొత్స మంత్రిగా ఉన్నప్పుడు పాటించిన సాంప్రదాయం పాటిద్దామా?" అని ప్రశ్నించారు. తాము ప్రతిపక్షంలో ఉండగా మంత్రులు తరచూ అడ్డుపడేవారని, సభ్యులు మాట్లాడితే.. అధికార పార్టీ సభ్యులు ఎదురు దాడి చేసేవారని గుర్తుచేశారు. 'గత ఐదేళ్లలో సభలో ఎలాంటి సంప్రదాయాలు పాటించారో చూద్దాం. వైసీపీ సభ్యులు ఒప్పుకుంటే అదే సంప్రదాయాలు పాటిద్దాం' అన్నారు. వైసీపీ సభ్యులు చెప్పే అసత్యాలు లైవ్‌లో ప్రజల్లోకి వెళుతున్నాయి కాబట్టే తాము జోక్యం చేసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని సర్వనాశనం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని మండిపడ్డారు. ఈలలు, కేకలు వేయించుకునేందుకు పబ్లిక్‌లో మాట్లాడినట్టు.. వైసీపీ సభ్యులు సభలో మాట్లాడతామంటే కుదరదన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చేలా మాట్లాడితే తమకు అభ్యంతరం లేదన్నారు. వైసీపీ సభ్యులు హుందాగా వ్యవహరించాలన్నారు. రన్నింగ్ కామెంటరీలు మాట్లాడినా, ప్రభుత్వంపై బురదజల్లాలని చూసినా.. తమ సభ్యులు వెంటనే స్పందిస్తారన్నారు. తప్పులు ఉంటే చెబితే సరి చేసుకుంటామన్నారు.

ఐదేళ్లు వదిలేసి.. ఇప్పుడు విమర్శలా?: హోంమంత్రి అనిత

గత ఐదేళ్లు అల్లకల్లోలం చేసి వదిలేసి.. ఇప్పుడు 5నెలల ప్రభుత్వంపై వైసీపీ సభ్యులు విమర్శలు చేస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలపై వైసీపీ సభ్యుల మాటలకు ఆమె స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. 'స్త్రీనిధి కింద మహిళలకి రూ.3,500 కోట్లు కేటాయించినా.. ఇవ్వలేదంటారా..? జగన్ పత్రికలో కథనాలను సభలో నిజాలుగా ప్రస్తావించడం విడ్డూరం. గతప్రభుత్వంలో ఉద్యోగులకు సరిగా జీతాలే ఇవ్వలేని దుస్థితి. టీఏ, డీఏ, పీఆర్సీ ఇంక్రిమెంట్లు ఇవ్వకుండా నరకం చూపించారు. సీఎం చంద్రబాబు వచ్చిన తర్వాత ఉద్యోగులు ఒకటో తేదీన జీతాలు పొందుతున్నారు. కూటమి ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ఉచిత సిలిండర్ల పథకం చూసి ఓర్వలేకే ఇలా మాట్లాడుతున్నారు. గత ప్రభుత్వ అవకతవలను.. సరిచేసుకుంటూ గాడిలో పెట్టేందుకు ప్రయత్నించడం వల్లే ఆలస్యంగా బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాం'అన్నారు.

వాళ్ల అప్పులు మేం తీరుస్తున్నాం: సవిత

గత జగన్ ప్రభుత్వం చేసిన అప్పులు తీర్చుకుంటూ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. 'వైసీపీ సభ్యులు ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారు. సీఎం చంద్రబాబు డీఎస్సీపై మొదటి సంతకం చేశారు. మహిళలకు 3గ్యాస్ సిలిండర్ల పథకం అమలు చేస్తున్నాం. అన్నాక్యాంటీన్లు ప్రారంభించాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉన్నాం. గత వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తామని పట్టించుకోలేదు. పించన్లు రూ.3వేలకు పెంచుతామని ఐదేళ్లపాటు వాయిదాల రూపంలో ఇచ్చారు' అని సవిత విమర్శించారు.

రాజీనామాలు ఆమోదించాలంటూ ఎమ్మెల్సీల నిరసన

ఎమ్మెల్సీలుగా తమ రాజీనామాలు ఆమోదించాలని పోతుల సునీత, బల్లి కల్యాణ్ చక్రవర్తి, కర్రి పద్మశ్రీ గురువారం శాసన మండలిలో చైర్మన్ పోడియం వద్ద ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. పోడియంపైకి వెళ్లి తమ రాజీనామాలు ఆమోదించాలని కోరారు. పోతుల సునీత మాట్లాడుతూ... తాను రాజీనామా ఇచ్చి 3నెలలైందని, ఇప్పటి వరకూ ఎందుకు నాన్చుతున్నారని ప్రశ్నించారు. తాను వ్యక్తిగత కారణాల వల్ల రాజీనామా చేశానని, దాన్ని ఆమోదించాలని చైర్మన్‌ను కోరారు. దీనికి చైర్మన్ మోషేన్‌రాజు స్పందిస్తూ.. రాజీనామాలు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు.

శాసనమండలి ప్యానల్ చైర్మన్‌గా బీటీ నాయుడు

శాసనమండలి ప్యానల్ చైర్మన్‌గా ఉన్న పంచుమర్తి అనురాధ చీఫ్‌విప్‌గా నియమితులు కావడంతో ఆ స్థానంలో బీటీ నాయుడును నియమిస్తున్నట్లు మండలి చైర్మన్ మోషేన్‌రాజు తెలిపారు.

బోఫోర్స్‌ని మించిన భూ కుంభకోణం

- సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి: బండారు
- 22ఏ, ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారంలో వైసీపీపై ధ్వజమెత్తిన కూటమి ఎమ్మెల్యేలు
- విచారణకు శాసన సభా కమిటీ: మంత్రి అనగాని

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల రీ సర్వే, 22 ఏ చట్ట సవరణ, భూముల ఫ్రీహోల్డ్ వ్యవహారాల్లో భారీ కుంభకోణం జరిగిందంటూ కూటమి ఎమ్మెల్యేలు శాసన సభలో ధ్వజమెత్తారు. ఇది బోఫోర్స్‌ని మించిన కుంభకోణమని ఆరోపించారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, కోండ్రు మురళీ, శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, బత్తుల బలరామకృష్ణ, పుట్టా సుధాకర్ యాదవ్, ఎం.షాజహాన్ బాషా తదితరులు ఈ అంశంపై ప్రశ్నలు సంధించారు. రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధానమిస్తూ... 'నమోదైన ఫిర్యాదుల ఆధారంగా ప్రభుత్వం ఫ్రీహోల్డ్ భూముల రీ వెరిఫికేషన్ చేపట్టింది. రిజిస్ట్రేషన్ ద్వారా కేటాయించిన 25,275 ఎకరాలపై రీ-వెరిఫికేషన్ పూర్తయింది. 7,837 ఎకరాల విస్తీర్ణంలో అతిక్రమణలను గుర్తించాం. వీటిపై చర్యలు తీసుకుంటాం' అని హామీ ఇచ్చారు. ఈ సమాధానంతో సంతృప్తి చెందని ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ... 'జగన్‌కు ఎవరిపైనైనా కోపం వస్తే వారి భూములను 22 ఏ జాబితాలో చేర్చి వేధింపులకు గురి చేశారు. గత ప్రభుత్వంలో విజయసాయిరెడ్డి, వైవీ సుబ్బారెడ్డిల కబంధ హస్తాల్లో చిక్కుకున్న విశాఖపట్నం పరిసర ప్రాంతాల్లోనే 22 ఏ, ఫ్రీహోల్డ్ భూముల వ్యవహారాల్లో రూ.2 లక్షల కోట్ల ఆర్థిక లావాదేవీలు జరిగాయి. విశాఖ నడిబొడ్డులో అత్యంత ఖరీదైన 300 ఎకరాల అసైన్డ్ భూములను బెదిరించి కొనుగోలు చేశారు. మాట వినకపోతే ఆక్రమించుకుని రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారు. ఈ విషయంలో వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కైపోయారు. విశాఖలో భూముల దోపిడీని పూర్తి ఆధారాలతో నిరూపించలేకపోతే ఏ శిక్షకైనా నేను సిద్ధమే. అయితే దీనిపై విచారణకు ప్రభుత్వ అధికారులు సరిపోరు. సిటింగ్ జడ్జితో విచారణ జరిపించాలి' అని డిమాండ్ చేశారు. రాజాం ఎమ్మెల్యే కోండ్రు మురళి మాట్లాడుతూ... 'జగన్ ప్రభుత్వం నా కాలేజీ భూములను కూడా 22 ఏలో చేర్చి చాలా ఇబ్బందులకు గురి చేసింది' అని చెప్పారు. రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ (జనసేన) మాట్లాడుతూ... 'గత ప్రభుత్వం చేపట్టిన భూముల రీ సర్వేలో లోపాలు జరిగాయి. దీంతో భూ రికార్డుల్లో హెచ్చు, తగ్గులు రావడంతో ఫిర్యాదులు ఎక్కువయ్యాయి. కోరుకొండ దేవస్థానం ఈనాం భూముల్లో రైతులకు చెందిన 300 ఎకరాలను 22 ఏలో చేర్చేశారు. రాజానగరం నియోజకవర్గంలో వైసీపీ నేతలు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ కబ్జాలకు పాల్పడ్డారు' అని చెప్పారు. డీకేటీ భూముల ఆక్రమణలపై కమిటీ వేసి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు న్యాయం చేయాలని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో అన్యాయానికి గురైనవారికి న్యాయం చేయాలని విశాఖ ఈస్ట్ ఎమ్మెల్యే వంశీకృష్ణ (జనసేన), జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య కోరారు. సభ్యుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న మంత్రి అనగాని సత్యప్రసాద్... 'గత ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలు, ఆక్రమణలపై విచారణకు శాసనసభా కమిటీని నియమిస్తాం' అని హామీ ఇచ్చారు. ఇంకా.. ఆటిజం సమస్యతో బాధపడుతున్న పిల్లలు, ఓడరేవుల నిర్మాణం-కార్యకలాపాలు, ఆదర్శ క్రీడా పాఠశాలలు, కొత్త పింఛన్ల మంజూరు, జీడి మామిడి, కొబ్బరి రైతులకు కనీస మద్దతు ధర కల్పన, పట్టుపరిశ్రమ, మల్బరీ రైతుల సమస్యలపై ఎమ్మెల్యేలు ప్రశ్నలేయగా మంత్రులు స్పందించారు.

'మత్తు'కన్నా స్మార్ట్ ఫోన్ ప్రమాదకరం

- సోషల్ విష సంస్కృతి నివారణకు సీఎం చర్యలు చేపట్టాలి: పీవీ రమేశ్



పెదకాకాని, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో నేడు సోషల్ మీడియాలో నెలకొని ఉన్న విష సంస్కృతిపై సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని అన్ని రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు, మేధావులతో విస్తృతంగా చర్చలు జరపాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేశ్ సూచించారు. గుంటూరులో 'సోషల్ మీడియాలో విష సంస్కృతి' అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠిలో ఆయన మాట్లాడుతూ... 'గాంధీజీపై, పండిట్ జవహర్ లాల్ నెహ్రూపై సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో, వ్యక్తిగత దూషణలతో పోస్టులు పెడుతున్నా ఇప్పటివరకు ఎవరినీ అరెస్టు చేయకపోవడం దురదృష్టకరం. సోషల్ మీడియా దుష్ప్రభావాలపై విస్తృతంగా చర్చలు జరగాలి. మత్తు పదార్థాల వ్యసనం కన్నా స్మార్ట్ ఫోన్ వాడకం మరింత ప్రమాదకరం' అని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వీ లక్ష్మణరెడ్డి, ప్రముఖ విద్యావేత్త ఆచార్య డీ.ఏ.ఆర్.సుబ్రహ్మణ్యం తదితరులు ప్రసంగించారు.



నెహ్రూకు నివాళులర్పిస్తున్న పీసీసీ చీఫ్ షర్మిల

11 గెలిచి మీరు ఏం ఘనత సాధించారు?

- సభలో ప్రభుత్వాన్ని ఎండగట్టనప్పుడు జగనైనా, షర్మిలైనా ఒక్కటే
- వైసీపీ ఇన్‌సిగ్నిఫికెంట్... ఇది ప్రజా తీర్పు
- సోషల్ సైకోలపై రాజకీయాలకు అతీతంగా చర్యలు ఉండాలి
- వికృత చేష్టలకు పాల్పడిన వారిని అరెస్టు చేస్తున్న పోలీసు శాఖకు ధన్యవాదాలు: షర్మిల

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): 'శాసనసభ్యునిగా అసెంబ్లీకి వెళ్లి ప్రజా సమస్యలను ప్రస్తావించనప్పుడు, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టనప్పుడు... జగనైనా, షర్మిలైనా ఒక్కటే' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల అన్నారు. పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా విజయవాడ ఆంధ్రరత్న భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. 'అసెంబ్లీకి వెళ్లకపోవడంపై జగన్ కాంగ్రెస్‌కు సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ప్రజలకు జవాబుదారిగా ఉండాలి. వైసీపీకి 38 శాతం ఓట్లు వస్తే ఆయనేం చేస్తున్నారు? 11 సీట్లు గెలిచి ఏం ఘనత సాధించారు? అధికారంలో ఉండగా అన్ని వ్యవస్థలనూ భ్రష్టుపట్టించారు. పోలీసు వ్యవస్థను కుక్కలా వాడుకున్నారు. వైసీపీని ఇన్‌సిగ్నిఫికెంట్ పార్టీగా రాష్ట్ర ప్రజలే పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత హోదా ఇస్తేనే అసెంబ్లీకి వెళ్తాననడం జగన్ మూర్ఖత్వం. సోషల్ మీడియా ద్వారా అసభ్యకరంగా ప్రవర్తించిన వాళ్లను పోలీసులు అరెస్టు చేయాలి. రాజకీయాలకు అతీతంగా చట్టపరమైన చర్యలు ఉండాలి. వికృత చేష్టలకు దిగినవారిని అరెస్టు చేస్తున్న పోలీసు శాఖకు ధన్యవాదాలు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా నేను కేసుపెడితే రాజకీయం చేసినట్లు అవుతుందని ఆలోచిస్తున్నా' అని షర్మిల అన్నారు.

ఉపాధి హామీని నిర్వీర్యం చేసే ప్రయత్నం

- కేంద్రం ప్రభుత్వంపై వెంకట్ ఆగ్రహం

న్యూఢిల్లీ, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): దేశంలో పేదల ఆకలి తీరుస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆరోపించారు. గురువారం ఢిల్లీలో అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కమిటీ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కూలీలు, గ్రామీణ వృత్తిదారులపై వివక్ష చూపుతున్నారని చెప్పారు. రోజురోజుకూ పల్లెల్లో పేదలకు ఉపాధి కరవవుతోందన్నారు. సమాజానికి ఉత్పత్తిని సృష్టించే గ్రామీణ పేదలకు పని కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ అధ్యక్షుడు ఎ.విజయ రాఘవన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలు జి.నాగయ్య, ఆర్.వెంకట రాములు, నారి ఐలయ్య, పొన్నం వెంకటేశ్వరరావు, మచ్చ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి అంబేడ్కర్, తెలుగు వర్సిటీలు!

- త్వరలో ప్రధాన కార్యాలయాల ఏర్పాటు
- కేబినెట్ ముందుకు ప్రతిపాదనలు

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీల సేవలను రాష్ట్రానికి తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాటి ప్రధాన కార్యాలయాలను రాష్ట్రంలో ఏర్పాటుచేసేందుకు చర్యలు ప్రారంభించింది. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల 18న జరిగే కేబినెట్‌లో పెట్టి ఆమోదముద్ర వేయనుంది. ఆ వెంటనే ఆయా యూనివర్సిటీల కార్యకలాపాలు రాష్ట్రం నుంచే ప్రారంభమవుతాయి. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు దాటినా ఆ రెండు యూనివర్సిటీల విభజన జరగలేదు. ఉమ్మడి రాజధాని గడువు(పదేళ్లు) ముగిసినందున ఇకపై ఏపీలోని స్టడీ సెంటర్లు, ప్రాంగణాలకు సేవలు అందించకూడదని హైదరాబాద్‌లో ఉన్న ఆయా యూనివర్సిటీల అధికారులు నిర్ణయం తీసుకోవడంతో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

చనిపోతూ నలుగురికి ప్రాణం

- రోడ్డు ప్రమాదంలో యువకుడు బ్రెయిన్‌డెడ్
- అవయవదానానికి తల్లిదండ్రుల సమ్మతి
- విజయనగరంలో గ్రీన్ చానల్ ద్వారా అవయవాల తరలింపు




సాయికుమార్ అవయవాలను గ్రీన్‌చానల్ ద్వారా తరలిస్తున్న దృశ్యం



విజయనగరం రింగురోడ్డు, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు.. తాను చనిపోతూ నలుగురికి ప్రాణం పోశాడు. ప్రమాదంలో తలకు తీవ్ర గాయాలై, బ్రెయిన్‌డెడ్ కావడంతో తమ కొడుకు అమరుడిగా ఉండాలని భావించి, ఆ యువకుడి అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. వీరిని ప్రతి ఒక్కరూ అభినందిస్తున్నారు. విజయనగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి (తిరుమల మెడికవర్ హాస్పిటల్) నుంచి అవయవాలను గురువారం గ్రీన్‌చానల్ ద్వారా వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం కొత్తవలస గ్రామానికి చెందిన లంకేన సాయికుమార్(22) ఈనెల 12న రాత్రి బైక్‌పై ఇంటికి వస్తూ మార్కొండ పుట్టి-సరాయివలస మధ్య అదుపుతప్పి కింద పడ్డాడు. తలకు బలమైన గాయాలయ్యాయి. హుటాహుటిన పార్వతీపురం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు విజయనగరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యానికి శరీరం సహకరించకపోవడంతో వైద్యులు గురువారం బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించి తల్లిదండ్రులకు తెలియజేశారు. కుమారుడు దక్కడన్న వార్తను జీర్ణించుకోలేక వారు గుండెలవిసేలా విలపించారు. బాధిత తల్లిదండ్రులను వైద్యులు, బంధువులు ఓదార్చి అవయవదానంపై అవగాహన కల్పించారు. అంత కష్టంలోనూ ధైర్యం తెచ్చుకుని అవయవదానం ద్వారా తన కుమారుడిని అమరుడిగా చూడాలని భావించి అందుకు సమ్మతి తెలిపారు. అనంతరం వైద్యులు పోలీసుల సహకారంతో గురువారం ఉదయం గ్రీన్‌చానల్ ఏర్పాటు చేసి సాయికుమార్ కాలేయం, మూత్రపిండాలు, ఊపిరితిత్తులను పొరుగున వున్న విశాఖపట్నం జిల్లాకు తరలించారు.

ఆంధ్రజ్యోతి



విజయవాడ ● శుక్రవారం 15 నవంబరు 2024

"ఆర్ఆర్ఆర్‌ను నాడు జైల్లో కొడుతుంటే సెల్‌ఫోన్‌లో జగన్ చూశారు. మొదట ఈ విషయం చెబితే మనుషులు ఇలా కూడా ఉంటారా అనుకున్నాను. కానీ నన్ను జైల్లో పెట్టి నా గదిలో సీసీ కెమెరాలు పెట్టినప్పుడు ఆర్ఆర్ఆర్ చెప్పింది నిజమేనని నిర్ధారించుకున్నాను. ఆయనను అన్ని విధాలుగా వేధించి నాడు రాష్ట్రానికి రానివ్వలేదు. నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది. ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్. వైనాట్ 175 అంటే చివరికి 11తో ప్రజలు సరిపెట్టారు". - సీఎం చంద్రబాబు



ఇది దేవుడు రాసిన స్క్రిప్ట్!



ఆర్ఆర్ఆర్‌ను నాడు రాష్ట్రానికి రానివ్వలేదు.. నేడు ఆయన ముందు కూర్చోలేని దుస్థితి జగన్‌ది

కల్మషం లేని వ్యక్తి రఘురామకృష్ణరాజు పోరాడి గెలిచాడు.. ఉపసభాపతి అయ్యాడు.. ముక్కుసూటితనమే ఇబ్బందికి గురిచేసింది

సొంత ఎంపీని వైసీపీ ప్రభుత్వం టార్చర్ చేసింది.. లాఠీలు, రబ్బరు బెల్టులతో కొట్టారు.. చంపేస్తామని బెదిరించారు...చంపడానికీ ప్లాన్ చేశారు

అయ్యన్ననూ, నన్నూ ఇబ్బంది పెట్టారు.. ఆయన చివరకు స్పీకరు అయ్యారు..నేను సీఎంగా గౌరవ సభలో అడుగుపెట్టా.. శాసనసభలో సీఎం

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఉపసభాపతి రఘురామ కృష్ణరాజు ఉన్నది ఉన్నట్టు మాట్లాడతారని, కల్మషం లేకుండా ముక్కుసూటితనంగా మాట్లాడటం ఆయన నైజమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. అలా నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి మాట్లాడటమే ఆయనను ఇబ్బందుల్లోకి నెట్టిందన్నారు. దేశ చరిత్రలో ఏ ఎంపీకి ఎదురుకాని దారుణమైన దుస్థితిని ఆయన చూశారని, ఆ పరిస్థితి నుంచి పోరాడి గెలిచి ఇప్పుడు ఉపసభాపతి స్థానానికి వచ్చారని సీఎం కొనియాడారు. అంతకుముందు..ఉపసభాపతిగా రఘురామ కృష్ణరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రులు అచ్చెన్నాయుడు, సత్యకుమార్ యాదవ్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జ్యోతుల నెహ్రూ తదితరులు ఆయనను పోడియం వద్ద సభాస్థానానికి తీసుకెళ్లి కుర్చీలో కూర్చోబెట్టారు. పోడియం పైకి వెళ్లేముందు సీఎం కాళ్లకు ఆర్ఆర్ఆర్ నమస్కారం చేశారు. ఎమ్మెల్యేలంతా సభాస్థానం వద్దకు వచ్చి ఆర్ఆర్ఆర్‌కు అభినందనలు తెలిపారు. ఆ తర్వాత సాయంత్రం వరకూ ఆయనే సభను నడిపించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. ఆర్ఆర్ఆర్ తాతగారు జి.ఎస్.రాజు రాష్ట్ర శాసనమండలి తొలి డిప్యూటీ ఛైర్మన్‌గా పనిచేశారని, అప్పటినుంచే వారికి రాజకీయ వారసత్వం ఉందన్నారు. గత ప్రభుత్వంతో విభేదించిన కారణంగా సొంత ఎంపీ అని కూడా చూడకుండా జగన్ ప్రభుత్వం అత్యంత దారుణంగా ఆర్ఆర్ఆర్‌ను హింసించిందన్నారు. "సొంత ఎంపీపైనే నాటి వైసీపీ ప్రభుత్వం రాజద్రోహం కేసుపెట్టారు. 2021 మే 14న ఆర్ఆర్ఆర్ పుట్టినరోజు నాడే హైదరాబాద్ వెళ్లి బలవంతంగా అరెస్టు చేసి ఏపీకి తీసుకొచ్చారు. శని, ఆదివారాల్లో కోర్టులకు సెలవు అని కావాలనే శుక్రవారం అరెస్టు చేశారు. అరెస్టు చేసిన రోజు రాత్రి గుంటూరు సీఐడీ ఆఫీసులో ఐదుగురు ముసుగు వేసుకుని వచ్చి అత్యంత దారుణంగా కొట్టారు. లాఠీలు, రబ్బరు బెల్టులతో కాళ్లపై కొట్టారు. కోర్టులో కొట్టిన విషయం చెబితే సాయంత్రం కస్టడీకి వచ్చినప్పుడు చంపేస్తామని బెదిరించారు. అయినా భయపడకుండా కోర్టులో కాళ్లకు ఉన్న దెబ్బలను ఆర్ఆర్ఆర్ చూపించారు. కోర్టు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లమని ఆదేశిస్తే, కావాలని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడకూడా రిపోర్టులు తారుమారుచేశారు. మధ్యాహ్నం ఇవ్వాల్సిన రిపోర్టు సాయంత్రం 6గంటలకు కోర్టుకు సమర్పించారు. ఈలోగా మేం సుప్రీంకోర్టుకు వెళ్లాం. సుప్రీంకోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లో మిలటరీ ఆసుపత్రిలో ఆర్ఆర్ఆర్ చేరారు. అక్కడ కూడా రిపోర్టులు మార్చాలని ఓ వ్యక్తి ప్రయత్నించాడు. సభ్యత కాదు కాబట్టి ఆయన పేరు ఇక్కడ చెప్పట్లేదు. అయినా అక్కడితో కక్ష ఆపకుండా ఆయనను వేధించే ప్రయత్నం చేశారు. అప్పట్లో నర్సాపురం ఎంపీగా ఉన్న ఆయనను సొంత నియోజకవర్గంలో అల్లూరి సీతారామరాజు విగ్రహావిష్కరణకు రానివ్వలేదు. హైదరాబాద్ నుంచి సభకు వచ్చేందుకు రైలులో బయలుదేరినా, సత్తెనపల్లి, పిడుగురాళ్ల ప్రాంతంలో బోగిని తగలబెట్టి చంపాలని ప్లాన్ చేశారని తెలిసి, అక్కడే రైలు దిగిపోయారు" అని చంద్రబాబు వివరించారు.

పాబ్లో ఎస్కోబార్‌తోనే పోల్చగలం

"ప్రపంచ డ్రగ్స్ స్మగ్లర్ పాబ్లో ఎస్కోబార్, జగన్‌ల వ్యక్తిత్వం, ఆలోచనా విధానం ఒక్కటే. ఎస్కోబార్ ప్రపంచంలో 80శాతం డ్రగ్స్ మార్కెట్‌ను శాసించాడు. ఇక్కడ రాష్ట్రంలో జగన్ గంజాయి, డ్రగ్స్‌ను తీసుకొచ్చాడు" అని చంద్రబాబు అన్నారు. ప్రతిపక్ష హోదా తాము ఇచ్చేది కాదనీ, ప్రజలు ఇవ్వాలని సీఎం తెలిపారు.

ఆర్ఆర్ఆర్‌తో సభలో ఉల్లాసం: స్పీకర్

రఘురామ కృష్ణరాజు ఉపసభాపతి కావడం తనకు చాలా ఆనందంగా ఉందని స్పీకర్ అయ్యన్నపాత్రుడు అన్నారు. ఆయన ఉపసభాపతి కావడం వల్ల సభ మంచి ఉల్లాసంగా మారుతుందన్నారు.

227 ఎంవోయూలు.. పైసా రాలేదు

ఐదేళ్ల జగన్ పరిపాలన నిర్వాకం ఇదీ


మళ్లీ గాడిలో పెట్టేందుకే సూపర్ సిక్స్: సీఎం

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లలో పాలకుల విధ్వంసకర విధానాలతో సర్వనాశనమైన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలోకి నడిపి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ఆరు పాలసీలు రూపొందించామని సీఎం చంద్రబాబు అన్నారు. ఏపీ పారిశ్రామిక అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఎంఎస్ఎంఈ - ఎంట్రప్రెన్యూర్ అభివృద్ధి విధానం 4.0, ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఏపీ ఎలక్ట్రానిక్స్ పాలసీ, ఏపీ ప్రైవేటు పార్కుల విధానం, ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ అనే ఆ ఆరు విధానాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను ముఖ్యమంత్రి వివరించారు. జగన్ హయాంలో గడచిన ఐదేళ్లలో 227 ఎంవోయూలు జరిగినా రాష్ట్రానికి పైసా పెట్టుబడి రాలేదన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీలో సీఎం మాట్లాడారు. గత ఐదేళ్లలో పన్నులు, కరెంటు చార్జీలు పెంచడం వల్ల పరిశ్రమలు మనుగడ సాధించలేని దుస్థితిలోకి దిగజారాయన్నారు. పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టారని గుర్తుచేశారు. 'వైసీపీ నిర్లక్ష్యం కారణంగా గత ఐదేళ్లలో రాష్ట్రం నుంచి కంపెనీలు పారిపోయాయి. 2014-19 సమయంలో పరిశ్రమలకు మేం రూ.3,900 కోట్ల ప్రోత్సాహకాలు ఇవ్వగా, జగన్ కేవలం రూ.1,900 కోట్లే ఇచ్చారు. కేంద్రం ఇచ్చే పీఎల్ఐ (ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకం) పథకాన్ని జగన్ నిర్లక్ష్యం చేయడం వల్ల రాష్ట్రానికి రూ.1,28,000 కోట్ల గ్రాంటు, 8,50,000 ఉద్యోగాలు అందకుండా పోయాయి. అలాగే, పెట్టుబడుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'ఈడీబీ'ని (ఎకనమికల్ డెవలప్‌మెంట్ బోర్డు) జగన్ రద్దుచేశారు. దానిని మేం ఇప్పుడు తిరిగి ప్రారంభిస్తున్నాం. ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ ద్వారా కొత్తగా రూ.30,000 కోట్ల పెట్టుబడులు, ఒక బిలియన్ డాలర్ల విదేశీ పెట్టుబడులు తీసుకురావాలనే ఆశయంతో ఉన్నాం. ఎన్టీపీసీ, జెన్కో కలిసి వైజాగ్‌లో రూ.84,700 కోట్ల పెట్టుబడులు పెడుతున్నాయి." అని చంద్రబాబు తెలిపారు. కాగా, రాష్ట్రానికి మొత్తంగా రూ.30 లక్షల కోట్ల పెట్టుబడులు రావాలన్నది లక్ష్యమనీ, 20 లక్షలమందికి ఉపాధి కల్పన దిశగా కృషి చేస్తున్నామని సీఎం చెప్పారు. రూ.83,000 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను లక్ష్యంగా పెట్టుకున్నామని చంద్రబాబు వివరించారు.


అసెంబ్లీలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లు తీసుకురావాలి

- గత ఐదేళ్లూ చట్టసభలు హుందాతనం కోల్పోవడంతో సోషల్ సైకో మూకలు బరితెగించాయి: డిప్యూటీ సీఎం
- డిప్యూటీ స్పీకర్ రఘురామకు పవన్, మంత్రులు శుభాకాంక్షలు



అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా వెళ్తున్న అపసవ్య ధోరణిని సరిచేయడం ఈ సభ నుంచే ప్రారంభం కావాలని, సోషల్ మీడియా అబ్యూజ్ ప్రొటెక్షన్ బిల్లును సాధ్యమైనంత త్వరగా తీసుకురావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మార్పు తెస్తామని ప్రజలు మనపై అపార నమ్మకం ఉంచారని, దాన్ని మనం నిలబెట్టుకోవాలన్నారు. గత ఐదేళ్లపాటూ చట్టసభలు హుందాతనం కోల్పోవడం వల్లనే సోషల్ మీడియాలో సైకో మూకలు బరితెగించాయన్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన రఘురామకృష్ణరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. గురువారం శాసనసభలో పవన్ మాట్లాడుతూ... రఘురామ మాటల్లో పదునుతో పాటు హాస్యం సైతం ఉంటుందని అన్నారు. తాము సినిమాల్లో దెబ్బలు తిన్నట్టు నటిస్తామని, కానీ రఘురామరాజు నిజంగా దెబ్బలు భరించి నిలబడి గెలిచారన్నారు. నేరపూరిత ఆలోచనలు ఉన్న వ్యక్తి చేతికి అధికారం దక్కితే ఎవ్వరినైనా బలి చేస్తారని వ్యాఖ్యానించారు. జడ్జీలను, పార్టీ కార్యకర్తలను, సొంత పార్టీ ఎంపీ అయిన రఘురామరాజును కూడా వదల్లేదన్నారు. ఆయన్ను శారీరకంగానే కాదు, మానసికంగానూ హింసించారని అన్నారు. రఘురామరాజుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం తమకు భయాన్ని కలిగించిందన్నారు. అందరూ కలిసి ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలనివ్వకూడదన్న సంకల్పంతో ముందుడుగేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు తోటిసభ్యులకు ధన్యవాదాలు చెప్పారు. కర్మ ఎవరినీ వదలదని, రఘురామను తన సొంత నియోజకవర్గంలో అడుగుపెట్టనివ్వని వారు ఇప్పుడు కనీసం సభకు రాలేకపోతున్నారంటూ జగన్‌ను పవన్ విమర్శించారు. మంత్రి సత్యకుమార్ యాదవ్.. డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన రఘురామరాజుకు శుభాకాంక్షలు తెలిపారు. 'మిమ్మల్ని నోరారా అధ్యక్షా అని పిలిచే అదృష్టాన్ని జగన్ కోల్పోయారు' అని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అనంతరం బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, మంత్రి కందుల దుర్గేశ్ డిప్యూటీ స్పీకర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

జగన్ ఒక్కసారైనా రావాలి: అచ్చెన్న

ఐదేళ్లలో జగన్ ఒక్కసారైనా అసెంబ్లీకి వస్తే చూడాలన్న కోరిక ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. ఆ ఒక్కరోజు తనకు ఓ గంటపాటు మైక్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్‌ను కోరారు. డిప్యూటీ స్పీకర్‌గా క్రమశిక్షణ కోల్పోకుండా హాస్యం, ఛలోక్తులతో సభను ఆహ్లాదకరంగా నడిపించాలని రఘురామకు సూచించారు.

రఘురామ భోళాశంకరుడు: లోకేశ్

ఆర్ఆర్ఆర్ అంటే రియల్ రెస్పాన్సిబుల్ రెబలిస్ట్ అని మంత్రి నారా లోకేశ్ అభివర్ణించారు. రఘురామ భోళాశంకరుడన్నారు. ఉండి నియోజకవర్గాన్ని ఆయన అభివృద్ధి చేస్తున్న తీరు తన లాంటి యువనాయకులకు ఆదర్శనీయమన్నారు. తనను బంధించి కస్టడీలో తీవ్రంగా హింసించినప్పటికీ ఎక్కడా తాను భయపడలేదని చెప్పారు. తమ పార్టీ అధినేత చంద్రబాబు అరెస్ట్ అయినప్పుడు ఢిల్లీలో తనకు అండగా నిలబడి న్యాయ సలహాలు ఇచ్చిన సంగతిని ఆయన గుర్తుచేసుకున్నారు. ఏపీలో చట్టసభలను పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలని, పేపర్లు కనపడకుండా చేసేలా నిర్ణయం తీసుకోవాలని డిప్యూటీ స్పీకర్‌ను కోరారు.

భావవ్యక్తీకరణ పేరుతో దిగజారుడు భాష: రఘురామ

వైసీపీ నేతలు గత ఐదేళ్లలో చట్టసభల్లో జుగుప్సాకరమైన భాషను తీసుకొచ్చారని, భావవ్యక్తీకరణ పేరుతో దిగజారుడు భాషను విచ్చలవిడిగా వాడారని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రజలు ఆ నాయకులను అత్యంత దారుణంగా ఓడించారని అన్నారు. డిప్యూటీ స్పీకర్‌గా ఎన్నికైన తనకు వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి శుభాకాంక్షలు చెప్పడం ఆహ్వానించదగిన పరిణామమని పేర్కొన్నారు. చిన్నపిల్లలు చందమామ కోసం మారాం చేసినట్టు జగన్ ప్రతిపక్ష హోదా కోసం మారాం చేయడం మానుకోవాలని ఆయన హితవు పలికారు. అసెంబ్లీకి వస్తేనే కదా మైక్ ఇస్తారో లేదో తెలుస్తుందని, రాకుండానే ఇవ్వట్లేదనడంలో అర్థం లేదన్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు అయిన సభ్యులంతా ప్రతి రోజు అసెంబ్లీకి రావాలని, కౌల్ అండ్ షక్దర్ పుస్తకం చదువుకోవాలని, సభలో జరిగే ప్రతి చర్చలో పాల్గొనాలని రఘురామ సూచించారు. గత ప్రభుత్వం తనను అరెస్ట్ చేసి చిత్రహింసలకు గురిచేసిన సందర్భంలో తన కుటుంబానికి ధైర్యం చెప్పి, అండగా నిలవడమే కాకుండా తనకు డిప్యూటీ స్పీకర్ హోదా కల్పించిన సీఎం చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదు

- రుషికొండ ప్యాలెస్‌కు ప్రజాధనం దుర్వినియోగం
- విచారణ జరిపించాలి: విష్ణుకుమార్ రాజు
- అది జగన్ రాజకీయ సమాధి: రఘురామ
- ప్రత్యేకంగా చర్చిద్దాం: స్పీకర్ అయ్యన్న

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రుషికొండ ప్యాలెస్ నిర్మాణం కోసం వందల కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారని, అక్రమాలన్నీ కళ్ల ముందే కనబడుతున్నందున మాజీ సీఎం జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు అన్నారు. గురువారం శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో రుషికొండ ప్యాలెస్‌పై చర్చ జరిగింది. రుషికొండపై విలాసవంతమైన భవన సముదాయాలు, గృహోపకరణాలు, పచ్చదనం, మొక్కలు, దీపాలంకరణ, రహదారులు, భద్రత ఏర్పాట్లకు చేసిన ఖర్చు వివరాలు తెలియజేయాలంటూ బీజేపీ ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, ఆదినారాయణరెడ్డి అడిగిన ప్రశ్నకు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ సమాధానమిచ్చారు. ఏపీటీడీసీ ఆధ్వర్యంలో రుషికొండపై పాత రిసార్టు స్థానంలో 4,30,373 చదరపు అడగుల విస్తీర్ణంలో 7 బ్లాకులుగా నిర్మించిన రిసార్టుకు మొత్తం 409.39 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. దీనిపై విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వం చేపట్టిన ఈ భారీ ప్రాజెక్టు వెనుక రాజకీయ కుట్ర ఉందన్నారు. ప్రజలకు, రాజకీయ నాయకులకు కూడా తెలియనీయకుండా నిర్మించిన రుషికొండ ప్యాలెస్ వెనుక ఉన్న చిదంబర రహస్యంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. 'అత్యంత విలాసవంతమైన రుషికొండ ప్యాలెస్‌కు ప్రజల సొమ్ము రూ.వందల కోట్లు దుర్వినియోగం చేశారు. అందులో భారీ దోపిడీ జరిగింది. ప్యాలెస్ లోపలకు వెళితే విస్తుపోయే విషయాలు బయటకు వస్తున్నాయి. రూ.1.80 లక్షలతో పేదలకు ఇళ్లను నిర్మిస్తుండగా.. రుషికొండ ప్యాలెస్‌లో బాత్‌రూమ్‌లోని కమోడ్‌కు రూ.11,46,84, బాత్‌టబ్‌కు రూ.12,38,763.. ఇలా చెబుతూ పోతే ఒక్క బాత్‌రూమ్‌లోని పరికరాలకే లక్షలు ఖర్చు పెట్టారు. రుషికొండపై జగన్ కోసం నిర్మించిన ప్యాలెస్‌కు చేసిన ఖర్చు.. పేదలకు నిర్మిస్తున్న 22,743 ఇళ్లతో సమానం. అస్మదీయులకు కాంట్రాక్టులు ఇచ్చి ప్రజాధనాన్ని దోపిడీ చేశారు. ఇది చరిత్రలో అతి పెద్ద ఆర్థిక కుంభకోణం. ఏమీ లేని స్కిల్ కేసులో చంద్రబాబును అరెస్టు చేసి 53 రోజులు జైల్లో పెట్టించి జగన్ మానసిక క్షోభకు గురిచేశారు. రుషికొండ ప్యాలెస్ నిర్మాణంలో అక్రమాలన్నీ కళ్ల ముందే కనబడుతున్నందున మాజీ సీఎం జగన్‌ను జీవిత కాలం జైల్లో పెట్టినా తప్పులేదు' అని విష్ణుకుమార్‌రాజు అన్నారు. టీడీపీ సభ్యుడు రఘురామ కృష్ణరాజు మాట్లాడుతూ.. 'రూ.500 కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు పెట్టి రుషికొండపై జగన్ కట్టుకున్నది ఇల్లు కాదు.. ఆయన రాజకీయ సమాధి' అని ఎద్దేవా చేశారు. రుషికొండ ప్యాలెస్‌పై తాను వేసిన కేసును ఉపసంహరించుకుంటానని తెలిపారు. దీనిపై ప్రత్యేకచర్చకు సోమవారం సభలో సమయం కేటాయిస్తానని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చెప్పారు. దీంతో చర్చను తాత్కాలికంగా ముగించారు.

గత ఐదేళ్లూ విధ్వంసం

- పెట్టుబడిదారులు ఏపీని ఉత్తర కొరియాలా చూశారు
- చంద్రబాబు రాకతో వారిలో నమ్మకం: మంత్రి టీజీ భరత్
- ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త: మంత్రి శ్రీనివాస్

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ పాలనలో ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల పరంగా విధ్వంసానికి గురైంది. పెట్టుబడిదారులు ఏపీని ఉత్తర కొరియా దేశంలా చూశారు. భారతదేశంలో ఎక్కడైనా పెట్టుబడులు పెట్టొచ్చు కానీ ఏపీలో పెట్టకూడదు అని మాట్లాడుకున్నారు' అని పరిశ్రమల మంత్రి టీజీ భరత్ అన్నారు. పరిశ్రమల విధానంపై గురువారం శాసనసభలో ఆయన ఓ ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... 'వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పీపీఏలు రద్దుచేసి పెట్టుబడిదారులను భయపెట్టింది. చంద్రబాబు పేరు చెప్పిన తర్వాత పెట్టుబడిదారుల్లో నమ్మకం ఏర్పడింది. రాబోయే ఐదేళ్లలో రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ఉద్యోగాలు, రూ.83 వేల ఎఫ్‌డీఐలు, 175 నియోజకవర్గాల్లో ఇండస్ట్రియల్ పార్కులు ఏర్పాటు చేయడం మా లక్ష్యం. తక్కువ పెట్టుబడి పెట్టేవారికి కూడా 20 శాతం ప్రోత్సాహకాలు అందుతాయి. విద్యుత్‌లో యూనిట్‌కు ఒక రూపాయి చొప్పున రాయితీని రెండేళ్లపాటు ఇస్తాం. ఫుడ్ ప్రాసెసింగ్‌లో రూ.30 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయి' అని వివరించారు. ఎంఎస్ఎంఈపై విధాన ప్రకటన చేస్తూ ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడారు. 'ప్రతి ఇంట్లో ఒక వ్యాపారవేత్త తయారు కావాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఎంఎస్ఎంఈల ద్వారా రూ.50వేల కోట్ల పెట్టుబడులు, 5 లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు వస్తాయి. స్వయం సహాయక బృందాలను ఎంఎస్ఎంఈల్లో పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నాం' అని తెలిపారు. ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీపై ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటన చేశారు. 'ఈ పాలసీ ద్వారా బంజర భూములు వినియోగంలోకి వస్తాయి. విద్యుత్ సరఫరా, వినియోగం మరింత సులభతరం అవుతుంది. పెట్టుబడులకు సంబంధించిన అనుమతులు వేగంగా లభిస్తాయి. ఈ పాలసీ కింద పెట్టుబడులు పెట్టేవారికి అనేక ప్రోత్సాహకాలు, రాయితీలు ఇస్తున్నాం' అని వివరించారు.

కేంద్రం సహకారంతో ఏపీలో ప్రగతి: సుజనా

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ఒక్క అవకాశం అని ప్రజల్ని మభ్యపెట్టి 2019లో అధికారంలోకి వచ్చిన వ్యక్తి స్వార్థంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రోజూ అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చిందని బీజేపీ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీ సమావేశాల్లో బడ్జెట్‌పై గురువారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. 'ఐదేళ్ల క్రితం ఒక్క చాన్స్‌ను నమ్మి పొరబడ్డ ప్రజలు 2024లో ఇచ్చిన సునామీ తీర్పుతో ఐదేళ్ల పాలన ఎంత దారుణంగా ఉందో స్పష్టమైంది. రాజధానిని ధ్వంసం చేసి, సంపద సృష్టించకుండా ప్రతి రోజూ అప్పులతో ఆంధ్రప్రదేశ్‌ను అగాధంలోకి నెట్టారు. ప్రతి రోజూ అప్పులు రాష్ట్రానికి ప్రమాదం గనుక బలమైన భారత ఆర్థిక శక్తిని ఏపీలో అభివృద్ధికి వినియోగించుకోవాలి. అమరావతి, పోలవరం, జాతీయ రహదారులు, రైల్వే లైన్ల వంటి వాటికి నిధులు ఇస్తోన్న మోదీ ప్రభుత్వానికి సముచిత ప్రతిపాదనలు అందజేసి రాష్ట్రాభివృద్ధికి సహకారం కోరితే అద్భుతమైన ప్రగతి సాధించవచ్చు. కేంద్ర రాష్ట్రాల్లో ఎన్డీఏ ప్రభుత్వాలు ఉన్నందున రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ గ్రోత్ సాధ్యం.' అని సుజనా అన్నారు. సీఎంగా చంద్రబాబు ఐదు నెలల్లోనే అమరావతి, పోలవరం నిర్మాణాల వేగం పెంచారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేలు బూర్ల రామాంజనేయులు, వేమిరెడ్డి ప్రశాంతి బడ్జెట్‌పై అసెంబ్లీలో ప్రసంగిస్తూ అద్భుతంగా ఉందని కొనియాడారు.

ప్రజలను జగన్ అవమానించారు: మంత్రి లోకేశ్

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): జగన్ అసెంబ్లీకి రాకుండా ప్రజలను అవమానించారని మంత్రి లోకేశ్ వ్యాఖ్యానించారు. గురువారం అసెంబ్లీలో విరామం సమయంలో వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి గైర్హాజరు కావడంపై లోకేశ్ వద్ద కొంత మంది ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. దానిపై లోకేశ్ స్పందిస్తూ... 'ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ఆ ప్రజలు ఆయనకు ప్రతిపక్ష హోదా ఇవ్వలేదు. అందుకోసం ఆయన ప్రజాస్వామ్యాన్ని బహిష్కరించడం సరికాదు. ప్రజలను కూడా ఆయన అవమానిస్తున్నారు. వాళ్ల ఎమ్మెల్యేలు కూడా కొంతమంది సభకు రావాలని కోరుకుంటున్నారని తెలిసింది' అని అన్నారు.

సోషల్ సైకోలకు మద్దతా?

- వైసీపీ ఎమ్మెల్సీల తీరు సిగ్గుచేటు
- మండలిలో మంత్రులు, కూటమి సభ్యుల ఫైర్
- అరెస్టులపై చర్చించాలని వైసీపీ డిమాండ్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): శాసన మండలిలో సోషల్ మీడియా పోస్టులపై అధికార, ప్రతిపక్ష పార్టీ సభ్యుల మధ్య మాటల యుద్ధం నడిచింది. గురువారం ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైన వెంటనే సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టుల అంశంపై చర్చించాలని వైసీపీ వాయిదా తీర్మానం ఇచ్చింది. డీఎస్సీపై పీడీఎఫ్ ఎమ్మెల్సీలు వాయిదా తీర్మానాన్ని ఇచ్చారు. రెండింటినీ మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు తిరస్కరించారు. చర్చించాల్సిందేనంటూ వైసీపీ సభ్యులు నిరసనకు దిగారు. నినాదాలు చేస్తూ చైర్మన్ పోడియం వద్ద, పోడియం పైకి ఎక్కి నిరసన తెలిపారు. వేరే ఫార్మాట్‌లో రావాలని చైర్మన్ పదే పదే చెప్పినా వైసీపీ సభ్యులు వినలేదు. సభ్యుల నిరసనల మధ్యే చైర్మన్ ప్రశ్నోత్తరాలను కొనసాగించారు. ఈ సందర్భంగా టీడీపీ, వైసీపీ సభ్యుల మధ్య వాగ్వాదం జరిగింది. మండలిలో ప్రజల సమస్యలను ప్రస్తావించాల్సింది పోయి... మహిళల పట్ల అసభ్యంగా పోస్టులు పెట్టే వారిని సపోర్టు చేస్తారా? అంటూ మంత్రులు, కూటమి ఎమ్మెల్సీలు మండిపడ్డారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ... సోషల్ మీడియా సైకోలకు పెద్దల సభలో వైసీపీ సభ్యులు మద్దతు ఇవ్వడం సిగ్గుచేటన్నారు. సోషల్ మీడియాలో అసభ్య పదజాలంతో సందేశాలు పంపుతూ మానసిక క్షోభకు గురిచేసిన వారికి మద్దతుగా మాట్లాడటానికి వైసీపీ సభ్యులు మండలికి రావడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు కుటుంబాన్ని అవమానిస్తుంటే.. అప్పటి సభలో సీఎం హోదాలో ఉన్న జగన్ వెకిలి నవ్వులు నవ్వారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హోం మంత్రి అనిత కుటుంబ సభ్యులతో పాటు జగన్ చెల్లిని కూడా సభ్య సమాజం తలదించుకునేలా సోషల్ మీడియాలో వేధించారన్నారు. అటువంటి సోషల్ సైకోలకు మద్దతుగా వైసీపీ సభ్యులు మండలి కార్యక్రమాలకు అంతరాయం కలిగించేలా పోడియాన్ని చుట్టుముట్టడం దుర్మార్గపు చర్య అని అభివర్ణించారు. సమాజం తల దించుకునే విధంగా ప్రవర్తిస్తున్న వైసీపీ సభ్యుల చర్యలు బాధాకరమని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మంత్రి సవిత మాట్లాడుతూ.. మహిళలను కించపరిచే వారిని సమర్థిస్తారా? అంటూ వైసీపీ సభ్యులపై మండిపడ్డారు. అనంతరం యనమల రామకృష్ణుడు మాట్లాడుతూ.. వాయిదా తీర్మానాన్ని చర్చకు చేపట్టాలా లేదా అనేదానిపై చైర్మన్‌కు నిర్ణయాధికారం ఉంటుందన్నారు. సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి అరెస్టులపై చర్చించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. వాయిదా తీర్మానంకాకుండా వేరే ఫార్మాట్‌లో వస్తే చర్చకు సిద్ధమన్నారు. సోషల్ మీడియాలో ఎవరు ఏం చేశారో, ఎవరు చేయించారో అన్నింటిపై చర్చిస్తామన్నారు. మండలిలో ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎంతోమంది యువకులను అరెస్టుచేయడం ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ జరగలేదన్నారు. దీనిపై చర్చ జరగాలని డిమాండ్ చేశారు. మంత్రి నిమ్మల మాట్లాడుతూ.. అసభ్యంగా పోస్టులు పెట్టిన వారికి మద్దతుగా వైసీపీ సభ్యులు ఆందోళన చేయడం సిగ్గుచేటని విమర్శించారు. టీడీపీ సభ్యురాలు పంచుమర్తి అనురాధ మాట్లాడుతూ... మహిళలపై పోస్టులు పెట్టే వారిని సమర్థిస్తారా అంటూ మండిపడ్డారు. మండలి చైర్మన్ పదే పదే చెప్పినా వైసీపీ సభ్యులు పోడియం దిగకపోవడంతో సభను వాయిదా వేశారు.

తల్లిని అవమానిస్తే సహించాలా?

(మొదటి పేజీ తరువాయి)

అవమానించిన తర్వాతే... ఈ కౌరవ సభలో అడుగు పెట్టేదిలేదని ప్రకటించి బహిష్కరించారని గుర్తు చేశారు. ఆ తర్వాత కూడా టీడీపీ సభ్యులు సభకు వచ్చారని తెలిపారు. జగన్‌తో సహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలున్నారని... వారు ఇప్పుడు అసెంబ్లీకి ఎందుకు రావడంలేదని లోకేశ్ నిలదీశారు. గురువారం శాసన మండలిలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా అధికార, ప్రతిపక్షాల మధ్య తీవ్ర వాగ్యుద్ధం జరిగింది. సభ ప్రారంభమైనప్పటి నుంచే వాతావరణం వేడెక్కింది. ఒకటో తేదీన ఉద్యోగులకు జీతాలు పడలేదని వైసీపీ సభ్యులు పదేపదే ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రస్తావిస్తూ వాటి అమలు ఎక్కడ అని ప్రశ్నించారు. దీనికి మంత్రులు గట్టిగా సమాధానమిచ్చారు. ఇప్పటికే అమలు చేస్తున్న పథకాలనూ అమలు చేయడంలేదంటున్నారని మంత్రులు మండిపడ్డారు. "వైసీపీ సభ్యులు అసత్యాలు, అర్ధసత్యాలు చెబుతున్నారు. వీళ్ల నాయకుడు శాసనసభకు రారు. వీళ్లు మండలిలో అసత్యాలు చెప్పి రెచ్చగొడుతున్నారు. వీళ్ల నాయకుడు సభకు రాకుండా పారిపోయారు. వీళ్లూ పారిపోతారు" అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. దీంతో తమ హయాంలో చంద్రబాబు సభ నుంచి పారిపోయారంటూ వైసీపీ సభ్యులు వ్యాఖ్యానించారు. దీనిపై మంత్రి లోకేశ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వైసీపీ హయాంలో చంద్రబాబు ప్రతి రోజూ అసెంబ్లీకి వచ్చారని, తన తల్లిని అవమానించిన తర్వాతే బాయ్‌కాట్ చేశారని చెప్పారు. కౌరవ సభ గౌరవసభ అయిన తర్వాతే వస్తానని ప్రకటించారు. ఆ తర్వాత కూడా తమ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారు. అదీ తమ చిత్తశుద్ధి అన్నారు. లోకేశ్ వ్యాఖ్యలపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ స్పందిస్తూ... తల్లిని, చెల్లిని, కుటుంబ సభ్యులను అవమానిస్తే ఎవరూ ఒప్పుకోరన్నారు. గతంలో జరిగిన ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థించడంలేదని తెలిపారు. దీనిపై లోకేశ్ మాట్లాడుతూ... "ఆ రోజు అవమానించినవారికే టికెట్లు ఇచ్చారు. కదా? అది సమర్థించడం కాదా?" అంటూ బొత్సను ప్రశ్నించారు.

తుది'కీ' రికార్డులన్నీ కోర్టు ముందు ఉంచండి

▸▸ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డుకు హైకోర్టు ధర్మాసనం ఆదేశం

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ కానిస్టేబుల్ ప్రాథమిక రాత పరీక్ష విషయంలో ప్రకటించిన తుది'కీ'కి సంబంధించి రికార్డులన్నీ కోర్టు ముందు ఉంచాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును గురువారం హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జి.నరేందర్, జస్టిస్ టి.చంద్ర ధనశేఖర్‌లతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. పోలీస్ కానిస్టేబుల్ భర్తీకి సంబంధించి ప్రాథమిక రాతపరీక్ష ప్రశ్నాపత్రంలోని ఏడు ప్రశ్నలకు పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు సరైన జవాబులు నిర్ణయించకుండా తుది'కీ' ప్రకటించిందని, జవాబులను పునఃపరిశీలించి తుది 'కీ' ప్రకటించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ పలువురు అభ్యర్థులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యాలపై గతంలో విచారణ జరిపిన సింగిల్ జడ్జి.. రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్ణయాన్ని సమర్థిస్తూ పిటిషన్లను కొట్టివేశారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ అభ్యర్థులు ధర్మాసనం ముందు అప్పీల్ చేశారు. వారి తరఫున న్యాయవాది పీవీజీ ఉమేష్‌చంద్ర గురువారం వాదనలు వినిపించారు. అకాడమీ పుస్తకాల్లో ఉన్నదానికి భిన్నంగా తుది కీలో జవాబులు ఉన్నాయని చెప్పారు. కీలో తప్పులు ఉన్నట్లు సింగిల్ జడ్జి సైతం గుర్తించినప్పటికీ తమ పిటిషన్లు కొట్టివేశారన్నారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు తరఫున ప్రభుత్వ న్యాయవాది రాజు వాదనలు వినిపిస్తూ.. నిపుణులు కమిటీ పరిశీలించాకే తుది కీ ప్రకటించామన్నారు. ఇరువైపు వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం.. తుది కీపై అభ్యంతరం తెలుపుతూ అధికారులకు సమర్పించిన వినతిని తమ ముందు ఉంచాలని అభ్యర్థులకు స్పష్టం చేసింది.

బడుల్లో వివాహాలు, సమావేశాలు నిషేధం

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ఆవరణల్లో వివాహాలు, రాజకీయ, మతపరమైన సమావేశాలు, ఇతరత్రా కార్యక్రమాలను నిషేధిస్తూ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయరామరాజు గురువారం ఉత్తర్వులు జారీచేశారు. వీటి నిర్వహణకు కొందరు ఆర్జేడీలు, డీఈవోలు, ప్రధానోపాధ్యాయులు అనుమతిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, పాఠశాలల పనివేళలకు ముందు, తర్వాత, సెలవు రోజుల్లో కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇకపై ఎట్టిపరిస్థితుల్లో అలాంటివాటికి అనుమతులు ఇవ్వకూడదని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. సెలవు రోజులైనా ఇవే నిబంధనలు వర్తిస్తాయన్నారు.

మద్యం కొనుగోలు టెండర్ల ఖరారుకు కమిటీ

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి): మద్యం కొనుగోలు టెండర్ల ఖరారుకు కమిటీని నియమిస్తూ ఎక్సైజ్ శాఖ గురువారం ఉత్తర్వులు జారీచేసింది. కమిటీ ఛైర్మన్‌గా విశ్రాంత హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.సునీల్ చౌదరి, సభ్యులుగా చార్టెడ్ అకౌంటెంట్ మీనావలి మచర్‌రావు, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి బీఆర్ మీనాలను నియమించింది. ఈ కమిటీ మద్యం కంపెనీలతో చర్చలు జరిపి, వారికి చెల్లించే ధరలపై ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తుంది.

'విద్యుత్'పై అభ్యంతరాలకు గడువు పెంచాలి: సీపీఐ

అమరావతి, నవంబరు 14(ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల పెంపుపై అభ్యంతరాలను స్వీకరించడానికి గడువును ఈ నెలాఖరు వరకు పెంచాలని ఏపీఈఆర్‌సీని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ కోరారు. విద్యుత్ చార్జీల భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని, లేనిపక్షంలో ఈనెల 19న వామపక్షాల ఆధ్వర్యంలో విజయవాడలో భారీ నిరసన కార్యక్రమం చేపడతామని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

కాల్చేశారు

(మొదటి పేజీ తరువాయి)

ఆర్.పి.సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వులను పరిశీలిస్తే మదనపల్లె ఫైళ్ల దహనం కేసులో ఎవరి పాత్ర ఏమిటి? తెరవెనక ఏం జరిగిందన్నది సిసోడియా స్పష్టంగా బయటపెట్టారు.

ఇవీ అభియోగాలు

'రాష్ట్రంలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ చాలా పెద్దది. రాజకీయ నేతలు, రెవెన్యూ అధికారులు కుమ్మక్కై విలువైన అసైన్డ్ భూములను చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా నిషేధిత జాబితా 22(ఏ) నుంచి తొలగించారు. ఆ భూములను ఫ్రీ హోల్డ్ చేయడంలో అవినీతి, అక్రమాలు జరిగాయి. మాజీ ఆర్డీవో మురళి, ఆర్డీవో హరిప్రసాద్‌తో పాటు సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్ అవినీతిలో మునిగిపోయారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మనుషులకు అడ్డగోలుగా భూములను ఫ్రీ హోల్డ్ చేసి లంచాలు తీసుకున్నారు. ఈ అక్రమాలు బయటకు రాకుండా ఉండేందుకు పక్కా ప్లాన్ ప్రకారమే సబ్‌కలెక్టర్ ఆఫీసుకు నిప్పుపెట్టారు. అక్కడ జరిగింది అగ్నిప్రమాదం కానేకాదు. అదో నేరపూరితమైన కుట్ర. మాజీ ఆర్డీవో మురళి, మాజీ మంత్రి పెద్దిరెడ్డి పీఏ తుకారామ్, పెద్దిరెడ్డి కీలక అనుచరుడు మాధవరెడ్డి ఆదేశాల మేరకే సీనియర్ అసిస్టెంట్ ఈ కుట్రను అమలు చేశారు. మిగతా విషయాలు సీఐడీ విచారణలో తేలాల్సి ఉంది' అని రెవెన్యూ శాఖ పేర్కొంది.

10 రోజులు గడువు

మదనపల్లె సబ్ కలెక్టర్ ఆఫీసు తగలబెట్టిన తర్వాత సిసోడియా అక్కడికి వెళ్లారు. నాలుగు రోజులు విచారణ జరిపి నివేదిక ఇచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించింది. ఆ వెంటనే నాటి ఆర్డీవో హరిప్రసాద్, మాజీ ఆర్డీవో మురళి, సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ తేజ్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇప్పుడు వారిపై అభియోగాలు మోపుతూ ఉత్తర్వులు జారీ చేశారు. పది రోజుల్లోగా ప్రభుత్వానికి లిఖిత పూర్వక సమాధానం ఇవ్వాల్సి ఉంది. వారిచ్చే సమాధానాల ఆధారంగా తదుపరి చర్యలు ఉంటాయి. తాజా ఉత్తర్వుల ప్రకారం మదనపల్లె ఉదంతంలో ఎవరిపాత్రేమిటో సిసోడియా స్పష్టంగా పేర్కొన్నారు.

ఏం జరిగిందంటే...

మదనపల్లె సబ్‌కలెక్టర్ ఆఫీసులో జూలై 21వ తేదీ రాత్రి 11:30 గంటలకు అగ్గిరాజుకుంది. ఆఫీసులో అసైన్డ్ భూములు, చుక్కల భూములున్న విభాగంలోనే 2,440 ఫైళ్లు కాలిపోయాయి. సంఘటన జరిగిన 17 నిమిషాల్లో ఫైర్‌ఇంజన్‌లు వచ్చి మంటలు ఆర్పాయి. ఆ తర్వాత మంటల నుంచి 700 ఫైళ్లు బయటకు తీశారు. అందులో కొన్ని పాక్షికంగా కాలిపోయాయి. ఈ సంఘటన కూటమి సర్కారు వచ్చిన కొత్తలో జరగడంతో అలజడి రేగింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి మనుషులే ఈ దారుణానికి ఒడిగట్టారని ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఈ ఉదంతంపై సీఐడీ విచారణ చేస్తోంది. తొలుత ఇది అగ్నిప్రమాదమని అనుకున్నారు. కానీ అది కుట్ర అని తేలింది.

రెవెన్యూ శాఖ ప్రాథమికంగా నిర్ధారించిన అంశాలు

- మదనపల్లె డివిజన్‌లో 79,107 ఎకరాల అసైన్డ్ భూమిని ఫ్రీ హోల్డ్ చేయాలని రెవెన్యూ అధికారులు ప్రతిపాదించారు. కలెక్టర్ 74,374 ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేశారు. 4,732 ఎకరాల ఫ్రీ హోల్డ్ ప్రతిపాదనలను తిరస్కరించారు. వీటిని పరిశీలిస్తే.. భారీగా భూములను అక్రమంగా నిషేధిత జాబితా నుంచి తొలగించి ఫ్రీ హోల్డ్ చేసేలా తహసీల్దార్లు ప్రతిపాదనలు పంపించారు. ఇందులో చాలా వరకు 2003 తర్వాత అసైన్డ్ చేసినవి ఉన్నాయి. అంటే.. అవి ఫ్రీ హోల్డ్‌కు అర్హత లేనివి. మదనపల్లె ఆర్డీఓ ఇలాంటి అనేకానేక అక్రమ ప్రతిపాదనలను కలెక్టర్‌కు పంపించారు. ఈ అక్రమాలను కప్పి పుచ్చుకునేందుకే నిప్పు కుట్రకు పాల్పడ్డారు.
- సబ్‌కలెక్టర్ ఆఫీసులో షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరగలేదు. నేరపూరిత కుట్రలో భాగంగా జరిగిన ఘటన. ఇది బయటి వ్యక్తులు చేసిన పనిగా కనిపించడం లేదు.
- కీలక రికార్డులున్న ఆఫీసులో సీసీ కెమెరాలు పని చేయలేదు. రికార్డు రూమ్‌లోకి ఇంజిన్ ఆయిల్ తీసుకువచ్చారు. అక్కడే దోమల అగరబత్తీలను వెలిగించారు. దీనివల్ల మంటలు త్వరగా వ్యాపించాయి. మంటలు మరింత వేగంగా వ్యాపించేలా కొన్ని రకాల రసాయనాలను కూడా వాడారు.
- భూముల ఫైళ్ల పరిష్కారంలో అక్రమాలు జరిగాయి. చుక్కల భూములు, డి.పట్టా భూములను 22(ఏ) నుంచి అడ్డగోలుగా తొలగించారు. ఆ ఆధారాలను ధ్వంసం చేసేందుకు కుట్రకు పాల్పడ్డారు. ఆధారాలను పరిశీలిస్తే... సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ కుట్రను అమలు చేసినట్లుగా ఉంది.
- మాజీ ఆర్‌డీవో మురళి నేరపూరిత కుట్రలకు పాల్పడ్డారు. భూములకు సంబంధించి అనేక తప్పుడు నివేదికలు తయారు చేశారు. కీలకమైన భూములను 22(ఏ) నుంచి తొలగించి ప్రైవేటు వ్యక్తులకు అందించడానికి తప్పుడు రిపోర్టులు సృష్టించి, ఫోర్జరీ సంతకాలు చేశారు. ఇలా భారీగా భూములు ప్రైవేటు వ్యక్తులకు వెళ్లేలా చేశారు.
- ఆర్డీవో హరిప్రసాద్ నేరపూరిత నిర్లక్ష్యానికి పాల్పడ్డారు. భూముల కేసుల్లో అవినీతికి పాల్పడటం, ఆఫీసు వ్యవహారాల్లో బాధ్యతగా వ్యవహరించకపోవడం వంటివి జరిగాయి. ఆఫీసు పరిధిలో 7 సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించి వెంటనే చర్యలు తీసుకోలేదు. ఇదీ తీవ్రమైన అంశమే.
- సీనియర్ అసిస్టెంట్ గౌతమ్ నేరపూరిత కుట్రలో పాల్గొనడంతో పాటు సంతకాల ఫోర్జరీ, తప్పుడు రికార్డుల తయారీలో భాగస్వామి అయ్యారు. కీలక రికార్డులున్న గదిలోకి మంటలను త్వరగా వ్యాపింప చేసే ఇంజిన్ ఆయిల్ తీసుకొచ్చి పెట్టారు. రికార్డ్ రూమ్‌లో దోమల నివారణ స్టిక్‌లను వెలిగించి వెళ్లిపోయారు.
- పెద్దిరెడ్డి మనుషులు అక్రమ పద్ధతుల్లో భూముల ఫైళ్లు సెటిల్ చేయించుకునేందుకు ఆర్‌డీవో, ఇతర అధికారులను అవినీతిలో ముంచెత్తారు. దీంతో నోట్‌ఫైల్స్‌ను మార్చేశారు. ఫోర్జరీ సంతకాలతో తప్పుడు పత్రాలు సృష్టించారు.
- మురళి మదనపల్లె ఆర్‌డీఓగా ఉన్నప్పుడు, బదిలీ అయిన తర్వాతా పెద్దిరెడ్డి మనుషులతో ప్రైవేటు భేటీలు నిర్వహించారు. రహస్యమైన ప్రభుత్వ సమాచారాన్ని ప్రైవేటు వ్యక్తులకు చేరవేశారు. తప్పుడు రికార్డులు సృష్టించారు. ఫోర్జరీ సంతకాలు చేయించారు. తన కింది ఉద్యోగులను కూడా తన లాగే తప్పుడు బాటలో నడవాలని ఆదేశించారు.

అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధం పొడిగింపు

▸▸ మరో నెల పెంచుతూ రెవెన్యూ శాఖ ఉత్తర్వులు

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

యాజమాన్య హక్కులకు అర్హతగల (ఫ్రీహోల్డ్) అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్లపై నిషేధాన్ని మరో నెల పొడిగిస్తూ రెవెన్యూశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూముల రిజిస్ట్రేషన్‌పై ఆగస్టులో విధించిన నిషేధం గడువు ఈనెల 10తో ముగిసింది. అయితే, భూముల పునఃపరిశీలన కార్యక్రమం ఇంకా పూర్తికాకపోవడం, ఇప్పటికీ అనేక జిల్లాల్లో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్ వివరాల పరిశీలన కొలిక్కిరాకపోవడంతో నిషేధ ఉత్తర్వులను మరో నెల రోజుల పాటు పొడిగించారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోడియా మెమో జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1976కు గత వైసీపీ ప్రభుత్వం సవరణలు చేసిన సంగతి తెలిసిందే. భూమి అసైన్‌మెంట్ చేసిన 20 ఏళ్ల తర్వాత రైతు పొజిషన్‌లో ఉంటే పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేలా చట్టసవరణ చేశారు. దీన్ని గత ఏడాది డిసెంబరులో అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం జీఓ 596 ఇచ్చింది. అయితే, ఈ జీఓను వైసీపీ నేతలు, రెవెన్యూ అధికారులు దుర్వినియోగం చేశారు. అర్హతలేని భూములను, రైతులు పొజిషన్‌లో లేని భూములను నిషేధ జాబితా 22(ఏ) నుంచి తొలగించారు. వాటిని అడ్డగోలుగా ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఇలా 1.72 లక్షల ఎకరాలను జీఓకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తొలగించారు. రికార్డుల పరిశీలనలో ఈ అంశం వెలుగుచూసింది. ఈ రికార్డుల పరిశీలన ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు.

రాజకీయ సమాధిని జగనే తవ్వుకుంటున్నారు

▸▸ ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, నవంబరు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత జగన్.. తన రాజకీయ సమాధిని తానే తవ్వుకుంటున్నాడని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు గురువారం ఎక్స్‌లో పోస్టు చేశారు. "ఎన్డీయే కూటమి పేరులోనే ప్రజాస్వామ్యం ఉంది. పాలనకు సంబంధించిన విషయాలపై ప్రభుత్వం నుంచి సమాధానాలు కోరే ఏ గొంతునూ అణగదొక్కాలనే ఉద్దేశం మాకు లేదు. రాజకీయంగా మళ్లీ లాభపడే ఉద్దేశంతో అరెస్టు అవ్వాలని, ఆ విధంగా వ్యవస్థ స్పందించాలనే దురుద్దేశంతో జగన్ ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ ఆయనకు నిరాశే మిగులుతుంది. ఆయన కోరుకుంటున్న విధంగా అరెస్టు చేయం. ఎవరైనా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తే చట్టం తన పని తాను చేస్తుంది" అని మంత్రి పేర్కొన్నారు.

'కృష్ణపట్నం సిటీ'కి మహర్దశ

(మొదటి పేజీ తరువాయి)

రూపురేఖలు మార్చనున్న చెన్నై-బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్ (సీబీఐసీ)కు ప్రధాని మోదీ త్వరలో శంకుస్థాపన చేయనున్నారని తెలిపారు. కృష్ణపట్నం నోడ్‌లో పోర్ట్ ఆధారిత అభివృద్ధి పూర్తయి భవిష్యత్ అవసరాలను దృష్టి పెట్టుకుని నిర్మించే బ్రహ్మాండమైన గ్రీన్ ఫీల్డ్ పారిశ్రామిక టౌన్‌షిప్ 2026 నాటికి వెలుస్తుందని చెప్పారు. జగన్ ప్రభుత్వంలో వేగంగా చర్యలు తీసుకుని ఉంటే ఇప్పటికే అక్కడ భారీ అభివృద్ధి సాధ్యమయ్యేదని అన్నారు. సీఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే ఈ కారిడార్ ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నారని, భూసేకరణ శరవేగంతో పూర్తిచేశారని తెలిపారు. ప్రధాని మోదీ, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్‌తో చంద్రబాబు రెండు, మూడుసార్లు చర్చలు జరిపారని చెప్పారు. మూడు దశల్లో మొత్తం 11,098 ఎకరాలు ఈ కారిడార్‌లో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ నోడ్ తొలిదశలోనే దాదాపు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, పోర్టు, రహదారి అనుసంధానంతో పాటు నాణ్యమైన రవాణా సౌకర్యాలు ఇక్కడ ఏర్పడతాయని సైనీ చెప్పారు.

కొప్పర్తి నోడ్‌లో 54,500 ఉద్యోగాలు

ఓర్వకల్లు, కొప్పర్తి నోడ్‌లకు కూడా భూసేకరణ పూర్తయిందని, పర్యావరణ అనుమతులు వచ్చాయని, మార్చిలోపు ఈపీసీ కాంట్రాక్టు పూర్తవుతుందని సైనీ తెలిపారు. 2027-28లో కొప్పర్తి నోడ్ పూర్తవుతుందన్నారు. జగన్ ప్రభుత్వం అమరావతిలో రాజధాని నిర్మించకూడదని నిర్ణయిస్తే... కొప్పర్తి నోడ్‌తో కడప జిల్లాను కూడా అభివృద్ధి పరిచేందుకు చంద్రబాబు చర్యలు తీసుకున్నారని కొనియాడారు. ఒక్క కొప్పర్తి నోడ్‌లోనే 54,500 ఉద్యోగాలు లభిస్తాయని అన్నారు. హైదరాబాద్- బెంగళూరు పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా నిర్మిస్తున్న ఓర్వకల్లు నోడ్‌లో కర్నూలు జిల్లాలో 4,742 ఎకరాల మేరకు పెద్దఎత్తున పారిశ్రామికాభివృద్ధి జరుగుతందని, దాదాపు 45వేల మందికి ఇక్కడ ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఆహారోత్పత్తులు, జౌళి, ఇంజనీరింగ్ ఉత్పత్తులపై ఇక్కడ ప్రధానంగా దృష్టి సారిస్తున్నారని వెల్లడించారు. కొప్పర్తి, ఓర్వకల్లు నోడ్‌లకు సంబంధించి జగన్ హయాంలో పనులు నత్తనడకన సాగాయని ఆరోపించారు. ఈ రెండు నోడ్‌లలోనూ స్మార్ట్ సిటీలు ఏర్పడతాయని, వీటికి భారీఎత్తున పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం ఉందని సైనీ పేర్కొన్నారు.

హత్య కుట్రకు సూత్రధారి గౌతంరెడ్డే

(మొదటి పేజీ తరువాయి)

నిందితులను అరెస్టు చేసిన పోలీసులు, మిగిలిన వారిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను నియమించారు. ఆ వివరాలను పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీషాలి, కె.తిరుమలేశ్వరరెడ్డి, మురళీకృష్ణ నాయుడు, ఏడీసీపీ రామకృష్ణ, ఏసీపీ స్రవంతిరాయ్‌తో కలిసి గురువారం వెల్లడించారు.

ప్లాన్‌కు కేంద్రం గౌతంరెడ్డి కార్యాలయం..

శాస్త్రిపై దాడికి గౌతంరెడ్డి కార్యాలయం కేంద్రంగా వ్యూహాలు రచించారు. అక్కడ ఉంటూ సెటిల్‌మెంట్లు చేసే న్యాయవాది పృథ్వీరాజ్, అతని స్నేహితుడు అనిల్ దాడిలో కీలకంగా వ్యవహరించారు. వీరి స్వగ్రామం జగ్గయ్యపేట మండలం చిల్లకల్లు. ఉమామహేశ్వరశాస్త్రి విషయాన్ని గౌతంరెడ్డి ముందుగా పృథ్వీరాజ్‌కు చెప్పాడు. తర్వాత మొత్తం విషయాన్ని తాను చూసుకుంటానని భరోసా ఇచ్చాడు. శాస్త్రిని ఏం చేయాలన్నదానిపై స్కెచ్‌లు రూపొందించుకున్నారు. శాస్త్రి కాలు గానీ, చేయి గానీ తీసేసి బయటకు రాకుండా చేయాలని నిర్ణయించుకున్నారు. ఇలా చేస్తే అతడు పోరాటానికి రోడ్డెక్కే అవకాశం ఉండదని భావించారు. దీనికి సుపారీగా గౌతంరెడ్డి రూ.25 లక్షలు నిర్ణయించాడు. తర్వాత పృథ్వీరాజ్, అనిల్ కలిసి గౌతంరెడ్డి కార్యాలయంలో ప్లాన్ రూపొందించుకున్నారు.అనంతరం అనిల్ చిల్లకల్లుకు వెళ్లి అక్కడ కూలీ పనులు చేసుకునే గడ్డం వినోద్, తాలూరి గణేశ్, దేవళ్ల వంశీ, ఉప్పతోల్ల అశోక్‌కుమార్‌లను కలిశాడు. ప్లాన్‌లో భాగంగా వారికి ఖర్చుల నిమిత్తం రూ.80 వేలు ఇచ్చాడు. ఈ నలుగురు రెండుసార్లు శాస్త్రిపై దాడికి వెళ్లారు. గతనెల 31వ తేదీ రాత్రి ఇద్దరు దాడి చేయడానికి శాస్త్రి ఇంటి లోపలకు వెళ్లగా.. మరో ఇద్దరు యాక్టివాపై వచ్చి కాపలాగా ఉన్నారు. తర్వాత ఈనెల 6న మధ్యాహ్నం ఈ నలుగురు యువకులు శాస్త్రి ఇంటి వద్దకు వచ్చారు. ఇద్దరు యువకులు సత్యనారాయణపురం ఫుడ్ జంక్షన్ వైపు నుంచి నడుచుకుంటూ వెళ్లారు. మరో ఇద్దరు బైక్‌పై వచ్చి శాస్త్రి ఇంటికి సమీపాన బైక్‌ను ఆపి కాపలాగా నిలబడ్డారు. తర్వాత నలుగురు కలిసి ఉమామహేశ్వరశాస్త్రిపై దాడిచేశారు. తమకు రూ.80 వేలు అనిల్ ఇచ్చాడని పోలీసులకు నిందితులు నలుగురు తెలిపారు.

విచక్షణారహితంగా దాడి..

కబ్జాకు గురైన తన స్థలం విషయంలో ఉమామహేశ్వరశాస్త్రి కొన్నేళ్లుగా పోలీసులు, కోర్టులు, మీడియా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆయన ఫిర్యాదులను పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేశారు. తనకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ఆయన పలుమార్లు పోలీసు కమిషనర్‌ను కలిశారు. ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం 12.18 గంటలకు ఉమామహేశ్వరశాస్త్రి పోలీసు కమిషనర్‌కు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. గౌతంరెడ్డి విజయవాడలో ఒక విషపురుగని, ఇలాంటి వారిని ఏరివేయాలని పేర్కొన్నారు. తర్వాత ఒంటిగంటకు పోలీసులకు ఫోన్ చేసి.. గుర్తుతెలియని వ్యక్తులు తనపై దాడి చేశారని, టవల్‌ను మెడకు బిగించారని, మర్మాంగాలపై కాళ్లతో తన్నారని, కత్తులు చూపించి బెదిరించారని ఉమామహేశ్వరశాస్త్రి ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన పోలీసులు శాస్త్రి ఇంటికి ఎదురుగా ఉన్న దుకాణంలో సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలించారు. నలుగురు ప్రహరీ దాటి శాస్త్రి ఇంటి లోపలకు వెళ్లినట్లు ఫుటేజీలో స్పష్టంగా కనిపించింది. ఇంట్లో నుంచి ఆ యువకులు పరుగులు తీసుకుంటూ బయటకు వచ్చినట్టు రికార్డయింది. ఇందులో ముగ్గురు ఫుడ్‌కోర్టు వైపునకు, మరొకరు శివాలయం వైపునకు పారిపోయినట్టు స్పష్టమైంది. ఆ యువకులు బీఆర్‌టీఎస్ రోడ్డులో నుంచి తెలుపు రంగు హోండా జాజ్ కారులో ఎక్కి వెళ్లిపోయినట్టు తేలింది. నిందితులు ఉపయోగించిన బైక్ న్యాయవాది పృథ్వీరాజ్‌కు చెందినదని, కారు గుంటూరుకు చెందిన వెంకటేశ్వరరాజుది కాగా, దీన్ని గౌతంరెడ్డి అనుచరుడు పురుషోత్తమరావు కొన్నాడని పోలీసులు గుర్తించారు. వారి కాల్‌డేటాను పరిశీలించగా పృథ్వీరాజ్, అనిల్, పురుషోత్తమరావు, గౌతంరెడ్డి మధ్య ఎక్కువ కాల్స్ ఉన్నట్టు నిర్ధారించారు.



నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలు

పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో ఆరుగురు నిందితుల పేర్లను చేర్చగా.. మొత్తం 9మంది పాత్ర ఉన్నట్టు నిర్ధారించారు. ఏ1గా పూనూరు గౌతంరెడ్డి ఉన్నాడు. నలుగురు నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపారు. గౌతంరెడ్డి, పృథ్వీరాజ్, అనిల్, గౌతంరెడ్డి డ్రైవర్ బండ శ్రీను, బిట్ర పురుషోత్తమరావు పరారీలో ఉన్నారు. వారికోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గౌతంరెడ్డి కడపలో గానీ, నెల్లూరులో గానీ తలదాచుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.



తొలి నుంచీ నేరచరిత్రే

రెండు హత్యలు.. రెండు హత్యాయత్నాలు.. ఖాళీగా కనిపించిన జాగాల్లో పాగా.. ఏపీ ఫైబర్‌నెట్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు పూనూరు గౌతంరెడ్డి నేర చిట్టా ఇది. ఉమామహేశ్వరశాస్త్రి హత్యకు సుపారీ గ్యాంగ్‌ను పురమాయించిన తర్వాత పోలీసు అధికారులు గౌతంరెడ్డి ట్రాక్ రికార్డును పరిశీలించారు. కమిషనరేట్ మొత్తంలో అతనిపై 42 కేసులు నమోదయ్యాయి. ఇందులో రెండు హత్యలు, రెండు హత్యాయత్నాలు, ఒక డెకాయిటీ, రెండు దోపిడీ, రెండు చీటింగ్ కేసులు ఉన్నాయి. సత్యనారాయణపురం పీఎస్‌లో 23, అజిత్‌సింగ్‌నగర్ పీఎస్‌లో నాలుగు, వన్‌టౌన్‌లో ఒకటి, గవర్నరుపేటలో ఒకటి, కృష్ణలంకలో రెండు, నున్న పోలీస్‌స్టేషన్‌లో మూడు కేసులు నమోదయ్యాయి. గౌతంరెడ్డిపై రౌడీషీట్ ఉండేది. రాజకీయ పలుకుబడితో దాన్ని తీసేయించుకున్నట్టు సమాచారం. పదవులను అడ్డుపెట్టుకుని, సెటిల్‌మెంట్లు చేసి గౌతంరెడ్డి భారీగా ఆస్తులను కూడబెట్టినట్టు ఆరోపణలు ఉన్నాయి. వైసీపీలో చేరాక ఫైబర్‌నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవి పొంది భారీగా దందాలు చేశాడనే ఆరోపణలు ఉన్నాయి. గౌతంరెడ్డి కుమార్తె లిఖితను వైఎస్ భారతి సమీప బంధువులకు ఇచ్చి వివాహం చేశాడు. ఉమామహేశ్వరశాస్త్రిపై హత్యాయత్నంతో బయటకు వచ్చిన గౌతంరెడ్డి నేరచరిత్రను పోలీసులు పరిశీలిస్తున్నారు. న్యాయనిపుణులతో చర్చించాక ఒక నిర్ణయం తీసుకుంటామని పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు చెప్పారు.

200 కిలోల కేక్‌తో ఎమ్మెల్యే మద్దిపాటి బర్త్‌డే



కిలోనో.. రెండు కిలోలో కాదండోయ్.. ఏకంగా 200 కిలోల కేక్... గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పుట్టినరోజు వేడుకల కోసం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన సింహా టీమ్ సభ్యులు చేయించిన భారీ కేక్ ఇది. ఏదైనా కొత్తగా చేయాలనే ఉద్దేశంతో ట్రాక్టర్‌పై దీన్ని తయారుచేయించారు.. గురువారం ఉదయం దాన్ని దూబచర్ల నుంచి ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు పుట్టినరోజు వేడుకలు జరుగుతున్న నల్లజర్లలోని హోటల్ వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చి కట్ చేయించారు. అనంతరం ఆ కేక్‌ను ఊరంతా పంచి పెట్టారు.

- గోపాలపురం, ఆంధ్రజ్యోతి

వానరమూక.. ఆకలి కేక!





మనిషి స్వార్థానికి అడవులు బలవుతున్నాయి. అడవుల్లో ఉండాల్సిన వానరాలు తిండి కోసం జనావాసాల్లోకి వచ్చేస్తున్నాయి. ఆకలితో అల్లాడుతూ దున్నిన పొలాల్లో.. ద్విచక్ర వాహనాల్లో.. ఎక్కడ బడితే అక్కడ తిండి కోసం వెతుకులాడుతున్నాయి.

- గుంటూరు

శ్రీవారికి 2 కోట్ల వైజయంతి వజ్రహారాలు



తిరుమల శ్రీవారి ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి గురువారం రూ.2 కోట్ల విలువైన వైజయంతి వజ్రహారాలు కానుకగా అందాయి. టీటీడీ మాజీ ఛైర్మన్ డీకే ఆదికేశవులు కుమార్తె తేజేశ్వరీ శ్రీనివాసమూర్తి, మనవరాలు చైతన్య కుటుంబ సభ్యులు కలిసి ఈ మూడు హారాలను శ్రీవారి ఆలయంలో అధికారులకు అందజేశారు. అత్యంత పురాతన వజ్రాలు, నీలాలతో వీటిని బెంగళూరులో తయారు చేయించామని చైతన్య చెప్పారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.